16-04-2024
మంగళవారం
హైదరాబాద్

సంపుటి 26, సంచిక: 297
పేజీలు: 12 | ఖమ్మం : 8+8
కరీంనగర్ : 8+8 | మహబూబ్‌నగర్: 12
వెల రూ. 5.00

Published from:
Hyderabad, Khammam,
Karimnagar, Mahabubnagar

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

# న్యాయవ్యవస్థను అణగదొక్కే ప్రయత్నం

## సిజెఐకి 21 మంది మాజీ న్యాయమూర్తుల లేఖ

**న్యూఢిల్లీ:** దేశంలో న్యాయవ్యవస్థను అణగదొక్కేందుకు, ఒత్తిడి పెంచి తమ స్వార్థ ప్రయోజనాలను కాపాడుకొనేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌కు 21 మంది మాజీ న్యాయమూర్తుల బృందం ఒక లేఖ రాసింది. తప్పుడు సమాచారం, బహిరంగంగా అవమానించడం వంటి చర్యల ద్వారా న్యాయవ్యవస్థపై ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ మాజీ న్యాయమూర్తులు తమ లేఖలో పేర్కొన్నారు. సంకుచిత రాజకీయ లేదా వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఈ విమర్శకులు న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడానికి కుట్ర చేస్తున్నట్టు ఆరోపించారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తులు



జస్టిస్ దీపక్ వర్మ, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ ఎంఆర్ షా కూడా భారత ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాసిన బృందంలో ఉన్నారు. కొంత మంది ప్రతిపక్ష నాయకులపై అవినీతి ఆరోపణలు రావడం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ వంటి ప్రభుత్వ సంస్థలు వారిపై తరువాయి 2లో

### ప్రధాని వ్యూహాత్మక ప్రచారంలో ఓ భాగం.. : కాంగ్రెస్

న్యాయవ్యవస్థను అణగదొక్కడానికి కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయంటూ సుప్రీంకోర్టు, వివిధ హైకోర్టులకు చెందిన 21 మంది మాజీ న్యాయమూర్తులు భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డివై చంద్రచూడ్‌కు లేఖ రాయడాన్ని ప్రధాని నరేంద్ర మోడీ వ్యూహాత్మక ప్రచారంలో ఓ భాగంగా కాంగ్రెస్ అభివర్ణించింది. ఇటీవల కాలంలో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న న్యాయస్థానాలను బెదరించేడానికి ఉద్దేశించిందని న్యూఢిల్లీలోని ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ వ్యాఖ్యానించారు. 'లేఖ రాసిన తరువాయి 2లో

# ఆగస్టు 15 నాటికి రుణమాఫీ



## వానాకాలం సీజన్ నుంచి వడ్లకు రూ. 500 బోనస్ : రైతులు అధైర్యపడొద్దు

### 15 ఎంపి సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేస్తాం : నారాయణపేట కాంగ్రెస్ జనజాతర భారీ బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం / మహబూబ్‌నగర్ ప్రతినిధి

రాష్ట్రంలోని ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం ఎన్నికల నియమావళి అమలులో వచ్చినందువల్ల తాను రైతు రుణమాఫీ చేయలేక పోయానని, ఎన్నికల అనంతరం మొత్తం 69 లక్షల మంది రైతులకు ఏక మొత్తంలో, ఏక కాలంలో రుణమాఫీ చేస్తామన్నారు. వచ్చే సీజన్‌లో పండించే వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి ప్రతి గింజా కొంటామని, రైతులు అధైర్యపడవద్దని సిఎం భరోసా ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో 15 ఎంపి సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే ముదిరాజ్ బిడ్డను మంత్రిగా చేస్తానని మాటిచ్చారు. మాదిగల వర్గీకరణ జరగాల్సిందేనని, వారికి న్యాయం జరగాల్సిందేనని, భవిష్యత్‌లో మాదిగలకు మరిన్ని పదవులు ఇచ్చి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ మద్యం కేసులో బిడ్డను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జైలులో పెట్టగానే కవితకు బెయిల్ కోసం మోడీ కాళ్ల వద్ద తెలంగాణాను కెసిఆర్ తాకట్టు పెట్టారని, రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఓడించడానికి మోడీ వద్ద కెసిఆర్ సుఫారి తీసుకుని చీకటి ఒప్పందం చేసుకున్నారని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపేటలో సోమవారం జరిగిన కాంగ్రెస్ జనజాతర భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బహిరంగ సభకు భారీ సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరయ్యారు. సభలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి నేతలు బిఆర్‌ఎస్‌కు ఓటేశారని, ఇప్పుడు బిజెపికి బిఆర్‌ఎస్ వేయాలనుకుంటున్నారని ఆరోపించారు. రెండు పార్టీలు చీకటి ఒప్పందం పెట్టుకుని చేవెళ్ల, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్, జహీరాబాద్, భువనగిరి నియోజకవర్గాల్లో బిఆర్‌ఎస్ డమ్మీ అభ్యర్థులను పెట్టి బిజెపికి సహకరిస్తున్నారన్నారు. ఈ ఐదు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందని, అందుకే ఆ నియోజకవర్గాల్లో బిఆర్‌ఎస్ ఓట్లు బిజెపికి బదిలీ చేసి తనను అడ్డుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆయన తరువాయి 2లో

# 'తరుగు'తో అన్యాయం చేస్తే చర్యలు

## పండిన ప్రతి గింజనూ తప్పక కొనుగోలు చేస్తాం

### ధాన్యం కొనుగోలు అంశంలో బిఆర్‌ఎస్, బిజెపి అవాస్తవాలు మాట్లాడుతున్నాయి

### పౌర సరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పండిన ప్రతి గింజనూ తప్పక కొనుగోలు చేస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తరుగు పేరుతో రైతులకు అన్యాయం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతాంగం ఒక్క గింజ ధాన్యాన్ని కూడా కనీస మద్దతు ధరకు తక్కువకు అమ్ముకోవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు అంశంలో బిఆర్‌ఎస్, బిజెపి అవాస్తవాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తరువాయి 2లో

# రూ.4,650 కోట్లు జప్తు

## సార్వత్రిక ఎన్నికలవేళ ఎటుచూసినా డబ్బు, మద్యం, డ్రగ్స్ : 75 ఏళ్ల రికార్డ్ బ్రేక్



**న్యూఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికల వేళ దేశంలో నగదు, మద్యం ఏరులైపారుతోంది. అయితే ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఎక్కడికక్కడ పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తోంది. దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీల్లో ఇప్పటి వరకు రూ. 2,069 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు సహా రూ. 4,650 కోట్లు మేరకు సీజ్ చేసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. 2019 సార్వత్రిక ఎన్నికల సమయంలో జప్తు చేసిన దానికంటే ఇది ఎక్కువ కావడం గమనార్హం. గత ఎన్నికల సమయంలో మొత్తంగా రూ. 3,475 కోట్లు స్వాధీనం చేసుకోగా, ఈసారి భారీ ఇప్పటి వరకే భారీ స్థాయిలో అక్రమ నగదు, ఇతర తాయిలాలు పట్టుబడినట్లు ఇసి పేర్కొంది. దేశంలో తరువాయి 2లో

# సాధారణం కంటే ఎక్కువే...

## ఈ ఏడాది 106 శాతం వర్షపాతం నమోదు

### భారత వాతావరణ శాఖ అంచనా



**న్యూఢిల్లీ:** దేశంలో ఈఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదు అవుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. దీర్ఘకాల సగటు ఎల్‌పిఎతో పోలిస్తే వచ్చే రుతుపవనాల సీజన్‌లో 106 శాతం వర్షపాతం నమోదు కావచ్చని తెలిపింది. వచ్చే సీజన్‌లో ఎల్‌పిఎ 87 సెంటీమీటర్లగా అంచనా వేసింది. లానినా పరిస్థితులు వర్షాలకు అనుకూలంగా ఉండడం వల్ల ఆగస్టు–సెప్టెంబరు నాటికి ఎక్కువ వర్షపాతం నమోదు కావచ్చని వెల్లడించింది. వాయవ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. 1951 నుంచి 2023 వరకు ఎల్‌నినో తర్వాత లానినా వచ్చిన సందర్భాల్లో భారత్‌లో 9 సార్లు సాధారణం తరువాయి 2లో

## కవిత తాత్కాలిక బెయిలుపై

# 22 లోపు జవాబివ్వండి

### సిబిఐకి ప్రత్యేక న్యాయస్థానం నోటీసు

### 23వ తేదీ వరకూ జైలులోనే...



**న్యూఢిల్లీ :** బిఆర్‌ఎస్ పార్టీ నాయకురాలు కల్వకుంట్ల కవితపై అవినీతి ఆరోపణల కేసులో బెయిలు దరఖాస్తుకు సంబంధించి ఢిల్లీ కోర్టు సోమవారంనాడు సిబిఐకి నోటీసు జారీ చేసింది. ఆమె బెయిలు దరఖాస్తుపై ఈనెల 22 నాటికి కోర్టుకు తగిన సమాధానం చెప్పాలని సిబిఐ–ఇడి న్యాయస్థానం ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా సిబిఐ అధికారులను కోరారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయని, ఈ ఎన్నికల్లో తాను ప్రధానంగా ఒక స్టార్ క్యాంపెనర్‌గా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనవలసి ఉందని, అందువల్ల తనకు బెయిలు మంజూరు చేయాలని కోర్టుకు దాఖలు చేసిన దరఖాస్తులో ఆమె పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కుమార్తె తరువాయి 2లో



# రైతుల ఆందోళన

## జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ఖాళీ బస్తాలకు నిప్పు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి

జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం రైతులు ఆందోళన చేశారు. ప్రభుత్వం, వ్యాపారులు కొనుగోలు చేయడం లేదంటూ మార్కెట్ కార్యాలయం ముందు ఖాళీ బస్తాలను తగలబెట్టారు. ధర తగ్గిస్తే ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. అధికారులు వ్యాపారులతో చర్చలు జరిపి చివరకు తరువాయి 2లో

# ఎసిబి వలలో అధికారులు

**హైదరాబాద్:** అవినీతికి పాల్పడుతున్న పలువురు అధికారులను వివిధ చోట్ల తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.18 వేలు లంచం తీసుకుంటూ నల్లగొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సోమశేఖర్ ఎసిబికి చిక్కారు. ఆస్పత్రిలో ఫార్మసీకి అనుమతి ఇచ్చేందుకు లంచం డిమాండ్ చేయగా.. సమాచారం అందుకున్న అధికారులు పక్కా ప్రణాళికతో ఆయన్ని అదుపులోకి తరువాయి 2లో

# పారదర్శకంగా ఎన్నికలు



## అవాంఛనీయ ఘటనలు జరగనివ్వొద్దు : తెలంగాణ, ఎపి ప్రభుత్వాలు నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్

లోక్‌సభ ఎన్నికలు పారదర్శకంగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిర్వహించేందుకు మరింత సమన్వయంతో పని చేయాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఉభయ రాష్ట్రాల అంతర్రాష్ట్ర ఎన్నికల సంబంధిత అంశాలపై హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, డిజిపి రవిగుప్త, అడిషనల్ డిజిలు శివధర్‌రెడ్డి, మహేష్ భగవత్, ఆంధ్రప్రదేశ్ అడిషనల్ డిజి శంకబ్రత బాగ్చి, ఎపి వాణిజ్య పన్నులు, ఎక్సయిజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డా. రజత్ భార్గవ, తెలంగాణ పిసిసిఎఫ్ ఆర్.ఎం. దొబ్రియెల్,ఎపి పిసిసిఎఫ్ చిరంజీవి చౌదరి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ మే 13 న జరిగే పోలింగ్‌ను సక్రమంగా నిర్వహించేందుకు ఇప్పటికే సరిహద్దు రాష్ట్రాల పరిధిలోని జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశాలు నిర్వహించామని వివరించారు. అక్రమ మద్యం, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు వివిధ వస్తువుల రవాణా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేశామని, శాంతి భద్రతల పరిస్థితి కూడా పూర్తిగా అదుపులో ఉన్నదని తెలిపారు. ఇదే రకమైన వాతావరణాన్ని పోలింగ్ వరకు మరింత పకడ్బందీగా కొనసాగించేందుకు ఉభయ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల స్థాయి సమావేశం దోహదపడుతుందని తెలిపారు. గోవా, కర్నాటక తదితర రాష్ట్రాల నుండి అక్రమ మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువులు రాకుండా ఆయా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న చెక్‌పోస్టులలో మరింత అప్రమత్తత అవసరమని అన్నారు. ఇప్పటికే, తరువాయి 8లో




# కెసిఆర్ వల్లే కరువు

## ఎన్నికల కోడ్ వల్లే ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆలస్యం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

రాష్ట్రంలో కరువుకు కారణం మాజీ సిఎం కెసిఆర్ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. జలవనరుల వినియోగంలో కెసిఆర్ అనుసరించిన విధానాల వల్లే నేడు కరువు ఏర్పడిందన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ బిఆర్‌ఎస్ చేసే రైతు దీక్షలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. వర్షాభావ పరిస్థితులతో ఏర్పడిన కరువును తరువాయి 2లో

## గిరిజన గ్రామాల్లో

# గొంతెండుతోంది...

ప్రజాపక్షం/ ఖమ్మం



తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గిరిజన గ్రామాలు నీటి కోసం అల్లాడుతున్నాయి. గిరిజన గ్రామాల సమీపంలోని జల వనరులు వట్టిపోయాయి. అడవుల్లో మౌలిక వసతులకు దూరంగా జీవించే గిరిజనులకు ఎన్నడూ రానంత ఇబ్బంది ఈ ఏడాది వచ్చింది. ఏడెనిమిది మాసాలుగా వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు ఇంకిపోయాయి. గతంలో ఐటిడిఎ ఏర్పాటు చేసిన బోర్లు ఎండిపోయాయి. గిరిజనుల పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో యేటా కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నా ఏ వైపుకు వెళ్తున్నాయో కానీ గిరిజనుల దరి చేరడం లేదు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థల (ఐటిడిఏ) ద్వారా ఖర్చు చేసిన గణాంకాలను చూస్తే ఆశ్చర్యం అనిపిస్తుంది. గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కోసం కోట్లాది తరువాయి 2లో

## కేజ్రీవాల్‌కు మరో

# 8 రోజులు జ్యుడీషియల్ కస్టడీ



**న్యూఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరో ఎనిమిది రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలోనే ఉంటారు. ఆయనకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ సోమవారంతో ముగిసింది. ఐతే మరో 14 రోజులు కేజ్రీవాల్‌ను కస్టడీకి అనుమతించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కోరారు. ఐతే కోర్టు మాత్రం ఎనిమిది రోజులే గడువు ఇచ్చింది. దాంతో ఆయన ఈనెల 23 వరకూ జ్యుడీషియల్ కస్టడీలో ఉండవలసి ఉంటుంది. ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో కేజ్రీవాల్ కోర్టు విచారణ జరిగింది. న్యాయస్థానం ఈనెల 1వ తేదీన కేజ్రీవాల్‌కు జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. అవినీతి సొమ్మును లెక్కల్లో చూపించకుండా అక్రమ మార్గాల్లో తరలించి ఇతర అవసరాలకు వాడుకున్నారన్న ఆరోపణలపై కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు పిఎంఎల్‌ఏ చట్టం కింద అరెస్టు చేశారు. ఢిల్లీ మద్యం విధానాన్ని రచించడంలో పూర్తిగా కేజ్రీవాల్ భాగస్వామ్యం ఉందని, దీనికి అనుగుణంగా ఆయన మద్యం వ్యాపారులకు మేలు చేయడం కోసం ముడుపులు తరువాయి 8లో

ప్రపంచం

# మళ్ళీ తెరమీదకు ఇరాన్ వ్యతిరేక కూటమి

## ఇక ఏం చేస్తారు? ఇరాన్‌కు బైడెన్ ప్రశ్న
## ఇరాన్‌కు జి–7, భద్రతామండలి విజ్ఞప్తులు

**టెల్‌అవీవ్ :** ఇరాన్ చేసిన ప్రత్యక్షదాడిని ఇజ్రాయిల్ భగ్నం చేసిందని ఇక తర్వాత ఇరాన్ ఏం చేస్తుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రశ్నించారు. ఇరాన్ అనుకున్నవిధంగా ఇజ్రాయిల్‌పై దాడి చేసిందనీ, ఆదాడిని ఐడిఎఫ్ భగ్నం చేసిందనీ, ఇక ఇరాన్ తర్వాత ఏం చేయబోతోందనీ జోర్డాన్ రాజు అబ్దుల్లాతో ఆదివారం నాడు ఫోన్ భేటీ సందర్భంగా బైడెన్‌రెచ్చగొట్టే ప్రకటన చేశారు. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాతో కూడా ఫోన్‌లో మాట్లాడారు. ఇరాన్‌పై ప్రతిదాడి చేయవద్దని ఆయనకు చెప్పారు. అలాచేస్తే అమెరికా సహకారం ఉండదని బైడెన్ చెప్పినట్లు వైట్‌హౌస్ పేర్కొంది. కాగా ఇరాన్‌కు వ్యతిరేకంగా ఒక ప్రత్యేక కూటమి ఏర్పాటు చేసేందుకు ఇజ్రాయిల్ ప్రయత్నాలు ప్రారంభించింది. పశ్చిమ ఆసియాలో ఇరాన్‌కు వ్యతిరేకంగా ఒక వ్యూహాత్మక యుద్ధ కూటమిని ఏర్పాటు చేయాలని అమెరికా చాలా దీర్ఘకాలంగా ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ఆలోచనలు ఇప్పుడు మళ్ళీ తెరమీదకు వచ్చాయి. ఈ కూటమి ఏర్పాటుకు ఇదే సరైన తరుణమని అమెరికా భావిస్తున్నది. ఇరాన్ ప్రయోగించిన క్షిపణలు, డ్రోన్లను కూల్చివేసేందుకు ఇజ్రాయిల్ పొరుగుదేశమే సహాయం చేసిందనీ, ఈ సహాయం ఇకమీదట కూడా కొనసాగుతుందని వార్తలు గుప్పుమన్నాయి. గల్ఫ్ దేశాలు ఈ పరిణామాలను పెద్దగా చేసి చూసేందుకు ఇష్టపడటంలేదని కూడా అమెరికా చెబుతున్నది. అదే సమయంలో ఐక్యరాజ్యసమతి భద్రతామండలి శనివారంనాడు ఒక అత్యవసర సమావేశం నిర్వహించింది. జి–7 దేశాలు మావేశం జరిపాయి. యూరోపియన్ యూనియన్ కూడా విదేశాంగ మంత్రులస్థాయీ అత్యవసర సమావేశం జరిపింది. సహనం పాటించాలని చైనా, రష్యా దేశాలు ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. ఇలా అతే పరరిస్థితినని అదుపు చేడం కష్టమని జి–7 దేశాల సమావేశం (అమెరికా, ఇటలీ, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్, కెనడా) ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితిని స్థిరీరించేందుకు కృషి చేస్తామని జి–7 దేశాలు ఒక సంయుక్త ప్రకటన చేశాయి. ఐక్యరాజ్యసమితి సమావేశంలో రష్యా రాయబారి వాస్సిలీ నెబెంజ్ ఒక ప్రకటన చేస్తూ, పూర్తి స్థాయిలో వేచి చూసే ధోరణి అవలంబించాలని ఇరాన్‌ను కోరారు. భద్రతామ మండలలో అమెరికా రాయబారి కూడా మాట్లాడుతూ, ఇరాన్ వాస్తవాలు గ్రహించాలని, యుద్ధం విస్తరించకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఈ పూర్వరంగంలో వైట్‌హౌస్ ప్రతినిధి జాన్ కిర్బై వ్యాఖ్యానిస్తూ తదుపరి చర్యలు ఏమిటో ఇరాన్ సైన్యం నిర్ణయించుకోవాలని, రాబోయే పరిణామాలకు ఆ దేశ నిర్ణయమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని అన్నారు. యుద్ధం కొనసాగించాలా? ఇంతటితో ఆగిపోవాలా? అనేది ఇరాన్ ఇష్టంపైనే ఆధారపడి ఉందన్నారు. ఇరాన్ తాను చేసిన దాడులకు తగినమూల్యం చెల్లించేవిధంగా ప్రాంతీయస్థాయిలో ఒక కూటమి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇజ్రాయిల్ అధికారిక ప్రతినిధి చెప్పారు. ఇరాన్ దాడులు ఆపేందుకు సహకరించడంకోసం ఒక ప్రాంతీయ సంస్థను ఇరాన్‌కు వ్యతిరేకంగా ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని భావిస్తున్నాయని, లేకపోతే తర్వాత తమ ఉనికి కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని ఆ దేశాలు భావిస్తున్నాయని ఆ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ఇరాన్ చేసిన దాడుల్లో ఎక్కువ భాగం డ్రోన్లు, క్షిపణులు విధ్వంసం సృష్టించకుండా ప్రాంతీయ దేశమే ఇజ్రాయిల్‌కు సహాయం చేసిందని అక్కడిమీడియా ప్రచారంలోకి తెచ్చింది. ఈ పరిణామాలమధ్య ఇజ్రాయిల్, సౌదీ అరేబియా మధ్య సాధారణ సంబంధాలు నెలకునేవిధంగా అమెరికా ప్రయత్నాలు చేస్తున్నది. మద్దతుగా సౌదీ అరేబియాను మిత్రదేశంగా మార్చాలని చూస్తున్నది.



### 68 మంది పాలస్తీనియన్లు మృతి

గడచిన 24 గంటల్లో గాజాలో ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 68 మంది మరణించారు. ఇజ్రాయిల్ ఖాళీచేసిన ప్రాంతాలకు తిరిగి వెళుతున్న పాలస్తినీ ప్రజలపైన, సహాయ శిబిరాలపైన దాడులు చేస్తున్నది. ఆర్టిఫీషియల్ ఇంటిలిజన్స్ ద్వారా గాజాలో లక్షలాది నివాసిత భవంతులను కూల్చివేసిన ఇజ్రాయిల్‌పై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబుకుతుండగా, ఇరాన్‌వైపు వేలెత్తి చూపించి తప్పించుకునేందుకు ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమన్ నేతన్యాహూ ప్రయత్నం చేస్తున్నారు. యుద్ధం విరమించాలనీ, ఇది మరింత పెరిగితే ప్రజలకు ఆర్థిక కష్టాలు పెరుగుతాయని వార్ క్యాబినెట్‌పై ఇజ్రాయిల్‌లో అంతర్గతంగా ఒత్తిడి పెరుగుతున్నది. యుద్ధం విరమించాలని కోరుతూ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాగానీ నేతన్యాహూ పట్టించుకోకుండా మొండిగా ముందుకే వెళుతున్నారు. దాడి చేయాల్సిన పరిస్థితులు ఇజ్రాయిలే తీసుకువచ్చిందని ఇరాన్ సైనిక అధికారులు తాజా వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ నుండి ప్రమాదం ఉందని, ఈ విధమైన ప్రమాదం ఇజ్రాయిల్ నుండి ఎదురైనాగానీ తామూ ఇదేవిధంగా స్పందించేవాళ్ళమని అందువల్ల స్వీయ రక్షణకు తాము ప్రాధాన్యం ఇస్తామని జోర్డాన్ విదేశాంగమంత్రి ఐమన్ అల్ సఫదీ వ్యాఖ్యానించారు.

# ఏకం కండి : లేకపోతే సైన్యం జోక్యం

## పాక్ పార్టీలకు బిలావల్ భుట్టో హెచ్చరిక



**ఇస్లామాబాద్ :** ఆర్థికంగా కునారిల్లిపోతున్న పాకిస్థాన్ దేశాన్ని కాపాడేందుకు దేశంలోని రాజకీయపార్టీలన్నీ అహకారాన్ని పక్కనపెట్టి ఐక్యంగా కలిసి రావాలని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఛైర్మన్, బేనజీర్ భుట్టో కుమారుడు బిలావల్ భుట్టో జర్దారీ పిలుపు ఇచ్చారు. పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి జుల్ఫికర్ అలీ భుట్టోను ఉరితీసి సోమవారంనాటికి 45 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సింధ్ రాష్ట్రం లర్కానా జిల్లాలో జరిగిన ఒక సభలో బిలావల్ భుట్టో మాట్లాడుతూ, దేశ ఆర్థిక పరిస్థితిని బాగుచేసేందుకు రాజకీయపార్టీలన్నీ కలిసి రావాలని కోరారు. ధర్నాలు చేయడం మానేయాలని, ఆర్థికవృద్ధి సాధనకు కలిసి రావాలని అన్నారు. దేశాన్ని కాపాడటంలో రాజకీయ పార్టీలు విఫలమైతే సైన్యం తిరగబడుతుందని, సైన్యం జోక్యం చేసుకుంటుందని ఆయన హెచ్చరించారు.

# ఇక విశ్రాంతి తీసుకుంటా

## సింగపూర్ ప్రధాని లీ ప్రకటన



**సింగపూర్ :** సింగపూర్ దేశాన్ని ఇరవైయేళ్ళ పాటు అవిశ్రాంతంగా పరిపాలించిన ప్రధాన మంత్రి లీ సీన్ లూంగ్ పదవీ విరమణ చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. వచ్చేనెల 15వ తేదీన రాజీనామా ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. అదేరోజున తన స్థానంలో ఉప ప్రధానమంత్రి లారెన్స్ వోంగ్ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపడతారని కూడా ఆయన ప్రకటించారు. కరోనా మహమ్మారి కారణంగా తన రాజీనామాకు జాప్యం జరిగిందని ఆయన వివరణ ఇచ్చారు. 72 ఏళ్ళ వయసుగల లీ సీన్ లూంగ్ ఫేస్ బుక్ ద్వారా ఈ విషయం వెల్లడించారు. ఏ దేశానికైనా నాయకత్వం మార్పు అనివార్యం, ఆ ప్రక్రియ జరిగి తీరాల్సిందే అని ఆయన పేర్కొన్నారు. 2004 నుండి లూంగ్ ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పీపుల్స్ యాక్షన్ పార్టీకి ఆయన సెక్రటరీ జనరల్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుత ఉప ప్రధానమంత్రి లారెన్స్ కూడా ప్రజల విశ్వాసం చూరగొన్నారు.

# సూడాన్‌లో అంతర్యుద్ధం—ఆకలి కేకలు

## ఆర్మీ ముఠాల మధ్య యుద్ధానికి ఏడాది పూర్తి
## మరణం అంచున 2.20 లక్షలమంది పిల్లలు

**ఖార్టూమ్ :** సూడాన్‌లో అధికారం కోసం రెండు ఆర్మీ ముఠాల మధ్య జరుగుతున్న యుద్ధం ప్రారంభమై ఏప్రిల్ 15వ తేదీ నాటికి సరిగ్గా ఏడాదికాలం పూర్తయింది. ఈ ఏడాదికాలంలో సూడాన్ దేశం యావత్తూ సర్వనాశనమైంది. లెఫ్టినెంట్ జనరల్ అబ్దుల్ ఫతాహ్ అల్ బుర్హమన్ నాయకత్వానగల సైనిక బలగాలు, జనరల్ మహ్మద్ హమ్‌దాన్ దగలో నాయకత్వానగల పారామిలిటరీ ర్యాపిడ్ ఫోర్స్ మధ్య 2023 ఏప్రిల్ 15 న దేశాధికారంకోసం అంతర్యుద్ధం మొదలైంది. దేశ రాజధాని ఖర్టూమ్ మరుభూమిగా మారింది. దీంతో అక్కడ నివసిస్తున్న విదేశీయులు, జర్నలిస్టులు ఆయోమయంలో పడ్డారు. దోపిడీలు, విధ్వంసాలు పెరిగాయి. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం సూడాన్‌లో 50 లక్షల మంది కరువుకాటకాల్లో మగ్గుతున్నారు. పలుచోట్ల ఆహార సంక్షోభం ఏర్పడింది. దేశం అంతటా ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. ప్రజలు దుర్భర దారిద్ర్యంలోకి వెళ్ళారు. ఏడాదికాలంలో 25,000 మంది ప్రజలు ఈ రెండు ఆర్మీ ముఠాల అంతర్యుద్ధంలో మరణించారు. 2.20 లక్షలమంది పిల్లలు కొద్దివారాల గడువులోనే మరణించడానికి సిద్ధంగా ఉన్నారని ఐక్యరాజ్యసమితి తన తాజా నివేదికలో వెల్లడించింది. ఈ యుద్ధం కారణంగా రైతులు పంటలు పండించడం మానేశారు. పొలాల్లో రైతులు పంటలు పండించేందుకు యుద్ధం ఆటంకంగా మారింది. 18 లక్షలమంది ప్రజలు ప్రాణాలు చేతపట్టుకుని దేశం వదిలి పారిపోయారు. ఈ యుద్ధం కారణంగా సూడాన్ లోపలా వెలుపలా కూడా కోటీ 10 లక్షలమంది ప్రజలు ఆవాసాలు కోల్పోయారు. ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ సహాయ ప్రతినిధి గాడ్ ఫ్రీ అలుమీ అంచనా ప్రకారం సూడాన్‌లో 90 లక్షలమంది ప్రజలకు తక్షణం మానవతా సహాయం అందించవలసి ఉంది. ఐతే ఇప్పటివరకూ ఐక్యరాజ్యసమితి 2.6 బిలియన్ డాలర్లు మాత్రమే మానవతాసహాయం సేకరించిందని అలుమీ చెప్పారు. 65 శాతం సూడాన్ ప్రజలు తీవ్రమైన రోగాల బారిన పడ్డారు. వారికి ఆరోగ్య రక్షణ చర్యలు లేవని ఆయన చెప్పారు. సూడాన్‌లో పరిస్థితులపట్ల ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. 2.30 లక్షలమంది పిల్లలు, గర్భిణీలు తక్షణ సహాయం కోసం ఎదురుచూస్తున్నారని, వారంతా ఆకలితో అలమటిస్తున్నారనీ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది. గడచిన నాలుగు నెలలుగా ఐక్యరాజ్యసమితి మానవతా సహాయ విభాగం సూడాన్‌లో పరిమితస్థాయిలో అయినాగానీ సహాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఈ అంతర్యుద్ధం వల్ల 60.60 లక్షలమంది ఇళ్ళు కోల్పోయారని తెలియజేసింది. వెస్ట్ డార్ఫర్, ఖార్టూమ్ సహా విస్తారంగా ఉన్న గ్రామీణ ప్రాంతాలు అన్నిరకాలుగా నాశనమయ్యాయి.




# రష్యా సహా పలు దేశాల్లో వరదల బీభత్సం

## అఫ్గానిస్థాన్‌లో 33 మంది మృతి

**కాబూల్ :** గడచిన 15 రోజుల్లో పలు దేశాల్లో వరదలు, దావానలం బీభత్సం సృష్టిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగానే వరదలు పెను ప్రమాదంగా మారాయని శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ప్రధానంగా రష్యా, కర్ఘుజిస్థాన్,అఫ్గానిస్థాన్‌లలో వరదలు చరిత్రలో ఎన్నడూలేనంతగా విజృంభించాయి. అఫ్గానిస్తాన్‌లో వరదల కారణంగా సోమవారంనాటికి 33 మంది మరణించారు. 600 కిలో మీటర్ల మేరకు రోడ్లు కొట్టుకుపోయాయి. రష్యాలో, కర్ఘుకిస్థాన్‌లలో గడచిన 70 ఏళ్ళలో ఎన్నడూలేనంత ఉధృతంగా వరదలు విరుచుకుపడ్డాయి. కర్ఘుజికిస్థాన్‌లో 1.08 లక్షలమంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. రష్యాలో ఉరల్ నది ఉగ్రతాండవం చేయడంతో ప్రజలు వేలాదిమంది సురక్షిత ప్రాంతాలకు చేరుకున్నారు. ఉష్ణోగ్రతలు కూడా అనూహ్యస్థాయిలో పెరుగుతున్నాయి. మరోవైపు స్పెయిన్‌లో కూడా దావాలనం గ్రామాలను చుట్టుముట్టింది. ప్రజలను ప్రమాద ప్రాంతాల నుండి దూరంగా తరలించారు. మరోవైపు ఇండోనేసియాలో భారీ వర్షాలకు తానా తొంజా గ్రామాలలో కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో మృతుల సంఖ్య 18కి పెరిగింది. మరో ఇద్దరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. ఇదిలా ఉండగా చైనాలో గత ఏడాది ప్రకృతి వైపరీత్యాల కారణంగా 79 మంది మరణించారని తాజా నివేదిక పేర్కొంది. 3.3 బిలియన్ డాలర్ల మేరకు ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లింది. 26 రాష్ట్రాలలో కోటీ 40 లక్షలమంది ప్రజలు ప్రకృతి వైపరీత్యాలవల్ల తీవ్రంగా నష్టపోయారని నివేదిక పేర్కొంది.

# ఆగస్టు 15 నాటికి రుణమాఫీ

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కెసిఆర్ కూతురు కవితను జైలు నుంచి విడిపించేందుకు కెసిఆర్ తెలంగాణ ఆత్మగౌరవాన్నిమోడీ వద్ద తాకట్టు పెట్టారని విమర్శించారు. మోడీ వద్ద బిఆర్ఎస్‌ను ఎందుకు తాకట్టు పెట్టారో ఆ పార్టీ కార్యకర్తలు ఆలోచించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ ఐదు నియోజకవర్గాల్లో బిజెపికి ఓటు వేయాలని కెసిఆర్ చెబుతున్నారన్నారు. వంద రోజుల్లో రేవంత్‌రెడ్డిని పదవి నుంచిదించుతామని ప్రకటిస్తున్న కెసిఆర్ పదేళ్ల నుంచి అధికారంలో ఉంటూ తెలంగాణాకు అన్యాయం చేస్తున్న మోడీని పదవి నుంచి దించుతానని ఎందుకు చెప్పడంలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో ముదిరాజ్ జనాభా పది శాతం ఉందని, కానీ వారికి కెసిఆర్ ఒక్క టిక్కెట్ ఇవ్వలేదని విమర్శించారు. మక్తల్ నియోజకవర్గంలో ముదిరాజ్ బిడ్డకు కాంగ్రెస్ టిక్కెట్ ఇచ్చి గెలిపించుకున్నామని సిఎం గుర్తు చేశారు. బిఆర్ఎస్, బిజెపి ఏకమై సరితయాదవ్‌ను ఓడించారని, ఎన్ని కష్టాలు ఎదురైనా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ జెండాను వదలలేదన్నారు. కాంట్రాక్టర్లు, శ్రీమంతులకు కాంగ్రెస్ పార్టీ టికెట్లు ఇవ్వలేదని, అన్ని వర్గాలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పేదలు, బిసి కులాల వారికి టిక్కెట్లు ఇచ్చామని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో 15 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే ముదిరాజ్‌లకు మంత్రి పదవి ఇస్తామన్నారు. ముదిరాజ్‌లను బిసి డి నుంచి బిసి సిలోకి మార్చాలంటే కాంగ్రెస్ అభ్యర్థులు గెలవాలన్నారు. బంగ్లా రాజకీయాలను కుర్మ, యాదవులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. యాదవ బిడ్డ అనిల్‌కుమార్‌కు కు తాము రాజ్యసభ ఇచ్చి గౌరవించామన్నారు.

'పాలమూరు బిడ్డను... రైతుబిడ్డను... పేదింటి బిడ్డను... అలాంటి నేను ముఖ్యమంత్రిని అయితే ఎందుకు ఓర్వలేకపోతున్నారు? ఎప్పుడూ దొరల బిడ్డనే ముఖ్యమంత్రి కావాలా? ఆ తర్వాత మనవడు కావాలా? పాలమూరు బిడ్డ మాత్రం కావొద్దా? మా ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే శక్తి మాకు లేదా? కాగితాలపై సంతకం చేసే సత్తా మాకు లేదా?' అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

ఎస్‌సి వర్గీకరణ బాధ్యతను తాను తీసుకుంటా

అధికారంలో ఉన్నప్పుడు మాదిగలకు అన్యాయం చేసింది కెసిఆర్ కాదా? అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మాదిగలకు తమ ప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యతను ఇచ్చామన్నారు. వర్గీకరణకు పార్టీని ఒప్పించి బిల్లు పెట్టించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. మంద కృష్ణ మాదిగను అన్యాయంగా అరెస్ట్ చేస్తే గళమెత్తింది తానే అన్నారు.

## అణగదొక్కే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు తీసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో అధికార బిజెపి, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న తరుణంలో కొంత మంది మాజీ న్యాయమూర్తులు ఈ లేఖ రాయడం ప్రధాన్యతను సంతరించుకుంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఉద్దేశపూర్వకంగా దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పుతున్నదని వివిధ పార్టీల నేతలు ఆరోపిస్తుండగా, అవినీతిపరులపై చట్టప్రకారం విచారణ జరిపించడం, చర్యలు తీసుకోవడంలో తప్పులేదని బిజెపి వ్యాఖ్యానిస్తున్నది. అవినీతిని ప్రతిపక్షాలు ప్రోత్సహిస్తున్నాయని ధ్వజమెత్తుతున్నది. విచారణను ఎదుర్కొంటున్న పలువురు నేతలు కోర్టులను ఆశ్రయించడంతో, న్యాయ స్థానాలపైనే అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఇలావుంటే, న్యాయ వ్యవస్థ పవిత్రను, నిజాయితీని శంకించే విధంగా కొందరు చేస్తున్న వ్యాఖ్యల పట్ల మాజీ న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవ్యవస్థను ఇలాంటి వారి నుంచి రక్షించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. న్యాయవ్యవస్థ ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఉద్దేశించిన నిరాదారమైన ఆరోపణలను ప్రచారం చేయడం నుంచి న్యాయపరమైన ఫలితాలు లేదా తీర్పులు తమకు అనుకూలంగా ఉండేలా ప్రభావితం చేయడానికి కొన్ని శక్తులు పలు మార్గాల్లో ప్రయత్నించడం ఆందోళన కలిగిస్తున్నదని మాజీ న్యాయమూర్తులు తమ లేఖలో తెలిపారు. ఇలాంటి విమర్శలు లేదా ప్రవర్తన అనేది నిర్దిష్ట వ్యక్తులకు సంబంధించిన కేసులతోసహా, సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యత ఉన్న కేసుల్లో గమనించవచ్చని అన్నారు. న్యాయ స్వాతంత్ర్యానికి హాని కలిగించే విధంగా రహస్య ప్రయత్నాలు జరపడం వంటి ఈ సమూహాలు అనుసరిస్తున్న తీరు ప్రమాదకరమని హెచ్చరించారు. ఒకరి అభిప్రాయాలకు అనుగుణంగా ఉండే న్యాయపరమైన నిర్ణయాలను ఎంపిక చేసి ప్రశంసించడం, అలా లేని తీర్పులను తీవ్రంగా విమర్శించడం వంటి చర్యలు న్యాయ సమీక్ష, చట్ట నియామల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని మాజీ న్యాయమూర్తులు తమ లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థపై ఒత్తిడి పెంచుతాయని అంటూ, ఈ ప్రయత్నాలను, చర్యలను అడ్డుకోవడానికి సుప్రీం కోర్టు నేతృత్వంలో పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిని కాపాడాలని కోరారు. ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూల స్తంభంగా ఉండడం అత్యవసరమని, అస్థిరమైన రాజకీయ ప్రయోజనాలు, వ్యక్తిగత అభిరుచులకు అతీతంగా న్యాయవ్యవస్థ పనిచేసేలా చూడాలని మాజీ న్యాయమూర్తుల తమ లేఖలో సిజెఐకి విజ్ఞప్తి చేశారు. కాగా, కేసులు, విచారణల నేపథ్యంలోనే న్యాయస్థానాలపై కొందరు ఒత్తిడిని పెంచుతున్నారంటూ మాజీ న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం పరోక్షంగా కొంత మంది ప్రతిపక్ష నాయకులను విమర్శించడమేనని అంటున్నారు.

## 'తరుగు'తో అన్యాయం చేస్తే చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

గాంధీభవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధాన్యం కొనుగోలు అంశంలో పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు, ధాన్యం కొనుగోలును ఉత్తమ్ వివరించారు. ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రిసైకిలింగ్ మాఫియా తయారైందన్నారు. ధాన్యం కొనుగోలులో ప్రతి రైతుకి న్యాయం చేస్తామని భరోసనిచ్చారు. గత ఏడాది కంటే ఈ ఏడాది వారం ముందే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని, రబీలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కూడా పెంచామని, 'నిన్నటి వరకు(ఆదివారం) మొత్తం 2,69,699 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలలు చేశామని వివరించారు. అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనపు కొనుగోలు కేంద్రాలు తెరిచేందుకు అధికారులకు అనుమతి ఇచ్చామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే 6919 కేంద్రాలు ప్రారంభించామని, ఇదే సమయానికి గత ఏడాది గత ప్రభుత్వం కేవలం 335 ధాన్యం కేంద్రాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లాలో గత ఏడాది ఏప్రిల్ 15 నాటికి ఒక్క కేంద్రం కూడా తెరవలేదని, కానీ ప్రస్తుతం సిద్దిపేట జిల్లాలో ఇప్పటి వరకు 418 కొనుగోలు కేంద్రాలు ఉన్నాయన్నారు. మారుమూల గ్రామం, పల్లె అయిన కనీస మద్దతు ధరతో చివరి గింజను కూడా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఇప్పటికే అందుబాటులో పెట్టామని, కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు వెంటనే రవాణా చేసేలా ఆదేశాలు జారీ చేశామని ఉత్తమ్ తెలిపారు. రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకుల ద్వారా చెల్లించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. గతంలో ధాన్యం పాడవుతుందని ఎక్కువగా ఉన్న ధాన్యం అమ్మితే క్వింటా రూ.1702లకు వచ్చిందని, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసి ధాన్యాన్ని విక్రయిస్తే క్వింటాకు రూ. 2022 వచ్చిందన్నారు. గత ప్రభుత్వంలో సన్న బియ్యం,దొడ్డు బియ్యానికి తేడా లేకుండా వేలంలో అమ్మివేశారన్నారు. ఈ సారి ధాన్యం వేలం ద్వారా రూ.1110.05 కోట్లు ఎక్కువగా వచ్చాయన్నారు. గత 2022–23 సంవత్సరంలో గత ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ 23న ప్రారంభిస్తే, తాము ముందుగానే కేంద్ర ప్రభుత్వం అనుమతి ద్వారా గత నెల 23నే ప్రారంభించామని ఆయన చెప్పారు.

## గొంతెండుతోంది... (మొదటి పేజీ తరువాయి)

రూపాయలు ఖర్చు చేసినట్లు రికార్డులు చెబుతుండగా వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఈ ఏడాది జనవరి మొదటి వారం నుంచే తాగునీటి ఎద్దడిపై ప్రభుత్వం అప్రమత్తం కావాల్సి ఉంది కానీ ఆ పని చేయలేదు. తాగునీటి కొరత రానివ్వం అంటున్నారే తప్ప రానివ్వకుండా ఉండటానికి ఏమి చర్యలు తీసుకున్నారో, అవి క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయో లేదో తెలుసుకోవడం లేదు. ఇప్పుడు ఎండలు ముదిరే కొద్ది నీటి కోసం గిరిజనులు వాటర్ క్యాన్లు, కుండలు పట్టుకుని వెతుకులాట ప్రారంభించారు. వాటర్ క్యాన్లు మోయలేక నేలపై దొర్లించుకుంటూ నీటిని తరలిస్తున్నారు. ఉన్నతాధికారులు పట్టణాలలో వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేయడం హడావుడి చేయడం కాకుండా గిరిజన గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

## జవాబివ్వండి (మొదటి పేజీ తరువాయి)

కవిత సౌత్ గ్రూపు తరపున రూ.100 కోట్ల మేరకు ఆప్ పార్టీకి ముడుపులు ఇవ్వడంలో కీలకపాత్ర పోషించారని, తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని సిబిఐ పేర్కొంది. ఆమె రెగ్యులర్ బెయిలు దరఖాస్తు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నందువల్ల ఆమె తాత్కాలిక బెయిలు కోరుతూ మరో పిటిషన్ దాఖలు చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి తమ ప్రచారం కోసం దర్యాప్తు సంస్థలను ఆయుధాలుగా ఉపయోగించి ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురిచేస్తోందని కవిత తన పిటిషన్‌లో ఆరోపించారు. తన భాగస్వామ్యం ఉన్నట్లు ఆధారాలు లేవన్న విషయం దర్యాప్తు సంస్థలకు కూడా తెలుసునని ఆమె పేర్కొన్నారు. ఈ అవినీతి కేసులో తన భాగస్వామ్యం ఉందని తగిన ఆధారాలు లేవని ఆమె పదే పదే వాదిస్తున్నారు. ఈ పిటిషన్‌లో కూడా అదే విషయం పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీ వరకూ కవిత జ్యుడీషియల్ కస్టడీలో ఉంటారు. అప్పటికి ఆమె బెయిలు పిటిషన్‌పై విచారణ జరుగుతుంది.

## రూ.4,650 కోట్లు జప్తు

(మొదటి పేజీ తరువాయి)

ఏడు విడతల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్నట్లు మార్చి 16వ తేదీన ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను విడుదల చేసింది. మొదటి విడత పోలింగ్ ఈనెల 19వ తేదీన జరగనుంది. కాగా, ఇసి స్వాధీనం చేసుకున్న రూ. 4,658 కోట్ల విలువైన వాటిలో నగదు రూ. 395 కోట్లు ఉండగా, రూ. 489 కోట్ల విలువైన మద్యం ఉన్నట్లు ఇసి తెలిపింది. బట్టిబడిన వాటిలో 45 శాతం మాదక ద్రవ్యాలే (రూ. 2,069 కోట్లు విలువ చేసే) ఉన్నాయి. మార్చి 1వ తేదీ నుంచి రోజుకు రూ.100 కోట్ల విలువైన నగదు, ఇతర వస్తువులను జప్తు చేస్తున్నట్లు ప్రకటించింది. 75 ఏళ్ల సార్వత్రిక ఎన్నికల చరిత్రలో జప్తులు ఈసారే రికార్డుస్థాయిలో నగదు జప్తు జరిగిందని పేర్కొంది. ఎన్నికల్లో ధనప్రవాహం, ప్రలోభాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ తనిఖీలు ముమ్మరం చేస్తామని చెప్పింది. దేశ వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా బృందాలతో సహా సరిహద్దు చెక్‌పోస్టులు నిరంతరం పనిచేస్తున్నాయని, మాదకద్రవ్యాల రవాణాతోపాటు నగదు, మద్యం, తాయిలాల పంపిణీని అడ్డుకునేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించింది. అయితే జనవరి, ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా పట్టుబడిన వాటిలో 75 శాతం డ్రగ్స్ ఉండడంపై ఇసి ఆందోళన వ్యక్తం చేసింది.

## రైతుల ఆందోళన (మొదటి పేజీ తరువాయి)

సాయంత్రం కొనుగోళ్లు ప్రారంభించారు. జనగామ వ్యవసాయ మార్కెట్లో గత వారం రోజులుగా ధాన్యం గొడవ జరుగుతుంది. ధర తగ్గించి కొనుగోలు చేసిన వ్యాపారులపై అధికారులు కేసులు నమోదుచేశారు. మార్కెట్ కార్యదర్శిని సైతం సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో వ్యాపారులతో అధికారులు చర్చలు జరుపగా పలుమార్లు విఫలమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం వరకు కొనుగోళ్లు జరుపకపోవడంతో సుమారు 33వేల బస్తాల ధాన్యం మార్కెట్లో నిలిచిపోవడంతో రైతులు ఆందోళన చేశారు. వ్యాపారులు తాము ధర పెంచి కొనేది లేదని తేల్చి చెప్పిన నేపథ్యంలో ఆగ్రహానికి గురైన రైతులు ఖాళీ బస్తాలను తగలబెట్టారు. అనంతరం అధికారులు వ్యాపారులతో చర్చలు జరిపి సాయంత్రం కొనుగోళ్లు ప్రారంభించారు.

## ప్రచారంలో ఓ భాగం.. (మొదటి పేజీ తరువాయి)

న్యాయమూర్తుల జాబితాలో నాలుగో పేరు చూడండి. ఈ లేఖ లక్ష్యం.. నేపథ్యం ఏమిటో, దీనిని ఎవరు, ఎందుకు రాశారో.. లేఖ వెనుక ప్రధాన ఉద్దేశం ఏమిటో స్పష్టమవుతుంది' అంటూ సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎంఎర్ షా పేరును చెప్పకనే చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకం (ఇబిఎస్)ను రాజ్యాంగ విరుద్ధంగా ఇటీవల సుప్రీం కోర్టు కొట్టివేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. అదే విధంగా మణిపూర్‌లో రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలుగుతున్నదంటూ కేంద్ర ప్రభుత్వంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన అంశాన్ని కూడా జైరామ్ రమేశ్ ప్రస్తావించారు. అదే విధంగా పెద్ద నోట్ల రద్దుకు వ్యతిరేకంగా ఒక మహిళా న్యాయమూర్తి తీవ్ర విమర్శలు చేయడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. న్యాయవ్యవస్థ తన విధులను నిర్వర్తిస్తున్న సమయంలో, కేంద్ర ప్రభుత్వం ఇరుకున పడుతున్నదని ఆయన ఆరోపించారు. అందుకే, మోడీకి అనుకూలమైన న్యాయమూర్తులు రాసిన లేఖను, ఇంతకు ముందు 600 న్యాయవాదులు సిజెఐకి రాసిన లేఖ మాదిరిగానే చూడాల్సి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇదంతా స్వతంత్ర న్యాయవ్యస్థను నయపెట్టడానికి, బురదచల్లడానికి చేస్తున్న ప్రయత్నమేనని జైరామ్ రమేశ్ మండిపడ్డారు. 'న్యాయ స్వాతంత్ర్యానికి అతిపెద్ద ముప్పు కాంగ్రెస్ పార్టీ నుండి కాదు.. బిజెపి నుండి.... అది కూడా ప్రధాని మోడీ నుండి వచ్చింది' అన్నారు. న్యాయవ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకోవాలన్న ఉద్దేశంతో భయపెట్టేందుకు కూడా కేంద్రం వెనుకాడడం లేదని విమర్శించారు. ఈ లేఖ వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటో అందరికీ అర్థమవుతునే ఉందని వ్యాఖ్యానించారు.

## కెసిఆర్ వల్లే కరువు (మొదటి పేజీ తరువాయి)

నాలుగు నెలల క్రితం ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రుద్దడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వం చేసిన పాపా పుట్ట కదులుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు ఎన్నికల కోడ్ వల్ల కొంత ఆలస్యమవుతుందని చెప్పిన ఆయన కాంగ్రెస్ పాలనలో కెసిఆర్ పాలనను ప్రక్షాళన చేస్తూ ముందుకు సాగుతుందన్నారు. పదేళ్లుగా బిజెపి, బిఆర్ఎస్ చేయని పనులను నాలుగు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా చేస్తుందని ప్రశ్నించారు. ఏనాడూ ఈ రెండు పార్టీలు రైతులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. కమ్యూనిస్టులు తోడు వుండటం కాంగ్రెస్‌కు ఎంతో బలమన్నారు. ఈ స్నేహం ఎంతో వారికి కలసి వస్తుందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు కైవసం గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10వేలు నష్టపరిహారం ఇస్తామని చెప్పిన కెసిఆర్, అవి ఇవ్వలేదని కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలని అడగటం హాస్యాస్పదంగా ఉందన్నారు. అకాల వర్షాలకు, తాగునీరు లేక ఎండిపోయిన రూ.10వేల నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల పార్టీ కార్యదర్శులు బెజవాడ వెంకటేశ్వర్లు, నెల్లుట్ల సత్యం పాల్గొన్నారు.

## ఎసిబివలలో అధికారులు (మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. మరోవైపు ఆర్‌టిసి డ్రైవర్‌పై శాఖా పరమైన కేసు కొట్టివేసేందుకు హుజూరాబాద్ డిపో మేనేజర్ రూ. 20 వేలు లంచం డిమాండ్ చేశారు. ఎల్కతుర్తి హోటల్‌లో ఆ మొత్తాన్ని తీసుకుంటుండగా.. రంగంలోకి దిగిన ఎసిబి ఆయన్ని అరెస్టు చేసింది. ఆసిఫాబాద్‌లో ఎస్ఐ రాజ్యలక్ష్మి రూ. 25వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు ఓ వ్యక్తి నుంచి ఆమె రూ.40 వేలు డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది.

## సాధారణం కంటే ఎక్కువే...

(మొదటి పేజీ తరువాయి)

కంటే ఎక్కువ వర్షపాతం నమోదైందని ఐఎండి తెలిపింది.

**మంచి వర్షాలు కురుస్తాయ్!**

జూన్ నాటికి ఎల్‌నినో బలహీనపడనుందని భారత వాతావరణ శాఖ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. మే నెల నాటికి ఎల్‌నినో మరింత బలహీనపడి, జూన్ నాటికి పూర్తిగా తగ్గి తటస్థ పరిస్థితులు ఏర్పడతాయని పేర్కొన్నారు. జులై నెలాఖరు నాటికి లానినా పరిస్థితులు ఏర్పడనున్నందున మంచి వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు.

# 18వ లోక్‌సభ ఎన్నికల సమరం 2024

| పోలింగ్ | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 26 | మే 7 | మే 13 | మే 20 | మే 25 | జూన్ 1 | ఓట్ల లెక్కింపు |
|---|---|---|---|---|---|---|---|---|
| సీట్లు | 102 | 89 | 94 | 96 | 49 | 57 | 57 | జూన్ 4 |

## సమస్యకు 'బహిష్కరణ' పరిష్కారం కాదు

మణిపూర్‌లో కొనసాగుతున్న హింసను, అశాంతిని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండిస్తున్నది. సమస్య పరిష్కారానికి అటు రాష్ట్రంలో, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రయత్నించడం లేదన్నది వాస్తవం. అయితే, లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలన్న కుకీజోల నిర్ణయం సమస్యను ఏమాత్రం పరిష్కరించదు. కుకీజో గిరిజన తెగకు జరుగుతున్న అన్యాయానికి, వారు ఎన్నికల్లో పాల్గొనకపోవడానికి సంబంధం లేదు. ఒక రకంగా చెప్పాలంటే, వారి నిర్ణయం మణిపూర్‌లో యథాస్థితిని సమర్థించేదిగా ఉంది. మణిపూర్లో నెలల తరబడి సాగుతున్న జాతి హింస మైనారిటీ వర్గాలను స్థానభ్రంశం చేస్తున్నది. వారిని సమాజానికి దూరం చేస్తున్నది. వారి గొంతు నొక్కేస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో, ఎన్నికల్లో పోటీచేసి, గెలిచి, చట్టసభల్లో తమ వాదన వినిపించడమే ఉత్తమమైన మార్గం. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, కుకీజోమీ సామాజిక వర్గానికి చెందిన రాజకీయ నాయకులను పోటీ చేయవద్దని మణిపూర్‌లోని ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం ఆదేశించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. ఈ ఆదేశాల నేపథ్యంలో, కుకీజోమీలు ఎక్కువగా ఉండే ఔటర్ మణిపూర్ నియోజకవర్గం నుండి కూడా పోటీ చేయడానికి సంఘం నుండి అభ్యర్థులెవరూ సిద్ధం కాలేదు. ఓటింగ్ విషయానికి వస్తే, కొంతమంది పౌరులు ఉదాసీనత కారణంగా ఎన్నికలకు దూరంగా




ఉంటారు. కొందరు వ్యక్తులు నిరసనలు లేదా బహిష్కరణలు నిర్వహించడం ద్వారా పాలన సమస్యలపై తమ అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తారు. అయితే ఇలాంటి చర్యలు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న బిజెపి సర్కారుకు పరోక్షంగా లాభపడతాయే తప్ప, నిరసన వ్యక్తం చేస్తున్న లేదా బాధితులకు ఉపయోగపడవు. 2023 మే మాసంలో ఆధిపత్య మైటీ కమ్యూనిటీకి, కుకీజో మైనారిటీలకు మధ్య ప్రారంభమైన ఘర్షణ హింసాత్మకంగా మారిన వైనం తెలిసిందే. మైటీ వర్గానికి ఎస్‌టి హోదా కల్పించడమే కుకీజోల ఆగ్రహానికి, ఆందోళనకు కారణమైంది. కుకీజోల నిరసనలు, అందుకు ప్రతిగా మైటీల పోటీ ప్రదర్శనలు, దాడులు హింసకు దారితీశాయి. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకూ 200ల మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, కనీసం 60,000 మంది స్థానభ్రంశం చెందారు. అయినప్పటికీ, రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో కుకీజో వర్గం బలంగా ఉంది, అయితే మైటీస్ నియంత్రణలో ఉన్న మణిపూర్ రాజధాని ఇంఫాల్ నుండి వారు ఇతర ప్రాంతాలకు వెళ్లడంతో, ఇప్పుడు తిరిగి అక్కడి చేరుకోవడం కష్టమవుతున్నది. 60 మంది సభ్యులుగల అసెంబ్లీలో 10 మంది కుకీజోమీ శాసనసభ్యులు ఉన్నారు. అధికార బిజెపికి చెందిన ఈ ఎమ్మెల్యేలు కూడా శాసనసభ కార్యకలాపాల్లో పాల్గొనలేకపోతున్నారు. ఇక ఉద్యోగులు, ఇతరత్రా పనులు చేసుకునే కుకీజోల పరిస్థితిని ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవడం కష్టం కాదు. కాగా, ఔటర్ మణిపూర్ లోక్‌సభ నియోజకవర్గం షెడ్యూల్ తెగల అభ్యర్థులకు రిజర్వ్ అయింది. ఈ ప్రాంతంలో నివసించే నాగా మరియు కుకిజో తెగల మధ్య ఎప్పుడూ ఘర్షణలు రావణకాష్టంలా రగులుతునే ఉంటాయి. ఇప్పుడు కుకీజోమీ అభ్యర్థులు ఎవరూ లేనందున, లోక్‌సభ ఎన్నికలలో మూడు నాగా తెగలు, తంగ్‌ఖుల్స్, పౌమై, జెలియాంగ్రోంగ్ మధ్య పోటీ ఉంటుంది. ఈ నియోజకవర్గం పరిధిలోని ఎనిమిది రాష్ట్రాల అసెంబ్లీ సెగ్మెంట్లలో గిరిజనేతర ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఈ ప్రాంతాలలో ప్రధానంగా మైటీ, ముస్లిం ప్రజలు ఎక్కువ. వారు షెడ్యూల్ తెగల సభ్యులు కానందున, ఈ స్థానానికి పోటీ చేయలేరు. నియోజకవర్గంలోని మొత్తం ఓటర్లలో దాదాపు మూడింట ఒక వంతు మంది మైటీ, ముస్లింలు ఉండడంతో, వారు ఎవరికి ఓటు వేస్తారన్నది ఆసక్తి రేపుతున్నది. పోటీ నుంచి తప్పుకోవడం ద్వారా కుకీజోలు పరోక్షంగా తమ వ్యతిరేక వర్గానికి మద్దతునిస్తున్న వారు అవుతారు. అటు అభ్యర్థులను నిలబెట్టక, ఇటు ఓటు హక్కునూ వినియోగించుకోక కుకీజోలు సాధించేది ఏమిటి? వారికి ఎలా న్యాయం జరుగుతుంది? ఎన్నికల పరిష్కారమే సమస్యకు పరిష్కారం కాదని కుకీజోలు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

### రగులుతున్న మణిపూర్

బిజెపి సీనియర్ నాయకుడు, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా మణిపూర్ పర్యటనకు కొన్ని గంటల ముందే ఇద్దరు కుకీజో యువకులు హత్యకు గురికావడం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులను సృష్టించింది. మెజారిటీ వర్గమైన మైటీల చేతిలో కాంగ్పోక్పీ జిల్లా బొంగ్జాంగ్ గ్రామానికి చెందిన కమ్లెన్సట్ లుకింగ్ (25), కె. సజాగ్ గ్రామానికి చెందిన కమ్మిన్‌లాల్ లుఫెంగ్ (23)గా పోలీసులు గుర్తించారు. ఈ ఘటన మణిపూర్‌లో అల్లర్లకు కారణమవుతున్నది. ఇక్కడి పరిస్థితులనుగానీ, కొనసాగుతున్న మారణకాండనుగానీ, ఉద్రిక్త పరిస్థితులనుగానీ ఏమాత్రం పట్టించుకోకుండా చోద్యం చూస్తున్న అమిత్ షా సుమారు పది నెలల తర్వాత తిరిగి మణిపూర్ పర్యటనకు రావడం, అదే సమయంలో హత్యలు జరగడం అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటి వరకూ మృత దేహాలను వారివారి కుటుంబాలకు అప్పగించకపోవడం వెనుక అమిత్ షా పర్యటనే కారణమన్నది నిజం. మొత్తం మీద జంట సత్యల ఘటన మణిపూర్‌లో శాంతియుత ఎన్నికలు, కుకీజోల భద్రతపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. మణిపూర్‌లో లోక్‌సభ ఎన్నికలు ఈనెల 19, 26 తేదీల్లో, రెండు దశల్లో జరుగుతాయి.

## రాజకీయాలపై 'డిజిటల్' ప్రభావం

దేశ రాజకీయాలపై డిజిటల్ మీడియా ప్రభావం చాలా స్పష్టంగా కనిపిస్తున్నది. గతంతో పోలిస్తే ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన సమస్త సమాచారం చాలా తక్కువ సమయంలోనే ప్రజలకు చేరుతున్నది. నాణానికి బొమ్మా బొరుసు ఉన్నట్టుగానే డిజిటల్ మీడియాలోనూ మంచీచెడులు ఉన్నాయి. కొంత మంది దీనిని తమ స్వార్థానికి ఉపయోగించుకుంటున్న దాఖలాలు లేకపోలేదు. అయితే, దేశంలోని దాదాపుగా అన్ని పెద్ద పత్రికలు ఏదో ఒక రాజకీయ పార్టీకి లేదా



వ్యాపార సంస్థకు అనుకూలంగా వార్తలు రాస్తున్న తరుణంలో, డిజిటల్ మీడియా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. కార్పొరేట్ హస్తల నుంచి మీడియాను ప్రజలకు చేరువ చేసింది. పూర్తి వ్యాపార వస్తువుగా మీడియా మారకుండా కొంతలో కొంతైనా ఇప్పుడు సాధ్యమవుతున్నది. పెట్టుబడిదారులు లేదా ప్రముఖ రాజకీయ నాయకుల చేతుల్లో మీడియా ఉంటే, స్వతంత్రంగా రాయడం కష్టం. అవినీతిని, అక్రమాలను వెలికి తీయడం కష్టం. వాటిని జనంలోకి తీసుకెళ్లడం ఇంకా కష్టం. కానీ డిజిటల్ మీడియా ఈ పరిస్థితిని మార్చేసింది. మీడియాకు మరో కోణం కూడా ఉందని నిరూపించింది. 2019లో లోకేష్ బాత్రా అనే నేవీ విశ్రాంత ఉద్యోగి సమాచార హక్కు చట్టం ద్వారా కొన్ని ఆధారాలు సేకరించారు. ప్రభుత్వాలు కార్పొరేట్ కంపెనీల ద్వారా విరాళాలు పొందేందుకు ఎలాంటి పన్నాగాలు పన్నుతున్నాయో వివరిస్తూ, పూర్తి సమాచారాన్ని సిద్ధం చేశారు. వాటిని ప్రజలకు వివరించేందుకు నితిన్ సేథి అనే ఒక పరిశోధనాత్మక పాత్రికేయుడిని సంప్రదించారు. నితిన్ మనదేశంలో రెండు దశాబ్దాలుగా వివిధ అంశాలపై పరిశోధనాత్మక కథనాలు రాశారు. ప్రధాన మీడియాలో అతడికి స్వేచ్ఛ లేకపోవడంతో రిపోర్టర్స్ కలెక్టివ్ అనే సంస్థను ఏర్పాటు చేసి దానికి ట్రస్టీ గా వ్యవహరిస్తున్నారు. బాత్రా ఇచ్చిన ఆధారాలతో సేథి సంచలన కథనాలు రాశారు. అవి భారత దేశంలో ఎన్నికల బాండ్ల అసలు రూపాన్ని ప్రజల ముందు ఉంచాయి.. అసలు ఎన్నికల బాండ్లను ఎందుకు తెరపైకి తీసుకొచ్చారు? ఎన్నికలకు ముందు వాటిని అక్రమంగా ఎందుకు విక్రయించారు? రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చెప్పినప్పటికీ ఎందుకు పట్టించుకోలేదు? ఇలా అనేక అంశాలపై ప్రభుత్వ తప్పిదాలను వివరిస్తూ ఆరు భాగాల సిరీస్ ను సేథి రూపొందించారు. ఈ కథనాలను ముందుగా హఫింగ్టన్ పోస్ట్‌లో ప్రచురించారు. మిగతా వెబ్సైట్స్ కూడా వీటిని పబ్లిష్ చేశాయి. సేథి ఆధ్వర్యంలో రిపోర్టర్స్ కలెక్టివ్ ద్వారా ఈ విషయాలు మొత్తం బయటికి రావడంతో ఒక్కసారిగా దేశవ్యాప్తంగా పెను దుమారం చెలరేగింది. అయితే ఇటువంటి సంచలన వార్తను ప్రధాన మీడియా పట్టించుకోకపోవడం విశేషం. దేశంలో పేరుపొందిన మీడియా హౌస్ లు విస్మరించడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల బాండ్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని తూర్పార పట్టింది. ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చిన డబ్బులు, ఎవరు ఆ నగదు ఇచ్చారో పూర్తి వివరాలు తెలియజేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఆదేశించింది. కానీ ఈ విషయాన్ని పత్రికలు, చానల్స్ ప్రసారం చేయకపోవడం విశేషం. ఏదిఏమైనా మన దేశంలో అన్ని భాషల్లో కలిపి 21 వేల సర్టిఫైడ్ న్యూస్ పేపర్స్ ఉన్నాయి. 400కు మించి న్యూస్ చానల్స్ ఉన్నాయి. కానీ ఇవేవీ డిజిటల్ మీడియాతో పోటీ పడలేకపోతున్నాయి. కానీ, వాస్తవాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో అత్యధిక శాతం వార్తా పత్రికలు, చానెల్స్ విఫలమయ్యాయి. 'ఎక్స్' (ట్విట్టర్) నుంచి ఇన్‌స్టాగ్రామ్ వరకు... వాట్సాప్ నుంచి యుట్యూబ్ వరకూ.. టెలిగ్రామ్ నుంచి ఇంటర్నెట్‌లో ఇపేపర్ల వరకూ డిజిటల్ మీడియా పరిధి బహుముఖంగా విస్తరించింది. ఇప్పుడు ఎన్నికల సమయంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నది. దీనిని అవకాశంగా ఉపయోగించుకొని కొన్ని శక్తులు తప్పుడు సమాచారాలను, అబద్ధాలను ప్రచారం చేస్తున్నప్పటికీ, స్థూలంగా చూస్తే మాత్రం డిజిటల్ మీడియా సానుకూల ఫలితాలనే రాబడుతున్నది.

## వీడని ఖమ్మం చిక్కుముడి... ఖరారుకాని కాంగ్రెస్ అభ్యర్థి

### సంప్రదింపుల కమిటీ ఛైర్మన్‌గా భట్టివిక్రమార్క

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం అభ్యర్థి ఎంపిక కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గానే మారింది. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉండడం, పోటీచేసే అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం, అభ్యర్థిత్వాన్ని బలపరుస్తున్న నాయకులు బలమైన వారు కావడంతో అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి ఇబ్బందికరంగా మారింది. ఖమ్మం పార్లమెంటు స్థానం ఆది నుంచి కాంగ్రెస్‌కు పెట్టని కోట. తొలినాళ్లలో వరుసగా రెండు సార్లు కమ్యూనిస్టులు గెలిచిన తర్వాత ఇక కాంగ్రెస్‌కు ఎదురు లేకుండాపోయింది. ఆ తర్వాత ఒక సారి సిపిఎం, మరోసారి టిడిపి, వైకాపాలు విజయం సాధించాయి. 17 సార్లు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్సేతర పార్టీలు గెలిచింది ఐదుసార్లే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ టికెట్ తెచ్చుకుంటే చాలు పార్లమెంటు సభ్యునిగా ఎన్నికైనట్లేనన్న భావన నేతల్లో నెలకొంది. అందుకే అభ్యర్థిత్వం కోసం గట్టిగా పట్టుబడుతున్నారు. గతంలో జరిగిన ఒప్పందాలను పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధిష్టానం ముందుంచి నాకు ఇచ్చిన హామీని నిలబెట్టాలని గట్టిగా పట్టుబడుతున్నారు. పొంగులేటి బిఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరే సమయంలో కొన్ని శాసన సభ స్థానాలతో పాటు ఖమ్మం పార్లమెంటు స్థానం కూడా తాను




సూచించిన వ్యక్తులకే ఇవ్వాలని షరతు విధించగా అప్పట్లో అధిష్టానం దానికి పూర్తి అంగీకారం తెలిపింది. పార్లమెంటు ఎన్నికల ముంగిట తనకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఆయన గట్టిగానే ఒత్తిడి తేవడంతో పాటు ఒక్కింత కరుకుగా మాట్లాడినట్లు సమాచారం. ఖమ్మం పార్లమెంటు స్థానం కోసం తుమ్మల నాగేశ్వర రావు తనయుడు యుగంధర్, భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరులు పొంగులేటి ప్రసాదరెడ్డితో పాటు పలువురు పోటీ పడుతున్నారు. ఓ దశలో మంత్రుల కుటుంబ సభ్యులకు అవకాశం లేదన్న తర్వాత మాజీ టిడిపి నేత, ప్రస్తుత కాంగ్రెస్ నాయకుడు మండవ వెంకటేశ్వరరావు జిల్లాకు చెందిన వివిసి గ్రూస్ అధినేత రాజేంద్ర ప్రసాద్, రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, వి. హన్మంతరావు పేర్లు తెర పైకి వచ్చాయి. చివర్లో రాయల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావులలో ఎవరో ఒకరికి అవకాశం లభిస్తుందని భావించారు. ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర కాంగ్రెస్ నేతల సమావేశం తర్వాత మళ్లీ ప్రసాద రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మంత్రి పొంగులేటి నిరసన గళం, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్న డిమాండ్ నేపథ్యంలో పొంగులేటి ప్రసాదరెడ్డి పేరు తెర పైకి వచ్చింది. చివరకు నిర్ణయం తీసుకోలేని కాంగ్రెస్ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి ఖమ్మంజిల్లాకు చెందిన మల్లు భట్టివిక్రమార్కను సంప్రదింపుల కమిటీ ఛైర్మన్‌గా నియమించింది. ఖమ్మం పార్లమెంటు పరిధిలోని కాంగ్రెస్ నేతలు ఆశావాహులతో సంప్రదించి అభ్యర్థి పై ఏకాభిప్రాయాన్ని తీసుకు వచ్చే బాధ్యతను ఆయనకు అప్పగించారు.

ఇప్పటికే ప్రధాన విపక్షమైన బిఆర్‌ఎస్ అభ్యర్థిని ఎంపిక చేసి నియోజక వర్గాలు, మండలాల్లో తొలి దశ ప్రచారాన్ని పూర్తి చేశారు. బిజెపి అభ్యర్థి సైతం ప్రచారంలో ఉన్నారు. కానీ కాంగ్రెస్ అభ్యర్థినిని ఎంపిక చేయకపోవడం కాంగ్రెస్ క్యాడర్‌లో భిన్నాభిప్రాయాలకు తావిస్తుంది. మంత్రుల అనుచరులు ఏర్పాటు చేసుకున్న సామాజిక మాధ్యమాలలో ఒకరిపై ఒకరు ఎత్తిపొడుపులు, వ్యంగ్యాస్త్రాలు ప్రచారం చేసుకుంటూ క్యాడర్‌లో బేధాభిప్రాయాలను తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. మరింత తాత్సారం జరిగితే కాంగ్రెస్‌కు గెలుపోటముల సంగతి ఎలా ఉన్న అంతర్గతంగా ఇబ్బందులు తలెత్తి నష్టం జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ ఊపు కాస్త తగ్గినట్లుగా కనిపిస్తుంది. నవంబరు నాటి పరిస్థితులు ఇప్పుడు జిల్లాలో లేవన్నది వాస్తవం.

## విజయమే లక్ష్యంగా... పార్టీల వ్యూహరచన

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపి ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. 2008లో నూతనంగా ఏర్పడిన చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలో రెండుసార్లు బిఆర్‌ఎస్ విజయం సాధించింది. హ్యాట్రిక్ సాధించాలని బిఆర్‌ఎస్ ఉవ్విళ్లూరుతుంది. తొలిగెలుపుకోసం బిజెపి కసరత్తు చేస్తోంది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆ పార్టీని వీడి బిజెపిలో చేరి తొలి విజయం కోసం శ్రమిస్తున్నా రు. చేవెళ్ల రెండో విజయంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. 2009లో గెలిచిన ఆ పార్టీ అభ్యర్థి జైపాల్‌రెడ్డి, టిడిపి అభ్యర్థి జితేందర్‌రెడ్డిపై 18,532 ఓట్లతో గెలుపొందారు. కాంగ్రెస్ 2014, 2019లలో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయింది. 2014లో విశ్వేశ్వర్‌రెడ్డి కార్తీక్‌రెడ్డి పై 73,023 ఓట్లతో గెలుపొందారు. 2019లో రంజిత్‌రెడ్డి బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిపై 14,317 ఓట్లతో గెలుపొందారు. ప్రస్తుతం చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్,తాండూరు, పరిగి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఎంఎల్‌ఏలు ఉన్నారు. నాలుగు నియోజకవర్గల్లో బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఏలు ఉన్నారు. అయితే కాంగ్రెస్ అధికారంలో ఉండటం ఇతర పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో కొంతబలం పుంజుకుంది. చేవెళ్లలో వరుసగా మూడో



విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని బిఆర్‌ఎస్ ప్రణాళికలు రచిస్తోంది. 2014లో కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, 2019లో రంజిత్‌రెడ్డి విజయం సాధించారు. శాసనసభ ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిఆర్‌ఎస్ ఎంపి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి పోటీ చేస్తున్నారు. టిడిపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న కాసాని జ్ఞానేశ్వర్ బిఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. శాసనసభ ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు ఏడు నియోజకవర్గాల్లో కలిపి కాంగ్రెస్ కంటే 65,600 ఓట్లు అధికంగా వచ్చాయి. ఈసారికూడా గెలుస్తామని అంటున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని బిఆర్‌ఎస్‌కు ఓట్లు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది అని అన్నారు. బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన ఎంపి రంజిత్ రెడ్డి, బిఆర్‌ఎస్ నుండి కాసాని జ్ఞానేశ్వర్, బిజెపి నుండి విశ్వేశ్వర్‌రెడ్డి అభ్యర్థులు పోటీలో ఉంటున్నారు. బిఆర్‌ఎస్ నుండి ఇంచార్జీగా మహేశ్వరం ఎంఎల్‌ఏ సబితారెడ్డిని నియమించారు.

కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వేంనరేందర్‌రెడ్డిని నియమించగా, బిజెపి నుండి నియమించ లేదు, మూడు పార్టీలు మండల కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తు ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. బిఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం చేవెళ్ల నుండి ప్రారంభించిన మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్నికల సమాయత్తం చేశారు. బిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డికి వికారాబాద్ నియోజకవర్గ ముఖ్యనాయకులు అభ్యర్థికి సహకరించేది లేదని బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. స్పీకర్ ముందు ఎంపితో గొడవ జరిగినట్లు తెలుస్తుంది. వికారాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి ముందు ముందు ఏమి జరుగుతుందో చూడాలి అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## మెదక్‌లో బిఆర్‌ఎస్ ఖాళీ

### ఒక్కొక్కరిగా నాయకులంతా కాంగ్రెస్‌లోకి పయనం

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** గత పది సంవత్సరాల కాలంలో తిరుగు లేని శక్తిగా ఎదిగిన బిఆర్‌ఎస్ పార్టీకి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే భంగపాటు తప్పడం లేదు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వచ్చింది. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారాన్ని చేజికిచ్చుకుంది. సిఎం రేవంత్ చేపడుతున్న ఆపరేషన్ ఆకర్ష్ పూర్తి స్థాయిలో సక్సెస్ అవుతుందనడంలో సందేహం లేదు. ముఖ్యంగా మెదక్ జిల్లాలో 10 సంవత్సరాలుగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గలలో బిఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటల ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉద్యమ నాయకులు, బిఆర్‌ఎస్ ముఖ్య నేతలు కాంగ్రెస్ వైపు చూడడంతో ఆ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. మెదక్ నియోజకవర్గానికి గుండెకాయైన మున్సిపల్ పాలకవర్గం మొత్తం ఖాళీ అవుతుంది. బిఆర్‌ఎస్ నాయకులంతా హస్తం పార్టీ వైపు క్యూ కట్టడంతో బల్దియాలో నాయకులు కరువయ్యారు. మెదక్ జిల్లా కేంద్రంలో రోజురోజుకు రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. మెదక్



ఎంఎల్ఏ రోహిత్ రావు, మాజీ ఎంఎల్ఏ హనుమంతరావు సమక్షంలో బిఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులంతా కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. దీంతో మాజీ ఎంఎల్ఏ పద్మా దేవేందర్ రెడ్డి, పార్టీ ముఖ్య శ్రేణులు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. మెదక్‌లో ఉన్న బిఆర్‌ఎస్ పార్టీ ముఖ్య అనుచరులు పార్టీ వీడుతుండడంతో బిఆర్‌ఎస్ అయోమయంలో పడింది.

**ముఖ్య నాయకులంతా కాంగ్రెస్ గూటికి**

బిఆర్‌ఎస్ పార్టీలో ఉన్న ముఖ్య నాయకులంతా కాంగ్రెస్ గుటికి చేరుతున్నారు. నర్సాపూర్ మాజీ ఎంఎల్ఏ మదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అధిష్టాన పెద్దల సమక్షంలో చేరారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎంఎల్ ఎ రోహిత్ రావు సతీమణి శివాని రెడ్డి వ్యక్తిగత వాహనం మెదక్ పట్టణంలో అడ్డగింత కేసులో కీలకంగా ఉన్న వ్యక్తి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్, మాజీ ఎంఎల్ఏ హనుమంతరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చెరడం చర్చనీయాంశంగా మారింది.

మెదక్ మున్సిపల్ చైర్మన్ తొడుపూనూరి చంద్రపాల్ స్థానిక కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరారు. బిఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ వైపు వెళ్లడంతో త్వరలో జరగబోయే ఎంపి ఎన్నికలు బిఆర్‌ఎస్ పార్టీకి సవాల్‌గా మారనున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా కేంద్రంలో బిఆర్‌ఎస్ పార్టీకి పెద్ద సంఖ్యలో ఓట్లు గండి పడే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో ఎప్పటికప్పుడు రాజకీయ సమీకరణాలు వేగంగామారడం, నాయకులు,కార్యకర్తలు పార్టీలకండువాలు మార్చడం అధికార కాంగ్రెస్ పార్టీ, బిఆర్‌ఎస్, బిజెపి పార్టీలు ఎలాంటి పరిణామాలు ఎదుర్కొంటాయో వేచి చూడాల్సిందే.



## తెలంగాణ ప్రజలను మోసం చేసిన బిజెపి

**ప్రజాపక్షం/పాలకుర్తి:** దేశంలో 10 ఏళ్ల అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసంచేసి రాజకీయ పబ్బం గడుపుకోవడం తప్ప చేసింది ఏమీలేదని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిలు విమర్శించారు. సోమవారం మండలం కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో నియోజకవర్గంలోని కార్యకర్తల సమావేశం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి, పరకాల ఎంఎల్ఏ రేవూరి ప్రకాశ్‌రెడ్డి, భూపాలపల్లి, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు సత్యనారాయణ రావు, కె ఆర్ నాగరాజు, కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంచార్జి హనుమాండ్ల ఝాన్సిరెడ్డి, వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య, మాజీ ఎంపీ దయాకర్, వరంగల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎ.స్వర్ణలు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి ప్రజల దెబ్బకు దయాకర్ రావు మైండ్ బ్లాక్ అయిందని యశస్వినిరెడ్డి దెబ్బకు చిన్న మెదడు చితికిపోయిందని బిత్తిరిబిత్తిరిగా మాట్లాడుతున్నారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డితోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, అన్ని వర్గాల హామీలు నెరవేరుస్తామన్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ కడియం ఫౌండేషన్ ద్వారా ఎన్నో నిరుపేద కుటుంబాలకు ఎన్నో సేవలు అందించానన్నా రు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకుడు కత్తి వెంకటస్వామి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, హమ్యా నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## యువతకు దిక్సూచి గడ్డం వంశీ

### రాష్ట్ర ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** యువతకు దిక్సూచి గడ్డం వంశీ, తరతరాల రాజకీయ చరిత్ర నుంచి రాజకీయ వారసుడిగా వచ్చిన యువకుడు ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నేతృత్వంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణ అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సోమవారం స్థానిక



బందంపల్లిలోని స్వరూప గార్డెన్ లో స్థానిక ఎంఎల్ఏ విజయరమణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ యువకుడు విద్యావంతుడు రాబోయే కాలంలో యువతకు దిక్సూచిగా ఉండి దేశంలోని నిరుద్యోగ సమస్యపై అవగాహన కల్గిన నాయకుడు, వ్యాపారవేత్త గడ్డం వంశీ అని అన్నారు. కాంగ్రెస్ పార్టీని దేశంలో అధికారంలోకి తీసుకురావడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సాగునీరు గురించి బిఆర్‌ఎస్ మాజీ మంత్రులకు ప్రజాప్రతినిధులకు మాట్లాడే అర్హత లేదని త్వరలోనే పత్తిపాక రిజర్వాయర్ పూర్తి చేసి జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని, పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాలకు బైపాస్ రోడ్డు మంజూరు చేయిస్తామని, పెద్దపల్లి మైనింగ్ ఇంజనీర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్మపురి ఎంఎల్ఏ, విప్ అడ్లూరి లక్ష్మ ణ్‌కుమార్, రామగుండం ఎంఎల్ఏ ఠాకూర్ మక్కాన్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్, పెద్దపల్లి ఎమ్మెల్యేవిజయ రమణారావు, మాజీ విప్ ఆరెపల్లి మోహన్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాముడి పేరుచెపుతూ మతతత్వ పార్టీగా వ్యవహరిస్తూ రాముడి పేరు చెప్పి ఓట్లు అడుగటం సిగ్గు చేటు అని, మోడీ పదేళ్ల పాలనలో నిరుద్యోగం పెరిగి ధరలు పెరిగి ఇటు నిరుద్యోగులు, అటు సామాన్యులు, కార్మికులు నలిగిపోతున్నారని, బీఆర్‌ఎస్‌కు పట్టించిన గతే మోడీ ప్రభుత్వానికి పట్టించాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీ మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ముఖ్యంగా యువత ఉద్యోగ ఉపాది కల్పనకు కృషి చేస్తానని, ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేసి నిరుద్యోగులను ఆదుకుంటానని, తన తాత గడ్డం వెంకటస్వామి బాటలోనే కార్మిక కర్షక వర్గాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి తోడ్పాటునందిస్తానని, తనకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో దేశం లో విజయకేతనం ఎగురవేయాలని అన్నారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో పెద్దపల్లి జడ్‌పిటిసి బండారి రామ్మూర్తి, జూలపల్లి జడ్‌పిటిసి బొద్దుల లక్ష్మ ణ్, పలువురు పిఎసి ఎస్ చైర్మన్‌లు కాంగ్రెస్‌లో చేరారు.

ప్రజాపక్షం

మంగళవారం, ఏప్రిల్ 16

# సంకల్పమా ? జుమ్లాలా?

ఏడు దశల్లో జరిగే 18వ సార్వత్రిక ఎన్నికల మొదటిదశ పోలింగ్ నాలుగురోజుల్లో (ఏప్రిల్ 19; 102 నియోజకవర్గాలు) జరగనుండగా, పాలక భారతీయ జనతాపార్టీ 'మోదీ కీ గ్యారంటీ' 2024 పేరుతో తమ ఎన్నికల ప్రణాళికను (సంకల్ప పత్ర) 76 పుటలతో బహుఛాయాచిత్ర సమ్మిళితంగా ఆదివారంనాడు విడుదల చేసింది. గత 10 సంవత్సరాల పరిపాలనలో మోదీ ప్రభుత్వ సాఫల్యాలను గుదిగుచ్చిన తదుపరి, వచ్చే ఐదేళ్లకు కాదు – పాతిక సంవత్సరాలకు (2047) లక్ష్యాలను పొందుపరిచింది. 'వికసిత(అభివృద్ధి చెందిన) భారత్'ను సాధించటం ఆ లక్ష్యం. అంటే అప్పటివరకు బిజెపియే అధికారంలో ఉంటుందనే భావనను పరోక్షంగా చెప్పినట్లుంది. బిజెపి ప్రధాన ఎజండాలోని ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామాలయ నిర్మాణం తొలి రెండు పదవీకాలాల్లో నెరవేర్చినందున, మూడవ ముఖ్యాంశం 'పౌరులందరికీ ఒకే పౌర స్మృతి' (యుసిసి), ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని మోదీ పదేపదే చెబుతూ వస్తున్న 'ఒక దేశం – ఒకేసారి ఎన్నికలు' మూడవ పదవీకాలానికి ముఖ్య ఎజండాగా ప్రకటించారు.

ప్రస్తుతం మనం చూస్తున్న అస్థిర అంతర్జాతీయ పరిస్థితిల్లో మన దేశానికి 'పూర్తి మెజారిటీతో కూడిన బలమైన ప్రభుత్వం' అవసరమని సంకల్ప పత్ర విడుదల చేస్తూ ప్రధాని ఉద్ఘాటించారు. బిజెపికి 370కిపైన, ఎన్‌డిఎగా 400లకు పైగా సీట్ల గెలుపుతో చరిత్ర సృష్టించాలని మోదీ ముందస్తుగా నిర్దేశించిన ఎన్నికల లక్ష్యానికిది ముక్తాయింపు. ''విశ్వ గురు'' కావాలన్న ఆకాంక్షను సవరించుకున్న బిజెపి, 'విశ్వబంధు భారత్' స్ఫూర్తితో దేశ ప్రయోజనాలు ముందుకుగొనిపోయే విధానాలను పార్టీ – ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పింది. ఐరాస భద్రతామండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వ సాధనకు నిబద్ధత ప్రకటించింది. 25కోట్ల మందిని దారిద్ర్యరేఖ పైకి తెచ్చామన్న క్లెయింను పునరుద్ఘాటిస్తూ, వారు మళ్లీ వెనక్కు జారిపోకుండా వివిధ దారిద్ర్య నిర్మూలన పథకాల్లో మార్పులు చేయటంతో పాటు, 80కోట్లమందికి ఉచితంగా ఆహారధాన్యాల పంపిణీ మరో ఐదేళ్లు కొనసాగుతుందని పునరుద్ఘాటించింది. 70సంవత్సరాలు దాటిన పౌరులకు ఆయుష్మాన్ యోజన పరిధిలో ఉచిత ఆరోగ్య కవరేజి రు.5లక్షలకు పెంపుదల, ముద్రపథకం కింద రుణ వితరణ పరిమితి రూ.10 నుండి రూ.20లక్షలకు పెంపుదల వంటివి బిజెపి వాగ్దానాల్లో ఉన్నాయి. తమిళనాడులో పట్టు సాధించాలని పనిగట్టుకుని ఆ రాష్ట్రంలో పదేపదే పర్యటిస్తున్న ప్రధాని మోదీ ఈ ఎన్నికల ప్రణాళికలో తమిళభాష ప్రాచీనతను ప్రస్తావించి దాన్ని విశ్వ వ్యాప్తం చేసేందుకుగాను తమిళ కవి తిరువళ్లువార్ పేరిట సాంస్కృతిక కేంద్రాలను ప్రపంచమంతటా నెలకొల్పుతామన్నారు. 19వ తేదీన ఒకేరోజు పోలింగ్‌లో తమిళనాడు ఓటర్లు బిజెపిని ఏ మేరకు కరుణిస్తారో చూదాం!

అయితే ప్రజల జీవన నాణ్యతను సాధించటం, పెట్టుబడుల ద్వారా ఉపాధి పెంపుదలను ఉద్దేశించినట్లు చెప్పుకున్న ఎన్నికల ప్రణాళిక ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సమస్యలను దాటవేసింది. వివాదాస్పదమైన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమలు చేస్తామని చెబుతూ జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్ఆర్‌సి) కూర్పును విడనాడినట్లు వెల్లడించింది.

బిజెపి మ్యానిఫెస్టో ''అతిపెద్ద జుమ్లా''(తమాషా) అని అభివర్ణించిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, 'అది ఉత్తుత్తి మాటల గారడీ' అన్నారు. గతంలో ఇచ్చిన వాగ్దానాలు – సాలీనా 2కోట్ల ఉద్యోగాలు కల్పన, 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేయటం, వ్యవసాయ ఖర్చుకు 50 శాతం కలిపి పంటలకు కనీస మద్దతుధర ఇవ్వటం, విదేశాల్లో దాచుకున్న నల్లధనాన్ని వెనక్కుతెచ్చి ప్రతి బ్యాంక్ ఖాతాల్లో రూ.15లక్షలు జమచేయటం వగైరా ఏమైనాయని ఆయన ప్రశ్నించారు. బిజెపికి సంబంధించి ఎన్నికల ప్రణాళిక ఒక లాంఛన పత్రం మాత్రమే. నరేంద్రమోదీ కి ఎప్పుడు ఏది తోస్తే అదే తక్షణ విధానంగా ముందుకు వస్తుంది. మూడవ పర్యాయం ప్రభుత్వం ఏర్పాటు చేసేసినట్లుగా ఓటర్లలో భ్రమలుగొలిపి వారి ఓట్లకు ఏకపక్షంగా గాలం వేస్తున్న నరేంద్రమోదీ అండ్ కో మాటల బురిడీలో పడితే తర్వాత విచారించి లాభం లేదు!

# ప్రజల ప్రమేయంలేని ఘర్షణాత్మక ప్రపంచం

ఇప్పుడు ప్రపంచమంతా పశ్చిమాసియావైపే చూస్తోంది. సాధారణ ప్రజలు కూడా అక్కడి పరిణామాల గురించే చర్చిస్తున్నారు. నిజం చెప్పాలంటే ప్రపంచంలో జరిగిన రెండు మహాయుద్ధాల తర్వాత మళ్లీ అలాంటి యుద్ధాన్నే తలపెట్టాలని అగ్రదేశాలు కూడా భావించటంలేదు. ఎందుకంటే ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు ప్రాంతీయస్థాయిలో భౌగోళిక ఉద్రిక్తతలు నిరంతరం కొనసాగుతూనే ఉన్నాయి. యుద్ధం అనే నిప్పుతో చెలగాటం కొనసాగుతూనే ఉంది. మొత్తంగా ఆలోచిస్తే ఈ పరిణామాల్లో ప్రజల ప్రమేయం ఉండదు. వారి జీవన ప్రయోజనాలకోసం జరిగే పోరాటంలో అప్పుడప్పుడు వీటి ప్రస్తావన ఒక మేఘంలా వాళ్లమీంచి వెళ్ళిపోతూ ఉంటుంది. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఇలాంటి యుద్ధాల్లో సామాన్య ప్రజలే బలిపశువులు. గాజా స్ట్రిప్‌లో జరుగుతున్నది అదే. ఈ శతాబ్దంలో ఇంత బాహాటంగా సామాన్య ప్రజలు ఏ ప్రమేయం లేకపోయినా యుద్ధానికి బలి కావటాన్ని ప్రపంచమంతా గమనిస్తోంది. హమాస్ ఉగ్రవాదులను మట్టుపెట్టటమే లక్ష్యమని చెపుతూ ఇజ్రాయిల్, పారిపోతున్న అమాయక ప్రజలను దాడిచేసి చంపుతోంది. శరణార్థులుగా మారి ఎక్కడో తలదాచుకుంటున్న పాలస్తీనా ప్రజల తాత్కాలిక శిబిరాలపై గురిపెట్టి దాడులు చేస్తోంది. గడచిన 24 గంటల్లో గాజాలో ఇలాంటి దాడుల్లో 52మంది అమాయక జనం మరణించారు. ఈ యుద్ధంలో వారికి ఎలాంటి ప్రమేయం లేదు. ప్రయోజనంకూడా లేదు. జరిగింది ఒక్కటే. వారు సర్వస్వం కోల్పోయారు. కుటుంబ సభ్యులతో సహా. ఇప్పుడున్నది ప్రజల ప్రమేయంలేని సంఘర్షణాత్మక ప్రపంచం. మతవాదం ఆర్థికవాదం ఆధిపత్యవాదం వీటికి మూలాలు. మొదటి ప్రపంచ యుద్ధంలోగానీ, రెండవ ప్రపంచ యుద్ధంలోగానీ సామాన్య ప్రజలకు ఎవరూ రక్షణ ఇవ్వలేదు. పాలకులు తమ ఆర్థిక, భౌగోళిక ప్రయోజనాలకోసం ఆ రెండు మహాయుద్ధాల్లోనూ కోట్లాదిమంది అమాయక సైనికులను బలిపెట్టారు. నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్)గానీ, ఈనాడు ఐక్యరాజ్యసమితిగానీ పేరుకే పెద్దరికం చెలాయిస్తున్నాయి. నానాజాతి సమితి వైఫల్యం తరువాత దాని ఆస్తులు, ఫైళ్లు ఇతర వివరాలన్నీ ఐక్యరాజ్యసమితి చేతికొచ్చాయి తప్ప ప్రపంచాన్ని కాపాడే సంపూర్ణాధికారాలు మాత్రం దానిచేతికి రాలేదు. ఎందుకంటే అది ఆర్థిక అశక్తత గల ప్రపంచ సంస్థ! అగ్రరాజ్యాలే దాన్ని పోషించాలి. ఇజ్రాయిల్‌పై ఇరాన్ దాడి(ఏప్రిల్14, 2024) చేయగానే వరల్డ్ మీడియా యావత్తూ ఖండనలు విజ్ఞప్తులతో మోతమోగిపోయింది. ఇరాన్ వ్యతిరేకులు, నాటో దేశాల సమర్థకులు ఖండనలపర్వం కొనసాగిస్తున్నారు. రెండు వారాల క్రితం సిరియా రాజధాని డమాస్కస్‌లో ఇరాన్ దౌత్యకార్యాలయంపై ఇజ్రాయిల్ దాడిచేయనంతవరకు ఆ దేశాన్ని సమర్థించేవాళ్లంతా గాజా స్ట్రిప్‌లో ఐడిఎఫ్ (ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్) ఏడు నెలలుగా చేస్తున్న దాడులను మౌనంగా వీక్షించారు. ఇరాన్ మొట్టమొదటిసారి ప్రధానంగా డ్రోన్‌లతో ఇజ్రాయిల్‌పై ప్రత్యక్షదాడి చేయటంతో వాళ్లంతా నోళ్లు తెరిచి అరవటం ప్రారంభించారు. డమాస్కస్‌లో దౌత్యకార్యాలయంపై ఇజ్రాయిల్ దాడి తమ సార్వభౌమాధికారంపై దాడిగా ఇరాన్ ప్రకటించింది. ఆ దేశానికి శిక్ష తప్పదని 15రోజులుగా ప్రపంచాన్ని సన్నద్ధం చేసింది ఇరాన్. 300 డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులతో జరిగిన ఈ అసాధారణ దాడివల్ల అపారనష్టం జరగలేదు. ప్రతిదాడులు గనుక చేస్తే పరిస్థితులు విషమిస్తాయని, యుద్ధం విస్తరిస్తుందని ఇరాన్ మరోసారి హెచ్చరించింది. సైనికంగా చూస్తే ఇరాన్‌కు గొప్ప శక్తిసామర్థ్యాలు లేవు. కానీ ఇజ్రాయిల్ వద్ద అమెరికా ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్న అత్యాధునిక ఆయుధాలున్నాయి. ఐఐఎస్ఎస్ (ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్ట్రాటజిక్ స్టడీస్) అధ్యయనం ప్రకారం ఎఫ్‌తరం జెట్ విమానాలు (15,16,35) ఇజ్రాయిల్ వద్ద కొల్లలుగా పోగుబడి ఉన్నాయి. ఇన్ని ఆయుధాలు ఇరాన్ దగ్గర లేవు.

కానీ ఇరాన్‌ను, ఇజ్రాయిల్,అమెరికా పెద్ద బూచిగా చిత్రీకరిస్తున్నాయి. ఇజ్రాయిల్ దాడులసమయంలో తమ శక్తిమంతమైన మీడియా ద్వారా ఏ మాత్రం హైప్ సృష్టించకుండా జాగ్రత్తపడిన అమెరికా, యూరప్ కూటమి మిత్రదేశాలు ''ఇరాన్ దాడిచేస్తోంది ...దాడి చేస్తోంది...''అంటూ మీడియాలో హైప్ సృష్టించి ఇరాన్ వల్ల ప్రపంచదేశాలకు, పశ్చిమాసియాకు చాలా పెద్ద నష్టం జరగబోతోందని అందరి దృష్టిని అటు మళ్లించారు. మరోవైపు ఇజ్రాయిల్ గాజా స్ట్రిప్‌లో సందట్లో సడేమియా లా తన దాడులు ఆపలేదు. జనహననం కొనసాగుతూనే ఉంది. దానికి ఎలాంటి ప్రచారం జరగడం లేదు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చాలా ముద్దుముద్దుగా ఇజ్రాయిల్ కేసి గుడ్లురిమి చూస్తూ ''నువ్వు చేసే పని నాకు నచ్చలేదు'' అని మందలించటం హాస్యాస్పదం. అదే సమయంలో రంగుమార్చి ఇజ్రాయిల్‌కు మద్దతుగా వెనుక మేమున్నామని, ఆ దేశాన్ని కాపాడుకుంటామని ప్రకటించి అసలు రంగు బయటపెట్టారు. ఇరాన్ దాడిచేయగానే బ్రిటన్, ఫ్రాన్స్, సింగపూర్, ఉక్రేన్ సహా చాలా దేశాలు ఇరాన్ చర్యను తీవ్రంగా ఖండించాయి. పశ్చిమాసియాలో శాంతికి, ప్రపంచానికి ఈ దాడి పెద్ద ప్రమాదమని హెచ్చరించాయి. ఐక్యరాజ్యసమితి భద్రతామండలి, యూరోపియన్ యూనియన్ కూటమి, ఇతర ప్రాంతీయ కూటములు తక్షణ సమావేశాలు జరిపి పరిస్థితిని సమీక్షించాయి. అంతవరకే. భద్రతామండలి విజ్ఞప్తులు చేయటం



తప్ప ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉంది. భద్రతామండలి అసమర్థత కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. దాని వెనుక కారణాలు అందరికీ తెలిసినవే. నిజానికి ఇరాన్, ఇజ్రాయిల్‌లను అలాగే ఒదిలేస్తే ఈ యుద్ధ ప్రమాదం మరింత ముదిరి పరిస్థితులు ప్రమాదకరంగా మారతాయి. దీన్ని అడ్డుకోవలసిందే. ఇంతవరకు రాకుండా ఇజ్రాయిల్‌నే మొదట అదుపు చేయాల్సింది, కానీ అమెరికా ఇష్టపడలేదు. ఎందుకని?

### ఇజ్రాయిల్–ఇరాన్ మధ్య వైరం ఎందుకు?

ఇజ్రాయిల్ ఇరాన్ మధ్య వైరం గురించి చాలామంది పట్టించుకోకపోయి ఉండవచ్చు. చాలా సంవత్సరాలుగా ఈ రెండు దేశాల మధ్య అంతర్గతంగా ఉద్రిక్తతలు, వైరం కుతకుతలాడుతోంది. ఇక్కడ మతం ఒక సమస్య. 1979లో ఇరాన్ ఒక మతరాజ్యంగా ఆవిర్భవించాక ఇజ్రాయిల్ ఆ దేశంపై కక్షగట్టింది. నిజం చెప్పాలంటే ఇజ్రాయిల్ సృష్టికర్తలు, ఇజ్రాయిల్‌ను కూడా మత ప్రయోజన ప్రాతిపదికపైనే ఆవిర్భవింపచేశారు. ఇరాన్‌లో మత రాజ్యాన్ని, దాని ఉనికిని ఇజ్రాయిల్ వ్యతిరేకించింది. ఇరాన్ ప్రభుత్వ సర్వాధినేత ఆయితుల్లా ఖొమైనీ ఇజ్రాయిల్‌ను పశ్చిమాసియాలో క్యాన్సర్ కురుపుగా అభివర్ణించారు. దాన్ని కూకటివేళ్లతో పెకలించివేయాలని అన్నారు. ఇదే ఈ రెండు దేశాలమధ్య ప్రధాన సమస్య. ఇజ్రాయిల్‌ను ఎందుకు సమర్థిస్తున్నారో, ఎవరు సమర్థిస్తున్నారో ఇరాన్‌కు స్పష్టంగా తెలుసు. ఇరాన్ జనాభా 9కోట్లు. ఇజ్రాయిల్ కంటే పదిరెట్లు పెద్దదేశం.సైనిక సామర్థ్యం పరిమితం. ఇరాన్ వెనుక రష్యా,చైనా దేశాల మద్దతు

**2023 అక్టోబర్ 7 నుండి ఈనాటివరకు ఇజ్రాయిల్ యుద్ధంవల్ల జరిగిన వినాశకర పరిణామాల వివరాలు :**

1. గాజాలో పాలస్తీనా మృతులు : 33,634
2. ఇజ్రాయిల్ దాడుల్లో గాయపడిన ప్రజలు : 76,214
3. మరణించిన పిల్లల సంఖ్య : 14,520
4. ఆకలి కేకలతో మరణించిన పిల్లలు : 31
5. యుద్ధంలో మరణించిన జర్నలిస్టులు : 140
6. గాజా స్ట్రిప్‌లో ఇళ్లు ధ్వంసమై నిరాశ్రయులైనవారు: 2,00,000
7. యుద్ధసమయంలో మరణించిన ఐక్యరాజ్యసమితి సహాయ సిబ్బంది : 177
8. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన పాలస్తీనియన్లు : 470
9. రఫాలో తలదాచుకున్న నిరాశ్రయ పాలస్తీనియన్లు : 10.51లక్షలు
10. హమాస్ దాడిలో మరణించిన ఇజ్రాయిలీయులు: 1,139
11. హమాస్‌వద్ద ఇంకా బందీలుగా ఉన్నవారు : 240
12. గాజా స్ట్రిప్‌లో మరణించిన ఇజ్రాయిల్ సైనికులు : 260
13. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో జైళ్లలో మగ్గుతున్న పాలస్తీనియన్లు : 8,140

ఉందని అమెరికా ముద్రవేసింది. ఈనాటివరకు ఇరాన్ ఇజ్రాయిల్‌పై ప్రత్యక్ష దాడి చేయలేదు. ఈ దాడి ఇప్పుడే ప్రారంభమైంది. ఇది ఎటు దారితీస్తోందో అని మనబోటి దేశాలు భయపడుతున్నాయి. కానీ అమెరికాకు కావల్సింది అదే.

ఇరాన్‌కు ప్రీతిపాత్రమైన దేశం సిరియా. కానీ తమను అంతం చేసేందుకే ఇరాన్ హమాస్ ఉగ్రవాద సంస్థను, లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న షియా ఉగ్రవాద మూకలను, హిజ్బుల్లా గ్రూపులను పెంచి పోషిస్తోందన్నది ఇజ్రాయిల్ చేస్తున్న వాదన. ఇరాన్ వద్ద అణుబాంబు ఉందని కూడా ఇజ్రాయిల్, అమెరికాల గట్టి విశ్వాసం. యురేనియంను 60శాతం ఇరాన్ శుద్ధిచేసిందని, వాటి అవశేషాలు కూడా లభ్యమయ్యాయని అంతర్జాతీయ అణుఇంధన సంస్థ (ఐఎఇఎ) కూడా కితాబు ఇచ్చింది. ఇరాక్‌పై దాడిచేయడానికి ముందు కూడా రసాయన ఆయుధాలు పోగుపడి ఉన్నాయని ఆ దేశంపై భారీ ఎత్తున ఆరోపణల ప్రచారం జరగటం, ఇరాక్‌పై దాడిచేసి సద్దాం హుస్సేన్‌ను హతమార్చటం, ఆ తరువాత రసాయన ఆయుధాల ఆరోపణలన్నీ ఒట్టిబూటకమని రుజువు కావటం ప్రపంచానికి తెలిసిందే. ఈ విషయాన్ని మనం గుర్తు చేసుకోవటం ఈ సందర్భంగా చాలా అవసరం.

2023, అక్టోబరు 7వ తేదీన హమాస్ దాడి అనంతరం రెండు వారాలకి ఇజ్రాయిల్ యుద్ధం ప్రారంభించింది. యెమెన్‌లోని హౌతీ ఉగ్రవాదులు ఎర్రసముద్రంలో అమెరికా సంబంధిత మిత్రదేశాల నౌకలపై దాడులు చేస్తూ పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ఉంటున్నారు. సిరియా, జోర్డాన్‌లలో అమెరికా స్థావరాలపై కూడా దాడులు జరిగాయి. అమెరికా సైనికులు కూడా మరణించారు.

హమాస్ వెయ్యిమందిని చంపితే ఇజ్రాయిల్ దానికి బదులుగా లక్షమందిని ఇప్పటివరకు చంపింది. శత్రువులందరినీ ఓడిస్తామని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు కొన్ని గంటల క్రితమే శపథం చేశారు. ఏమిటీ ఆయన ధైర్యం? ఇజ్రాయిల్‌లో ప్రజలు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇరాన్‌లో కూడా ప్రజల వ్యతిరేకత ఉంది. అటు యూరప్‌లో ఇతర ప్రజాస్వామిక దేశాల్లో కూడా లక్షలాదిమంది పాలస్తీనా ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తున్నారు. నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రపంచం ఇప్పుడు పాలస్తీనా వెంటే ఉంది. కానీ ప్రజలను ఈ యుద్ధ సూత్రధారులు పట్టించుకోవటం లేదు. ప్రజల పాత్ర వారికి అవసరం లేదు. మతం, ఆర్థికం, ఆధిపత్యం ఈ మూడే ఇప్పుడు ప్రపంచాన్ని రెండు శిబిరాలుగా విడదీస్తున్నాయి.

తారా

సైన్స్

# గుప్పిట్లో సమాచారం సాధ్యమా?

ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ విభాగం (ఐఎండి) ఇటీవలే ప్రకటించింది. తాజాగా వర్షాలు కూడా సాధారణ స్థాయిని మించి ఉంటాయని పేర్కొంది. ఉపరితల ఆవర్తనాల నుంచి తుపానుల వరకూ అనేకానేక సందర్భాల్లో ముందస్తు సమాచారాన్ని అందించడం ఇప్పుడు సులభమైందని అనుకుంటున్నాం. సమాచారం గుప్పిట్లో ఉందని పొంగిపోతున్నాం. ప్రకృతి విపత్తులను అడ్డుకోలేకపోయినా, కనీసం ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం మనకు లభిస్తున్నదని సంతోషిస్తున్నాం. విస్తరిస్తున్న శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి ప్రతి ఒక్కరం కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాం. ఇంతకీ, ఆధునిక వాతావరణ సమాచారం ఎలా లభిస్తున్నది? ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే, ఉపగ్రహాల నుంచి వచ్చే సమాచారమే ఆధారమని చెప్పుకోవాలి. శాస్త్రవేత్తలు భూగోళం మొత్తాన్ని, సగటున అరవై మైళ్ల విస్తీర్ణం ఉన్న ఊహాత్మక గడిగా తీసుకుంటారు. ప్రతి గడిలోనూ వాతావరణ సమాచారాన్ని భూమిపై ఉన్న కేంద్రాలకు ఉపగ్రహాల ద్వారా అందే సమాచారం ద్వారా తెలుసుకుంటారు. కొన్ని స్థానాల నుండి కేంద్రాలు లేకపోవడం చేతగాని మరే కారణం చేత



గాని సమాచారం లభించకపోవచ్చు. అటువంటప్పుడు పొరుగుస్థానాలలో నమోదు అయిన సమాచారం బట్టి ఇక్కడి సమాచారాన్ని అంచనా వేస్తారు. అలాంటి అంచనాల్లో కొంత వ్యత్యాసాలు తప్పకపోవచ్చు. కానీ, స్థూలంగా చూస్తే మాత్రం, వాతావరణ వివరాలను ఇవ్వడం సాధ్యమవుతుంది. అయితే, సూక్ష్మమైన వివరాలను తెలుసుకోవడం ఇప్పటికీ సాధ్యం కావడం లేదు. అందుకే, ఆరంభ స్థితి గురించి చాలా కచ్చితమైన సవివరమైన సమాచారం దొరకదు. ఒకవేళ దొరకాలి అంటే, భూమి మొత్తాన్ని ఒక అడుగు పరిమాణం ఉన్న చదరపు గడిగా తీసుకోవాలి. అలాగే ఊర్ధ్వ దిశలో కూడా వాతావరణపు పైపొర వరకు ఒక్కొక్క అడుగునా సమాచారం సంపాదించుకోవాలి. అంత వివరమైన సమాచారం కావాలంటే లెక్కలేనన్ని ఉపగ్రహాలు, వాతావరణ కేంద్రా లు అవసరం. అవన్నీ ఉన్నాయనుకున్నప్పటికీ, అంత సమాచారమూ ఎక్కువ కాలానికి అన్వయించడం సాధ్యం కాదు. ఉదాహరణకు ఏదైనా ఒక రోజు మధ్యాహ్నం 12 గంటలకి వాతావరణ సమాచారం దొరికింది అనుకుందాం. ఆ సమాచారాన్ని ఉపయోగించుకుని 12.01కి, 12.02కి, 12.03...ఇలా వరుసగా నిముష నిముషానికి వాతావరణంలో ఎలాంటి మార్పులు వస్తాయో చెప్పడం అసాధ్యం. అంటే, ఎంత సమాచారం ఉన్నప్పటికీ, గంటలు, నిమిషాలు, సెకన్ల గురించిన వివరాలు తెలుసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో అసాధ్యం. ఉదాహరణకి వచ్చే నెల ఒకటో తారీఖున ఢిల్లీ విమానాశ్రయంలో పొగమంచు ఉంటుందా లేదా అని అడిగితే సమాధానం రాకపోవచ్చు. ఎందుకంటే, అరవై మైళ్ళ ఎడం ఉన్నప్పటి కన్నా అడుగు ఎడం ఉన్నప్పుడైతే నమోదు అయిన వాతావరణ సమాచారంలో దోషం తక్కువగా ఉంటుందిగానీ, అసలు దోషమే లేదని చెప్పలేం. వాతావరణ పరిణామం తీరు అత్యంత సంక్లిష్టంగా ఉండడం చేత ఆ అతి స్వల్ప దోషం కూడా ఇట్టే విస్తరించినా ఆశ్చర్యం లేదు. అందుకే, గంటలు, రోజుల్లో కాదు... ఓ వారం రోజుల తరువాత గగనంలో ఏం జరుగుతుందో చెప్పడం అసాధ్యం. ఒక్కోసారి అతి స్వల్ప కారణమే పెరిగి, పెను ఫలితాలకు కారణమవుతుంది. ఈ పరిణామాలు వాతావరణ శాస్త్రవేత్తలకి కూడా మింగుడు పడడం లేదు. ఏదిఏమైనా వాతావరణ విషయంలో శాస్త్రవేత్తలు మరింత పురోగవృద్ధి సాధించాలి. అప్పుడే, తుపాన్లు... వరదలు.. భరించలేని ఎండలు.. ఇలా ఎన్నో రకాల ప్రకృతి వైపరీత్యాల నుంచి బయటపడేందుకు మార్గాలను అన్వేషించడానికి అవకాశం ఉంటుంది.



# పాలపుంత దూరమెంత?

ఎప్పుడైనా ఎండాకాలం ఆరుబయట పడుకొని, ఆకాశంలోకి చూస్తూ అబ్బుర పడడం.. ఆశ్చర్యపోవడం చాలామందికి అనుభవమే. అయితే, మనం చూస్తున్నది లేదా మన కళ్లకు కనిపిస్తున్నది చాలాచాలా తక్కువ. ఎంత తక్కువంటే, ఒక మహాసముద్రం ఒడ్డున ఉండే ఇసుకలోని ఒక అణువు కంటే కూడా తక్కువ. అనంత విశ్వంలో ఉన్న లక్షల కోట్ల గెలాక్సీల్లో మన పాలపుంత ఒకటి.

గెలాక్సీ మనకు ఎంత దూరంలో ఉందో తెలుసా? అది తెలుసుకోవాలంటే, ముందుగా సూర్యుడి గురించి తెలియాలి. గెలాక్సీలో ఉండే 200 బిలియన్ల (200,000,000,000) తారల్లో మన సూర్యుడు ఒకటి. గెలాక్సీ కేంద్రం నుంచి సూర్యుడు సుమారు 26,000 కాంతిసంవత్సరాల దూరంలో ఉన్నాడు. భూమికీ సూర్యుడికీ మధ్య దూరం సుమారు 9,30,00,000 మైళ్లు లేదా 15 కోట్ల కిలోమీటర్లు. సెకనుకు 1,86,000 మైళ్లు లేదా 3,22,000 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే కాంతి, సూర్యుడి నుంచి భూమికి చేరుకోవడానికి 8 నిమిషాలు పడుతుంది. కాగా, సౌరమండలంలో గ్రహాలు సూర్యుడి చుట్టూ పరిభ్రమించినట్టుగానే, పాలపుంతలో తారలన్నీ కేంద్రం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాయి.




సౌరమండలంలో సూర్యుడికి దగ్గరలో ఉన్న గ్రహాలు ఎక్కువ వేగంతో కదిలినట్టుగానే, పాలపుంతలో కేంద్రానికి దగ్గర్లో ఉన్న తారలు ఎక్కువ వేగంతో పరిభ్రమిస్తాయి. సూర్యుడితో పాటు, మనకి దరిదాపుల్లో ఉన్న తారలు గెలాక్సీ కేంద్రాన్ని బట్టి రమారమి సెకనుకి 150 మైళ్ల వేగంతో కదులుతాయి. ఆ లెక్కన సూర్యుడికి గెలాక్సీ కేంద్రం చుట్టు ఒక ప్రదక్షిణ చెయ్యడానికి 200 మిలియన్ (200,000,000) సంవత్సరాలు పడుతుంది. ప్రస్తుతం సూర్యుడు 'హెర్క్యులిస్' అనే తారారాశి వైపు కదులుతున్నాడు. మరో విషయం ఏమిటంటే, పాలపుంత కేంద్రం చుట్టూ తారల కక్ష్యలలో కూడా ఎంతో వైవిధ్యం ఉంటుంది. సూర్యుడి కక్ష్య ఇంచుమించు వృత్తాకారంలో ఉంటుంది. 'ఆర్క్ట్యూరస్ (స్వాతి)' లాంటి తారల కక్ష చాలా దీర్ఘవృత్తాకారంలో ఉంటుంది. అంటే కేంద్రం నుండి దగ్గరికీ దూరానికి జరుగుతూ ఉంటాయి. బాగా ప్రకాశవంతంగా కనిపిస్తున్న కేంద్రంలో అధికసంఖ్యలో తారలు ఉన్నాయి. కేంద్రంలో నూరు బిలియన్ (100,000,000,000) తారలు ఉన్నాయని అంచనా.

గెలాక్సీ అంచుల వద్ద పలచగా ఉన్నా, దళసరిగా కనిపిస్తున్న కేంద్రం యొక్క మందం 3,000 కాంతిసంవత్సరాలు. గెలాక్సీ ఉన్న తలానికి కొంచెం బయటగా గోళాకార రాశులు (globular clusters) ఉంటాయి. ఇవి చిన్న చిన్న తారా సందోహాలు. వీటిలోని తారలు గోళాకారంలో, అంటే అన్ని దిశలలో ఒకే విధంగా, విస్తరించి ఉంటాయి కనుక వీటిని అలా పిలుస్తారు. వీటిలో సగటున ఒక్కొక్క దాంట్లో కొన్ని పదుల వేల దగ్గర్నుండి, పదుల మిలియన్ల తారలు ఉంటాయి. ఈ గోళాకార రాశులు మన పాలపుంత చుట్టూ బాగా దూరం (సగటున 131,000 కాంతిసంవత్సరాలు) నుండి పరిభ్రమిస్తూ ఉంటాయి. ప్రస్తుతానికి 158 గోళాకార రాశులని కనుక్కున్నారు. తొలిదశల్లో వీటి గురించి చాలా పరిశోధన చేసిన చార్లెస్ మెసియర్ గౌరవార్థం వీటికి ఎం01, ఎం02, ... ఇలా పేర్లు పెడుతూ వచ్చారు. ఇప్పటి వరకూ ఎం075వరకూ గోళాకార రాశులను ధ్రువీకరించారు.



# రుతువులు ఎన్ని?

ఈ ప్రశ్నకు సమాధానం చాలా సులభం అనుకుంటే పొరపాటే. ఎందుకంటే ప్రపంచంలోని చాలా దేశాల్లో నాలుగు సీజన్లు (వేసవి, వర్షాకాలం, శీతాకాలం, వసంతకాలం) మాత్రమే ఉంటాయి. మన దేశంలో ఆరు (వసంత, గ్రీష్మ, వర్ష, శరద్, హేమంత, శశిర) రుతువులు. కానీ, చైనా క్యాలెండర్ ప్రకారం 24 సీజన్లు ఉంటాయి. ఇక జపాన్ విషయానికి వస్తే, అక్కడ ఏకంగా 72 సీజన్లు ఉన్నాయి. నిజానికి జపనీయులు తమకు నాలుగు రుతువులు మాత్రమే ఉన్నాయని అనుకుంటారు. కానీ, సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన జపాన్‌లో సంప్రదాయ లెక్కల ప్రకారం నాలుగు సీజన్లే ఉన్నప్పటికీ, ఉప సీజన్లు కూడా జత కలుస్తాయి. నాలుగు ప్రధాన రుతువులను ఒకొక్కటి ఆరు భాగాలుగా విభజిస్తారు. దీనిని 'సెక్కీ' లేదా ఉపసీజన్ అంటారు. అంటే, ఒకొక్కటీ 15 రోజులు చొప్పున మొత్తం 24 'సెక్కీ'లు ఉంటాయి. ఒక్కో సెక్కీని తిరిగి రెండు 'కో'గా విభజిస్తారు. ఈ విభజన ప్రజలకు ఆయా సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టతనిస్తుంది. అక్కడ గింజలు నాటడం, మొలకెత్తడం, పంటలు ప్రారంభించడం, పువ్వులు వికసించడం వంటి ప్రతి వ్యవసాయిక పనినీ సీజన్లు సూచిస్తూ ఉంటాయి. ప్రస్తుత విధానాన్ని 1685లో ఖగోళ శాస్త్రవేత్త షిబుకవా షుంకై సిద్ధం చేసినట్టు చెప్తారు. ఆయన క్యాలెండర్‌ను 1873 నాటికి సామాన్య ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. అయితే, ఆధునిక కాలంలో మీజీ ప్రభుత్వం ఈ సాంప్రదాయ క్యాలెండర్‌ను గ్రెగోరియన్ క్యాలెండర్‌తో భర్తీ చేసింది. ఇప్పటికీ, జపాన్‌లో కొంతమంది గ్రామస్తులు, రైతులు, మత్స్యకారులు 72 సీజన్ల పాత క్యాలెండర్‌నే అనుసరిస్తున్నారు.

# సూర్యకాంతి వెనక్కు పంపగలమా?



రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు సూర్యకాంతిని వెనక్కు పంపేందుకు శాస్త్రవేత్తలు ప్రయత్నించారన్న వార్త హల్‌చల్ చేసింది. న్యూయార్క్ టైమ్స్ కథనం ప్రకారం, సూర్యకిరణాలను వెనక్కు పంపేందుకు మేఘాల ను ప్రకాశవంతం చేసే సాంకేతికను శాస్త్రవేత్తలు ఉపయోగించారు. ఈ విధానం వల్ల సూర్యుడి నుంచి వచ్చే కాంతి చిన్నదిగా ప్రతిబించేలా చేస్తుంది. ఫలితంగా ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. మహాసముద్రాలపై అనేక పరికరాలను ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్న ఈ ప్రయోగం విజయవంతమైతే పెరుగుతున్న సముద్ర ఉష్ణోగ్రతలకు చక్కని పరిష్కారాన్ని చూపుతుంది. యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్ పరిశోధకులు శాన్ ఫ్రాన్సిస్కోలో విమాన వాహక నౌకపై ఉంచిన స్నో మెషిన్ లాంటి పరికరం నుంచి అధిక వేగంతో ఆకాశంలోకి ఉప్పు కణాలతో కూడిన పొగమంచును ఏప్రిల్ 2న ప్రయోగించారు. 'కోస్టల్ అట్మాస్ఫియరిక్ ఏరోసోల్ రీసెర్చ్ అండ్ ఎంగేజ్‌మెంట్ (సిఎఎఆర్ఇ) అనే రహస్య ప్రాజెక్ట్ కింద ఈ ప్రయోగం చేపట్టారు. 1990లో బ్రిటిష్ భౌతిక శాస్త్రవేత్త జాన్ లాథమ్ వివరించిన సూర్యకాంతిని ప్రతిబింబించే మేఘాలను అద్దాలుగా ఉపయోగించాలనే సిద్ధాంతం ఆధారంగా ఈ ప్రయోగం చేపట్టారు. 1,000 నౌకల సముదాయంతో సముద్ర నీటి బిందువుల ను గాలిలోకి పంపడం ద్వారా వేడిని వెనక్కి పంపి భూమి ఉష్ణోగ్రతలను తగ్గించవచ్చని లాథ మ్ సూచించారు. ఇది ఎలా పని చేస్తుంది? సాంకేతికత వెనుక ఉన్న ఆలోచన సాధారణ సైన్స్‌ను ఉపయోగిస్తుంది. పెద్ద సంఖ్య లో చిన్న బిందువులు.. తక్కువ మొత్తంలో ఉన్న పెద్ద బిందువుల కంటే ఎక్కువ సూర్యరశ్మిని ప్రతిబింబిస్తాయి. కాబట్టి గాలిలోకి ఉప్పు నీటి కణాలను పొగమంచు మాదిరిగా వెదజల్లడం వల్ల సూర్యకాంతి తిరిగి వెనక్కి వెళ్తుంది. కానీ కణాల పరిమాణం, వాటి మొత్తాన్ని సక్రమంగా పొందడం చాలా కీలకం. కణాలు చాలా చిన్నగా ఉంటే అవి ప్రతిబింబించవు. చాలా పెద్ద కణం మేఘాలను మరింత తక్కువగా ప్రతిబింబిస్తుంది. ఈ పరీక్ష కోసం వెంట్రుక మందంలో 1/700 వ వంతు ఉండే కణాలు అవసరం. ప్రతి సెకనుకు క్వాడ్రిలియన్ కణాలను స్ప్రే చేయాల్సి ఉంటుంది. ఇది గ్లోబల్ వార్మింగ్‌తో పోరాడగలదా? సూర్యకాంతిని లేదా కిరణాలను వెనక్కు పంపడం సాధ్యమేనా? ఈ ప్రశ్నలకు ఇప్పటికిప్పుడు సమాధానం లభించకపోవచ్చు. కానీ, త్వరలోనే ప్రయోగాలకు ఒక రూపం వస్తుందని ఆశించడంలో తప్పులేదు. ప్రపంచవ్యాప్తంగా పారిశ్రామికీకరణకు పూర్వం ఉన్న ఉష్ణోగ్రతల కంటే 1.5 డిగ్రీలను తగ్గించాలనే లక్ష్యాన్ని చేరుకోవడంలో విఫలమవుతున్నందున శాస్త్రవేత్తలు రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజా ప్రక్రియ కార్బన్‌డయాక్సైడ్ కారణంగా పెరిగిన ఉష్ణోగ్రతలను సమతౌల్యం చేయగలదని కొంతమంది అభిప్రాయం. అయితే, సోలార్ మోడిఫికేషన్ మెథడ్ ఫలితాలను అంచనా వేయడం కష్టమని పలువురు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. సాంకేతికత అధిక వినియోగం, కాలక్రమేణా వాతావరణ నమూనాలను మార్చగలదని అంటున్నారు. ఉదాహరణకు మారుతున్న సముద్ర ఉష్ణోగ్రతలు జీవశాస్త్రం, వర్షపాతాన్ని మార్చగలవు. ఒక ప్రాంతంలో వర్షపాతం పెరిగితే మరొక ప్రాంతంలో తగ్గుతుంది. ఈ వ్యత్యాసాల నడుమ ఏకీకృత విధానాన్ని అభివృద్ధి చేయడం అనుకున్నంత సులభం కాదు. అయితే, అసాధ్యం కూడా కాదు.

# గోదావరిపై రెండో వంతెన ప్రారంభం





పదేళ్ల కల సాకారం

రాకపోకలు ప్రారంభం

**ప్రజాపక్షం / భద్రాచలం :** ఎట్టకేలకు భద్రాచలం వద్ద గోదావరి నదిపై నిర్మించిన రెండో వంతెన సోమవారం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా పూర్తి సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించి వంతెనను ప్రారంభించారు. జాతీయ రహదారుల శాఖ ప్రత్యేక చొరవతో మధ్యలో ఆగిపోయిన పనులను చేపట్టి పూర్తి చేసి రామభక్తులకు శ్రీరామనవమి సందర్భంగా అందుబాటులోనికి తెచ్చారు. వంతెనపై స్వామి వారి చిత్రపటాలను ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామికి హారతులు పట్టారు. అనంతరం బూడిద గుమ్మడికాయపై హారతి కర్పూరలు కాంతులు వెలిగించి దిష్టి తీశారు. ఆమెతో పాటు ఎస్‌పి రోహిత్ రాజ్, ఐటిడిఎ పిఒ ప్రతీక్ జైన్, జాతీయ రహదారులు ఇఇ యుగంధర్, డిఇ శైలజ కొబ్బరికాయ కొట్టారు. సరిగ్గా పదేళ్ల క్రితం గోదావరి నదిపై వంతెన పనులకు శ్రీకారం చుట్టారు. అప్పటి కేంద్ర ఉపరితల రవాణా మంత్రి నితిన్ గట్కరీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, బండారు దత్తాత్రేయలు పనులను ప్రారంభించారు. అనేక అవాంతరాల నడుమ పనులు ఆగుతూ, సాగుతూ వచ్చా యి. దీంతో నేరుగా జాతీయ రహదారులు శాఖ పనులను చేపట్టి పూర్తి చేసింది. కలెక్టర్ సోమవారం నూతన వంతెనను ప్రారంభించడంతో నేటి నుండి బ్రిడ్జీపై నుండి రాకపోకలు సాగనున్నాయి. ఎన్‌హెచ్ 30 జాతీ య రహదారి పనుల్లో భాగంగా విజయవాడ నుండి జగ్దల్‌పూరకు పనులు సాగుతున్నాయి. అన్ని పనులు దాదాపు పూర్తి కాగా ఇప్పుడు నదిపై వంతెన పని కూడా పూర్తయ్యింది. పనులు పూర్తయ్యేందుకు సుమారు 70 కోట్ల వరకు ఖర్చు చేశారు. సారపాక వైపు నుండి భద్రాచలం చేరుకునేందుకు ఈ వంతెనను వాడనున్నారు. భద్రాచలం నుండి సారపాక వైపుకు వెళ్లేందుకు పాత బ్రిడ్జీని ఉపయోగిస్తారు. రెండో వారధి ప్రారంభం కావడంతో రామభక్తులు ఆ నందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# రామాలయంలో ఘనంగా ధ్వజారోహణ



**ప్రజాపక్షం / భద్రాచలం:** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో సోమవారం ఘనంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. శ్రీ మహావిష్ణువుకి ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి పటాన్ని ఈ సందర్భంగా ధ్వజ స్తంభంపై ఎగురవేశారు. నేటి నుండి పూర్ణిమ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు సంకేతంగా అటు దేవతలకు, ఇటు మానవులకు తెలిసే విధంగా ఈ ధ్వజారోహణ జరుపుతారు. అలాంగే అష్టదిక్పాలకు, పంచలోక పాలకులు దేవతలను ఆహ్వానించే భేరి పూజా కార్యక్రమాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఆ తర్వాత ఆయా దేవతలకు ఇష్టమైన ప్రసాదాలను అర్పించి బ్రహ్మోత్సవాలు జరిగినన్ని రోజులు ఆలయంలో ఉండి స్వామివారి దర్శించుకునే భక్తులకు శుభం కలిగేలా దీవించాలని కోరుతూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్వజారోహణాన్ని పురస్కరించుకుని అందజేసిన ప్రసాదాన్ని గరుడ ముద్దలను స్వీకరించేందుకు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. అందించే గరుడ ముద్దల ప్రసాదాన్ని స్వీకరిస్తే పండంటి బిడ్డలు కలుగుతార ని అపరామైన నమ్మకం. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఒ రమాదేవి, ఎఇఒ భవాని రామకృష్ణ, పర్యవేక్షకులు సాయిబాబా, కెఇ స్థలశాయి, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజా చార్యులు, అమరవాధి విజయ రాఘవన్, వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

# మతతత్వ పార్టీని ఓడిద్దాం




ఖమ్మం ఎంపి బిఆర్‌ఎస్ పార్టీ

అభ్యర్థి నామా నాగేశ్వరరావు

**ప్రజాపక్షం / చంద్రుగొండ:** ఖమ్మం పార్లమెంట్‌ను బిఆర్‌ఎస్ పార్టీ గెలిచి తీరుతుందని ఖమ్మం ఎంపి బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వంద రోజుల్లో అన్ని పథకాలు అమలు చేస్తామని 4 నెలలు గడిచినా ఇప్పటి వరకు అమలు చెయ్యలేదని ఆరోపించారు. రైతులకు రుణామాఫీ చేయడంలో విఫలం అయ్యారని, అదే విధంగా మహిళలు ప్రతి నెల రూ 2500 అందించడం లేదన్నారు. రైతు బంధు రూ 15వేలు ఇస్తామని చెప్పి నేడు అమలు చేయడంలేదని ఆరోపించారు. వీటి అన్నిటిని ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు అందరు సమిష్టిగా కృషి చేసి బిఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పని చేసిన కార్యకర్తలు అసలైన కార్యకర్తలని వారికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. రేపటి నుంచి ప్రతి మండలంలో బూత్ కమిటీలు, ప్రతి బూత్‌కు వెళ్ళి కేసీఆర్ చేసి పనులు ప్రతి ఓటరుకు చెప్పాలన్నారు. అలాగే తెలంగాణ అభివృద్ధి జరగాలంటే ఢిల్లీలో కొట్లాడే పార్టీ బిఆర్‌ఎస్ పార్టీ ఒక్కటేనని తెలపారు. మతతత్వ బిజెపి పార్టీని ఓడిద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రరావు, ఎంఎల్‌సి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధు, మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు దారా బాబు, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సభ ఎన్నికలకు 18 నుంచి నామినేషన్లు

నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్

శ్రీనివాస్




**ప్రజాపక్షం / నల్లగొండ ప్రతినిధి :** లోక్‌సభ ఎన్నికలలో భాగంగా నామినేషన్ల ప్రక్రియ ఈ నెల 18 నుంచి మొదలవుతున్నందున నామినేషన్లతో పాటు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పక్షాలు పూర్తి సహకారం అందించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్ కోరారు. సోమవారం ఆయన జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నామినేషన్ల ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ 18 నుండి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ అంశాలపై ఆయన కూలంకుశంగా వివరించారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఈ నెల 18 నుండి 25 వరకు నామినేషన్లను స్వీకరించడం జరుగుతుందని, 26 నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నా 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, మధ్యాహ్నం 3 తర్వాత నామినేషన్లు స్వీకరించడం జరగదని ఆయన స్పష్టం చేశారు. నామినేషన్ వేయడానికి వచ్చిన అభ్యర్థులు వారితోపాటు, అనుమతించే వ్యక్తులు, వాహనాలు, తదితర అంశాలను అదనపు కలెక్టర్ వివరించారు. నామినేషన్ వేయడానికి ముందే పోటీ చేసే అభ్యర్థి పేరు మీద ఏదైనా జాతీయ బ్యాంకులో ఎలక్షన్ ఎక్స్పెండిచర్ కోసం కొత్త ఖాతా తెరవాలని ఆయన తెలిపారు. నామినేషన్ల సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12500, సాధారణ అభ్యర్థులు రూ. 25 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చేయవలసి ఉంటుందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం నామినేషన్ల సందర్భంగా అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన అనంతరం అభ్యర్థుల ఖరారు తర్వాత ఎన్నికల ఖర్చుల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి, పాటించవలసిన నియమ నిబంధనలు, ప్రజా ప్రతినిధ్య చట్టం పై వివరంగా తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రచురించే కరపత్రాల విషయంలో ప్రజా ప్రతినిధ్య చట్టంలోని 127 ఏ నిబంధనలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుందని తెలిపారు. లోక సభ ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు 95 లక్షల కు మించి ఖర్చు చేయకూడదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ కలెక్టర్ నటరాజ్ , రాజకీయ పార్టీల ప్రతినిధులు అశోక్, బక్క పిచ్చయ్య, పోతెపాక లింగస్వామి, నర్సిరెడ్డి, యార శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిఘటన శక్తి సన్నగిల్లుతోందా?

ప్రభావం చూపని మావోయిస్టుల బంద్



**ప్రజాపక్షం / ఖమ్మం :** దండకారణ్యంలో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిన మావోయిస్టుల ప్రతిఘటన శక్తి క్రమేపి సన్నగిల్లుతుందా అంటే అవుననే సమాధానం వినిపిస్తుంది. ఒకప్పుడు దండకారణ్యం వైపు కన్నెత్తి చూడడానికి భయపడే భద్రతా బలగాలు ఇప్పుడు యధేచ్ఛగా సంచరిస్తూ వీలు దొరికినప్పుడల్లా మావోయిస్టులను హతమారుస్తూ ముందుకు సాగుతున్నాయి. పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మావోయిస్టుల కంటే పోలీస్ బలగాలే ఎక్కువగా వినియోగించుకుంటున్నాయి. అధునీక పద్ధతుల్లో మావోయిస్టు స్థావరాలపై , సమావేశాల పై దాడి చేస్తున్నాయి. గతంలో ఏ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో దండకారణ్యంలో భద్రత బలగాలను హతమార్చారో అదే సీన్ ఇప్పుడు మావోయిస్టులకు వ్యతిరేక దశలో తగులుతుంది. నెల రోజుల కాలాన్ని పరిశీలిస్తే వరుస ఎన్‌కౌంటర్లలో సీనియర్ నాయకత్వాన్ని మావోయిస్టులు కోల్పోయారు. ప్రజల్లో మావోయిస్టుల పట్ల వ్యతిరేకతను నూరిపోయడంతో పాటు ఇన్ఫార్మర్లుగా మార్చుకుని భద్రతా బలగాలు సునాయాసంగా మావోయిస్టుల జాడను కనిపెడుతున్నాయి. ఇదే సమయంలో దళాల సంఖ్య కూడా క్రమేపి పలచబడుతుంది. మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా తగ్గిపోయింది. దండకారణ్యంలోని మావోయిస్టుల సురక్షిత ప్రాంతాల్లోకి పోలీస్ బలగాలు చొచ్చుకుని పోవడంతో ఇంత కాలం పాటు మావోయిస్టులకు అండగా నిలిచిన గిరిజనుల ఆలోచన విధానంలో మార్పులు వస్తున్నా యి. వీటికి తోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై ఉక్కుపాదాన్ని మోపుతున్నా యి. మారిన సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మావోయిస్టుల రిక్రూట్‌మెంట్ పూర్తిగా తగ్గిపోయింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాలలో మావోయిస్టు ఉద్య మం బలంగా ఉన్నప్పటికీ నాయకత్వ స్థాయి తె లంగాణ నుంచే ఉండేది. తెలంగాణ ప్రాంతం నుంచి మావోయిస్టుల్లోకి యువత ఎక్కువగా చేరేవారు. మావోయిస్టుల ఆలోచనకు కేంద్ర బిందువుగా తెలంగాణ నాయకత్వం ఉండేది. అక్కడక్కడ ఆయా రాష్ట్రాలలోని స్థానికులు కేవలం సైన్యంగా ఉంటే తెలంగాణ ప్రాంత వాసులు సేనాధిపతులుగా ఉండే వారు. సమాజం పై అంతగా అవగాహన లేకపోవడం, మారిన చదువులు, కుటుంబ నేపథ్యాలు ఇప్పుడు మావోయిస్టుల గురించి ఆలోచించే అవకాశం కూడా యువతకు ఇవ్వడం లేదు. తెలంగాణలో కేసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల జిల్లాలతో పాటు హైదరాబాద్, వరంగల్ ప్రాంతాల నుంచి కూడా కొంత మంది యువకులు మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రిక్రూట్‌మెంట్ లేకుండా మావోయిస్టుల పురోగమనం లేదా ఉనికిని కాపాడుకోవడం జరగకపోవచ్చు. తెలంగాణలో విస్తరణ అనే ప దం మావోయిస్టుల నోటి వెంట రాగానే ప్రభు త్వం దాడులను ఉధృతం చేస్తుంది. మావోయిస్టుల ప్రతిఘటన శక్తి క్రమేపి సన్నగిల్లుతుంది. దీనిని అధికమించేందుకు మావోయిస్టులు ఒక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగితే త ప్ప లేదంటే మావోయిస్టు ఉద్యమానికి ఇబ్బందు లు తప్పక పోవచ్చు. సోమవారం ఐదు రాష్ట్రాల్లో బంద్‌కు మావోయిస్టులు పిలుపునివ్వగా బంద్ ప్రభావం ఏ మాత్రం కనపడలేదని సమాచారం. బీజాపూర్ జిల్లాలో బేస్ క్యాంపుపై దాడి జరిగిందన్న వార్తలో నిజం లేదని పోలీస్ వర్గాలు పేర్కొన్నాయి.

# బిజెపి ఎన్నికల మేనిఫెస్టో అబద్ధాల పుట్ట

ధూళిపాళ ధనుంజయనాయుడు



**ప్రజాపక్షం / నేరేడుచర్ల:** భారతీయ జనతా పార్టీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టో అబద్దాల పుట్ట అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు వ్యాఖ్యానించారు.సోమవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు మేనిఫెస్టో ఎలాంటి హామీ ఇవ్వలేదన్నారు. పార్లమెంట్‌లో మూడింట రెండు వంతల మెజారిటీ ఉంటే రా జ్యాంగాన్ని మార్చే అధికారం ఉంటుందని అది అత్యంత ప్రమాదకరమన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో రైతాంగం ఆదాయం రెట్టింపు చేస్తామని హామీ ఇచ్చారు కానీ రైతు పండించిన పంటకు గిట్టుబాబు ధరకు చట్టబద్ధత కల్పించాలని అడిగిన రైతాంగాన్ని ఢిల్లీ నగర వీధుల్లో కాల్చిచంపారని దుయ్యబట్టారు. బిసిలకు కేంద్ర మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని, ఏటా రెండులక్షల కోట్ల రూపాయలతో బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఉప్పతల కోటమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.లక్ష్మి , సిపిఐ మండల కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, సిపిఐ పట్టణ కార్యదర్శి, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షుడు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పక్కతోవ పట్టించేందుకే ఫోన్ ట్యాపింగ్‌పై లొల్లి



మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

**ప్రజాపక్షం / భువనగిరి రూరల్ :** ప్రజా సమస్యలను పక్క త్రోవ పట్టించేందుకు ఫోన్ ట్యాపింగ్ డ్రామా ఆడుతున్నారని, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఇప్పటి వరకు ఎవరూ బయటకు వచ్చి చెప్పింది లేదని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపద్యంలో భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ అనేది ఇరవై, ముప్పై ఏండ్ల కిందనే మొదలైందని, ఫోన్ ట్యాపింగ్ మొదలు పెట్టిన వారిని పట్టుకరండి అంటూ రేవంత్‌రెడ్డికి హితవు పలికారు. తెలంగాణ ఉద్యమం సమయంలో నా ఫోన్ కూడా ట్యాపింగ్ చేసి అరెస్ట్ చేశారని గుర్తు చేసుకున్నారు. ఫోన్ ట్యాపింగ్ మొదలు పెట్టింది ఎవరని ప్రశ్నించారు. రైతులకు ధాన్యం కొనుగోలు రేటు తగ్గించి మిల్లర్లు రైతుల రక్తం తాగుతుంటే మంత్రి ఢిల్లీలో పబ్బం గడుపుతున్నారన్నారు. తెలంగాణ ప్రజల కోసం, హక్కుల కోసం కొట్లాడాలంటే ఒక కెసిఆర్‌తోనే సాధ్యం అన్నారు. ఇద్దరు దొంగలు ఒక్కటై కెసిఆర్, కేజ్రీవాల్‌ను లేకుండా చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. బిజెపికి ఓటు వేస్తే కాంగ్రెస్‌కు ఓటు వేసినట్లే అని, రెండు పార్టీలు ఒక్కటే అన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటి చేస్తున్న బిఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను భారీ మేజార్టీతో గెలిపించాలని అన్నారు. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారంతో పాటు ప్రాంత అభివృద్ధి హక్కుల సాధన కోసం పార్లమెంటులో పోరాటం చేసే శక్తి బిఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు.

# ఓపెన్ స్కూల్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్

పమేలా సత్పతి



**ప్రజాపక్షం / కరీంనగర్ ప్రతినిధి:** ఏప్రిల్ 25 నుంచి మే రెండు వరకు జరగనున్న ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించవద్దని పేర్కొన్నారు. పరీక్ష రాసేవారితో పాటు ఇన్విజిలేటర్లు సెల్‌ఫోన్లు తీసుకెళ్లకుండా చూడాలన్నారు. పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలన్నారు. ఓపెన్ స్కూల్ ఎస్‌ఎస్‌సీకి సంబంధించిన పరీక్ష కేంద్రాలు కరీంనగర్‌లో రెండు, హుజురాబాద్‌లో ఒకటి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ మూడు కేంద్రాల్లో 475 మంది పరీక్షలు రాయనున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ఇంటర్‌కు సంబంధించిన పరీక్ష కేంద్రాలు కరీంనగర్‌లో మూడు, హుజురాబాద్‌లో రెండు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇందులో 881 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని చెప్పారు. బస్సుల సౌకర్యం కల్పించాలని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వైద్య సిబ్బందితో పాటు సిసి కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డిఆర్‌వో పవన్ కుమార్, జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, జిల్లా వైద్యాధికారి సుజాత, డీఈసి మెంబర్ అశోక్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విస్తృతంగా అవగాహన:



అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది కఠోరంగా శ్రమిస్తూ ఆస్తులు, ప్రజలను కాపాడడం వారి తెగువకు నిదర్శనమని, అద్భుతంగా సేవలందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలందరికీ విస్తృతంగా అగ్నిమాపక అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. సోమవారం కరీంనగర్‌లోని కాశ్మీర్‌గడ్డ ఫైర్ స్టేషన్‌లో అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఫైర్ సేఫ్టీ కిట్ల ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే ఫైర్ సిబ్బంది చేరుకునే లోపే సహాయక చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఫైర్ సేఫ్టీ కిట్ల పనితీరుపై అవగాహన పెంపొందించాలన్నారు. బ్రోచర్లు, వాల్‌పోస్టర్ల ద్వారా జనసంచారం ఉన్నచోట , సినిమాహాళ్లలో ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్‌లో ప్రైవేట్ హాస్పిటళ్లు, అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ బిల్డింగ్స్‌లో ఫైర్ సేఫ్టీ కిట్ల పనితీరు తెలుసుకునేందుకు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించని నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా ఫైర్ ఆఫీసర్ తగరం వెంకన్న, సిపిఓ కొమురయ్య, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ నాగార్జున, వయోజన విద్య డిడి జయశంకర్, బిసి డెవలప్‌మెంట్ ఆఫీసర్ అనిల్ ప్రకాష్, ఎన్‌వైకే కో ఆర్డినేటర్ వెంకట రాంబాబు, జిల్లా అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ ప్రభాకర్, తదితరులున్నారు.

# బిసి డిమాండ్‌ల ప్రస్తావనేలేని బిజెపి ఎన్నికల ప్రణాళిక

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు

వెంకట్రాములు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపి ప్రకటించిన ఎన్నికల ప్రణాళికలో బిసిల డిమాండ్‌ల ప్రస్తావనే లేదని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. దేశవ్యాప్తంగా బిసి కులగణన జరగాలని, చట్టసభలలో బిసిలకు జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్‌లను కేటాయించాలని ఉద్యమాలు జరుగుతున్నాయని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెంకట్రాములు తెలిపారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు శాసనసభలలో తీర్మానాలు చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినా పట్టించుకొని ప్రధాని నరేంద్ర మోడీ తమ పార్టీ ఎన్నికల ప్రణాళికలో కూడా ఈ అంశాలు ప్రస్తావించకపోవడం దురదుష్టకరమన్నారు. ఎన్నికల ప్రణాళిక ద్వారా బిజెపి బిసిల డిమాండ్‌లపై ఉన్న వైఖరి ఏమిటో స్పష్టమైందన్నారు. బిసి ప్రధాన మంత్రిననిచెప్పుకునే నరేంద్ర మోడీ తన పాలనలో బిసిలకు ఒరగబెట్టిందేమి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో చైతన్య వంతులైన బిసిలు బిజెపికి తగిన గుణపాఠం చెప్పాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు. గతంలో రెండు సార్లు జరిగిన ఎన్నికల సందర్భంగా చేసిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడ మోడీ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలను పెంచి, ప్రజల నడ్డి విరిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంలోని ఖాళీలు భర్తీ చేయకుండా నిరుద్యోగ శాతం ప్రమాదకర స్థితిలో పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపదను కార్పొరేట్‌లకు అప్పచెప్పిందని దుయ్యబట్టారు. బడా పారిశ్రామిక వేత్తలకు లక్షలాది కోట్లరూపాయల రుణాలను మోడీ సర్కార్ మాఫీ చేసిందన్నారు. బడుగు, బలహీన వర్గాల పేదల సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. మతోన్మాదాన్ని రెచ్చగొట్టి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందన్నారు. ఈసారి ప్రకటించిన మేనిఫెస్టో కూడా మేడిపండు లాంటిదేనని విమర్శించారు. ప్రజా కంటక పాలకులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని, వామపక్ష లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు విజయాన్ని చేకూర్చేందుకు అన్ని వర్గాల ప్రజలు కృషి చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు.

# ధాన్యం ధర తగ్గింపుపై విచారణ జరపండి : గోదా శ్రీరాములు

**ప్రజాపక్షం / భువనగిరి రూరల్:** రైతులను వేధిస్తున్న రైస్ మిల్లర్ల యజమానులు, దాన్యం ధర తగ్గింపుపై విచారణ జరపండని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతులు లక్షలాది ఎకరాలలో వరి ధాన్యం పండించారు. వరి కోతలు పూర్తిచేసి వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారని తెలిపారు. రైతులు పండించిన వరి ధాన్యం ఏ-గ్రేడ్ ధాన్యానికి బదులు బి-గ్రేడ్ కింద ధర తగ్గింపు చేసి జిల్లాలో గల రైస్ మిల్లర్ల యజమానులు రైతులను వేధిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. పండించిన మంచి ధాన్యం ఏ-గ్రేడ్ ధర రైతులకు చెల్లించాలని సంబంధిత జిల్లా కలెక్టర్‌కి విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలలో తూకాలు కొలతల విషయంలో కూడా అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇప్పటికీ జిల్లాలోని పలు కేంద్రాలలో ధాన్యం నిల్వయున్నదని కొనుగోలు చేయటం చాలా జాప్యం జరుగుతుందని అన్నారు. రైతులు ధాన్యం భద్రపరచడం కాపలాగా ఉండటం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18న మార్కెట్ కమిటీ కార్యదర్శులకు రైస్ మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేసే విషయంలో మరియు రైతులను వేధింపు విషయంలో మార్కెట్ కమిటీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లాలని రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

# ఖమ్మం మార్వాడీ యూనివర్సిటీ అడ్మిషన్ ఆఫీస్ ప్రారంభం

**ప్రజాపక్షం / ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలో గుజరాత్ రాష్ట్రంలోని మార్వాడీ యూనివర్సిటీకి సంబంధించి అడ్మిషన్ ఆఫీస్‌ను ప్రారంభించారు. సోమవారం ఖమ్మం నగరంలోని నెహ్రూ నగర్‌లో గల సిపిఐ పాత కార్యాలయం కాంప్లెక్స్‌లోని నాల్గవ అంతస్తులో ఏర్పాటు చేసిన మార్వాడీ యూనివర్సిటీ అడ్మిషన్ ఆఫీస్‌ను యూనివర్సిటీ ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీర్ రాజేష్‌కుమార్ పటేల్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ కుమార్ మాట్లాడుతూ మార్వాడీ యూనివర్సిటీ దేశంలోనే 23వ స్థానంలో నిలిచిందన్నారు. న్యాక్ ఎ- ప్లస్ గుర్తింపు పొందిందన్నారు. అదేవిధంగా సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ పొంది 53 దేశాల విద్యార్థులు యూనివర్సిటీలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. మార్వాడీ యూనివర్సిటీలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యా సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులను బట్టి మధ్య తరగతి విద్యార్థులు చదువుకునే విధంగా యూనివర్సిటీలో ఫీజులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణులైన 50 శాతం మార్కులు పొందిన విద్యార్థులు యూనివర్సిటీలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. మార్వాడీ యూనివర్సిటీలో డిప్లొమా, బిటెక్, ఎంబిఏ, ఫార్మసీ, బియస్సీ అగ్రికల్చర్, ఫిజియోథెరపి, ఎల్‌ఎల్‌బి తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా, తెలంగాణ ఇంచార్జి మహేంద్ర నాయుడు, వెంకట వినయ్, భాను, ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ వెంకీ నాయుడు, చరణ్, తిరుమలరెడ్డి, దివ్య బాలినేని తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 7799467788, 8886661866 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# చౌటుప్పల్‌లో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలి: ఉడుగు శ్రీనివాస్

**ప్రజాపక్షం / చౌటుప్పల్:** చౌటుప్పల్‌లో సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా జడ్జి జయరాజుకు చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ చౌటుప్పల్ రెవిన్యూ డివిజన్‌గా, ఏసిపి హెడ్ క్వార్టర్‌గా ఉన్నదని అన్నారు. చౌటుప్పల్ పరిధి పెరిగిన నేపథ్యంలో సబ్‌కోర్టు ఏర్పాటు అవసరమని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు తాదురి పరమేష్, ప్రధాన కార్యదర్శి రాపోలు వేణు, తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు

జిల్లా ఎస్‌పి రాహుల్‌హెగ్డే



**ప్రజాపక్షం / సూర్యాపేట:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంట నే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 12 ఫిర్యాదు వచ్చినాయి. వివిధ సమస్యలపై బాధితుల నుండి వచ్చిన ఆర్జీలను జిల్లా ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రజావాణిలో బాధితుల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల అధికారులతో మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతి అంశాన్ని చట్టపరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. మహిళలను గౌరవించడం మన సంప్రదాయం, మహిళల పట్ల వేధింపులకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చట్టాలకు లోబడి ప్రతి పౌరుడు నడుచుకోవాలని చట్ట ఉల్లంఘన చర్యలకు పాల్పడవద్దు అన్నారు.

# దళారులకు ధాన్యం అమ్మి రైతులు మోసపోవద్దు

## జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** దళారులకు ధాన్యం అమ్మి మోసపోరాదని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలోనే ప్రభుత్వం సూచించిన విధంగా నాణ్యమైన మద్దతు ధరకు విక్రయించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రైతులకు సూచించారు. సోమవారం కలెక్టర్ దేవరుప్పుల మండలంలో పర్యటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు, అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు అధికారులతో కలిసి సందర్శించి పర్యవేక్షించారు. దేవరుప్పులలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, సింగరాజుపల్లిలో ప్రాథమిక సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఉన్న ఎంపీపీఎస్ స్కూల్‌ను, సీతారాంపురంలోని యూపీఎస్‌ను సందర్శించి ఆదర్శ పాఠశాల పనుల పురోగతిని పరిశీలించారు. పనులు వేగవంతంగా చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మండల తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో మొగులప్ప, పౌరసరఫరాల అధికారిని రోజారాణి, జిల్లా విద్యాశాఖ అధికారి రాము, పంచాయితిరాజ్ ఇంజనీరింగ్ అధికారి చంద్రశేఖర్, మండల అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, తదితరులు పాల్గొన్నారు.

### అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం

అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధి పనులపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్‌తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల అవసరాలను బట్టి పాఠశాల మరమ్మత్తులు, పనులు చేపట్టాలని, అంచనా ప్రతిపాదనలు క్షేత్రస్థాయిలో సందర్శించి వాస్తవ నివేధికను రూపొందించి ఇవ్వాలన్నారు. పాఠశాలల్లోని ప్రాధాన్యత గల పనులను ముందుగా చేపట్టాలని వసతుల కల్పన విద్యార్థులకు అందుబాటులోకి తేవాలన్నారు. కలెక్టర్ దేవరుప్పుల మండల కేంద్రంలో ఎంపీపీ పాఠశాలను, సీతారాంపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాము, పంచాయతిరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఈడబ్ల్యూఐడీసీ అధికారి నరేందర్‌రెడ్డి, డీఈలు ఏఈలు, విద్యాశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలి : డిఇఒ



**ప్రజాపక్షం/కొల్చారం :** సోమవారం నుండి ఒకటవ తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు వార్షిక పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లా విద్యాధికారి రాధా కిషన్, మండల విద్యాధికారి నీలకంఠం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొల్చారం, ప్రాథమిక పాఠశాల కొల్చారం, లేక్ వ్యూ ప్రైవేట్ పాఠశాల కొల్చారం, సీతారాం తండా, రంగంపేట ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల హాజరు గురించి ఉపాధ్యాయులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలని, అదేవిధంగా మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# ఎమ్మెల్యే రేవూరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



**ప్రజాపక్షం/సంగెం:** మండలంలోని లోహిత, షాపూర్ గ్రామాల నుంచి సుమారు 100 మందితో పరకాల నియోజకవర్గ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి నివాసంలో సంగెం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చొల్లేటి మాదవరెడ్డి, ఎంపీపీ కందగట్ల కళావతి నరహరి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో లోహిత ఎంపీటీసీ అడ్డగట్ల దుర్గారావు, షాపూర్ మాజీ సర్పంచ్ పేరాల రాజు, కాపులకనపర్తి సొసైటీ డైరెక్టర్ పేరాల రాజు, వార్డు సభ్యులు బొడిగ రజిత సదయ్య, పేరాల రాజయ్య, సంపత్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ గ్రామాధ్యక్షుడు ఓరుగంటి రాజు, గ్రామ ఉపాధ్యాయుడు ఓరుగంటి రాజు, బీఆర్ఎస్ గ్రాద ఉపాధ్యక్షుడు రైడాల రాజు, మచ్చ యాదగిరి, షాపురం బీఆర్ఎస్ అధ్యక్షుడు పేరాల దిలీప్‌రావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్టుపల్లి రమేశ్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు అచ్చ నాగరాజు, జిల్లా నాయకులు గుమ్మడి హరిబాబు, అంజన్‌రావు, మండల నాయకులు మునుకుంట్ల మోహన్ పాల్గొన్నారు. షాపూర్, గ్రామాధ్యక్షుడు దొనికల శ్రీను, శ్రీహరి, సమ్మారావు, ఆంజనేయులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల బంద్ ప్రశాంతం



**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి:** ములుగు జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాలలో సోమవారం మావోయిస్టుల బంద్ ప్రశాంతంగా సాగింది. ఏజెన్సీ ఏరియాలో పోలీస్ బలగాలు అప్రమత్తంగా ఉండి తనిఖీలు చేపట్టారు. ఛత్తీస్‌గడ్ తెలంగాణ రాష్ట్రాల మధ్యలో రెండు నెలలుగా మావోయిస్టుల పోలీసుల మధ్య బీకర పోరు సాగుతుంది. ఈ మధ్య జరిగిన పలు ఎన్‌కౌంటర్లలో సుమారు 43 మందికి పైగా మావోయిస్టులు మృతిచెందారు. దానికి నిరసనగా మావోయిస్టులు ఐదు రాష్ట్రాలలో బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలోనే ఛత్తీస్‌గడ్ బీజాపూర్ జిల్లాలోని చుట్వాహిలోని పోలీస్ క్యాంప్‌పై మావోయిస్టులు దాడి చేశారు. పోలీస్ క్యాంపుపై బాంబుల వర్షం కురిపించిన మావోయిస్టులు అయినా పోలీసులు ఎదురు కాల్పులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు సమాచారం.

# రైతులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

**ప్రజాపక్షం/జఫర్గడ్ :** జఫర్గడ్ మండలంలోని తిమ్మంపేట గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పది రోజులు అయినా ఇంతవరకు ప్రారంభించలేదని వెంటనే ప్రారంభించి ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించాలని సూచించారు. తేమ లేకుండా ధాన్యాన్ని అరబోయాలని తెలిపారు. రైతుల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, ఆర్ఐ అనిల్, ఏఈఓ అనిత తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయానికి ఎస్‌పి చేయూత



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా గంథాలయానికి వాటర్ డిస్పెంసర్ ,స్టడీ చైర్స్ ,స్టడీ ప్యాడ్స్ ను జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అందించారు. గత 15 రోజుల క్రితం జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించిన ఎస్పీ అక్కడ పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న అభ్యర్థులతో మాట్లాడిన అనంతరం వారికి ఏమైన సమస్యలున్నాయ అని అడిగి తెలుసుకున్నారు. గంథాలయానికి వాటర్ డిస్పెంసర్, స్టడీ చైర్స్, స్టడీ ప్యాడ్స్ కొరత ఉందని వాటిని సమకూర్చవలసిందిగా ఎస్పీ విజ్ఞప్తి చేయగా వారి విజ్ఞప్తి మేరకు అభ్యర్థుల శ్రేయస్సు కోరి 1వాటర్ డిస్పెంసర్, 15 స్టడీ చైర్స్ , 15 స్టడీ ప్యాడ్స్ ను సోమవారం నాడు సంగారెడ్డి పట్టణ ఇన్స్పెక్టర్ భాస్కర్ ఆద్వర్యంలో అందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ బాస్కర్, గ్రంథాలయం కార్యదర్శి వసుందర డిప్యూటీ లైబ్రేరియన్ వంశీ కృష్ణ, అసిస్టెంట్ లైబ్రేరియన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కెసిఆర్ సభకు ఏర్పాట్లు పూర్తి

## ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్ గ్రామ శివారులో మంగళవారం జరిగే బహిరంగ సభలో బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పాల్గొనున్నారు. సోమవారం సభస్థలాన్ని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ , మాజీ ఎంఎల్‌ఏ క్రాంతికిరణ్ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం కెసిఆర్ పాల్గొనే సభకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. సభకు హాజరయ్యే ప్రజలు కార్యకర్తలకు అభిమానులకు ,పార్కింగ్ కోసం ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని నిర్వాహకులకు సూచించారు. సభను విజయవంత చేసేందుకు భారీగా జన సమీకరణ చేశారని సుమారు రెండు లక్షల మందికి పైగా సభకు తరలి వచ్చే అవకాశం ఉందని ఎంఎల్‌ఏ తెలిపారు.

# ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం

## జయశంకర్‌పల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 22 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి అందిన దరఖాస్తులను అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖలకు కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. శాఖల వారిగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణపై బిజెపిది సవతితల్లి ప్రేమ

## అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారు

## ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/జఫర్గడ్ :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పది సంవత్సరాల కాలంలో తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిందని స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గ ఇంచార్జ్ సింగపురం ఇందిర, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కావ్య పాల్గొన్నారు. సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదన్నారు, మళ్లీ అధికారం చేపడితే అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని సైతం మారుస్తుందన్నారు. అధికారంలో ఉన్న ఇంతవరకు తెలంగాణకు ఒక నయా పైసా ఖర్చు పెట్టలేదని, కోచ్ ఫ్యాక్టరీ సైతం ఇవ్వలేదని, ప్రజలు బిజెపిని నమ్మి మరోసారి మోసపోవద్దని కోరారు. మోడీ ప్రభుత్వం దేశంలో అణగారినవర్గాలపై ఆకృత్యాలు పెరిగిన పట్టించుకోలేదన్నారు. కుల మత విద్వేషాలు రెచ్చ గొట్టి పబ్బం గడుపుతుందన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో అందరూ కలిసి పని చేసి రాహుల్‌గాంధీని ప్రధాని చేయాలన్నారు. పని చేసిన వారికే పార్టీ గుర్తింపు ఇస్తుందన్నారు. జఫర్గడ్‌ను టూరిజం హబ్ మాస్తానన్నారు. సింగపురం ఇందిరా మాట్లాడుతూ అధిష్టానం నిర్ణయం మేరకు పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరు కలిసికట్టుగా పనిచేసి ఎంపి అభ్యర్థి కావ్య గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైన్యకుల్లాగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ పది సంవత్సరాలు అభివృద్ధికి ఆమడ దూరంలో స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గం ఉన్నదని ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఈసారి నియోజకవర్గ అభివృద్ధి చెందుతుందన్నారు. రెండు లక్షల మెజార్టీతో గెలిపించారని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నూకల ఐలయ్య, జడ్పిటిసి బేబి శ్రీనివాస్, ఎంపీపీ సుదర్శన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య, పిఏసిఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మాజీ ఎంపీపీ కట్ట మనోజ్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్‌లు అన్నం బ్రహ్మారెడ్డి, అన్నెబోయిన బిక్షపతి, చిటిమల్ల కృష్ణమూర్తి, రాజేష్ నాయక్, ఎంపిటిసిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజాపాలనే కాంగ్రెస్ విధానం

## టిపిసిసి వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జయప్రకాశ్ రెడ్డి




**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** ప్రజాపాలనే కాంగ్రెస్ విధానమని, రాహుల్ గాంధీని ప్రధాని చేస్తేనే ప్రజలు సుఖ సంతోషాలతో ఉంటారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంఎల్‌ఏ తూర్పు జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడా రు. బిజెపి డబుల్ ఇంజన్ సర్కార్ అంటే అప్పులను డబుల్ చేయడమేనన్నారు. బీజేపి శ్రీరాముడి పేరు చెప్పి పబ్లిక్‌ని పరేషాన్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను 15 ఎంపి సీట్లలో గెలిపించాలని ప్రజలను కోరారు. పది సంవత్సరాల మోడీ పాలనలో 2014లో తులం బంగారం రూ.28 వేలు ఉంటే, మోడీ నాయకత్వంలో రూ.75 వేలకు చేరిందన్నారు. గ్యాస్, నిత్యావసరాల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దీనిపై మహిళలు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో బీజేపీ నేతల ఆందోళనలు ఓట్ల దుకాణంలో భాగమేనన్నారు. నెహ్రూ నుండి మన్మోహన్ సింగ్ వరకు దేశం అప్పు రూ.55 లక్షల కోట్లు ఉంటే, మోదీ ఒక్కడే రూ.కోటి 13 లక్షల కోట్లు అప్పు చేశాడన్నారు. రాముడు ఎప్పుడైన అప్పులు చేయండీ అని చెప్పారా అని ప్రశ్నించారు. మెదక్‌లో కాంగ్రెస్‌లో గెలుస్తుందన్నారు.

# కనీస మద్దతు ధరకు ధాన్యం విక్రయాలు

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** యాసంగి ధాన్యం కనీస మద్దతు ధరకు విక్రయించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు రైతులకు సూచించారు. సోమవారం తాడిచర్ల మండలంలోని వల్లెం కుంట, మల్లారం గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఏక్యూ నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతులు కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు దాన్యం విక్రయించొద్దని సూచించారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా189 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కనీస మద్దతు ధరకంటే తక్కువకు ఎవరైనా కొలుగోలు చేస్తే పోలీస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ ధరను దృష్టిలో ఉంచుకుని రైతులు మూకుమ్మడిగా ధాన్యాన్ని మార్కెట్ తీసుకురాకుండా దశల వారిగా తీసుకురావాలని సూచించారు. ధాన్యం కేంద్రాలకు రైతులు సంబంధిత జీరాక్స్ పత్రాలను వెంట తెచ్చుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు.

# బిజెపి పాలనలో దళితులపై పెరిగిన దాడులు

## డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. దళిత హక్కుల పోరాట సమితి భూపాలపల్లి జిల్లా కౌన్సిల్ సమావేశం పీక రవికాంత్ అధ్యక్షతన రవి నారాయణ రెడ్డి భవన్ లో సమావేశం జరిగింది. సమావేశానికి మారూపాక అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ, సామాజిక న్యాయాన్ని సమాధి చేసే దిశగా బీజేపీ పాలన సాగుతున్నది. దేశంలోని నవరత్నాల వంటి ప్రధాన ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతున్నది. ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు ఉండవవాని, రిజర్వేషన్లు కోల్పోతే సామాజిక న్యాయ ముండదన్నారు. కేంద్ర బీజేపీ సర్కార్ నూతన విద్యా విధానం పేరుతో ఉన్నత విద్యకు అట్టడుగు పేదలను దళితులను దూరం చేసే కుట్రకు ఒడిగట్టిందని పేర్కొన్నారు. నూతన విద్యా విధానంలో రిజర్వేషన్లు ఉండవని, మేనేజ్‌మెంట్ కోటాలోనే ప్రతిఒక్కరూ చేరాల్సిందేన్నారు. కోట్ల రూపాయలు ఉన్నవారే ఉన్నత చదువు కొను క్కుంటారని వివరించారు. దళితులకు ఉన్నత విద్య దక్కకుండా చేస్తున్నదని,బీజేపీ ఈ పదేండ్ల కాలంలో దళితులపైన 300 రెట్లు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయని మండిపడ్డారు. ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు మహిళలకు ఏమాత్రం రక్షణ లేకుండా అభద్రతలో జీవిస్తున్నారని, నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో ఇచ్చిన లెక్కల ప్రకారం 2018 నుంచి దళితులపై అత్యాచారాలలో బీజేపీ పాలిత రాష్ట్రాలు ముందు ముందు వరుసలో ఉన్నాయని తెలిపారు. 2014–15 నుండి 201920 మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో దళితులకు 7.51 లక్షల కోట్ల రూపాయలు రావాల్సి ఉండగా, కేవలం 20.8శాతం మాత్రమే కేటాయించిందని, 2017–18 సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని రద్దు చేసిందని అన్నారు. సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, రాసపల్లి భద్రయ్య, నేరెళ్ల జోసఫ్, పీక రవికాంత్, మరాటి కాంతారావు,పొన్నగంటి లావణ్య, దొంతుల రవీందర్, సకినాల మౌనిక, గాజుల మహేష్, గోనెల తిరుపతి, లావణ్య శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

## డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్

**ప్రజాపక్షం/నెక్కొండః** విద్యార్థులు పాఠశాల స్థాయి నుండి చదువులతో పాటు ఆరోగ్యంపైన శ్రద్ధ చూపాలని నర్సంపేట డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాష్ అన్నారు. మండలంలోని పెద్ద కొరుపోల్ గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకులంలో ఆర్‌బిఎస్‌కె ఆధ్వర్యంలో సోమవారం ఉచిత నేత్ర వైద్య శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటేనే చదువుల్లో రాణిస్తారన్నారు. ఇందుకోసం పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పాలు, ఆకుకూరలు, పండ్లు తీసుకుంటు నిద్ర సరిపడా పోవాలని అది ఎంతో ముఖ్యమన్నారు. అంతేకాక ఫోన్లు, టివిలు అధికంగా చూడడం వలన దృష్టిలోపాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ , స్మిత, సమ్మక్క, గురుకులం స్పెషల్ ఆఫీసర్ రజిత, ఆశా కార్యకర్త జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



# మతోన్మాద పార్టీలను ఓడించండి

## సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వీరయ్య




**ప్రజాపక్షం/గోవిందరావుపేటః** పార్లమెంట్ ఎన్నికలలో ఎలాగైనా గెలుపు సాధించాలని ఓట్ల కోసం సీట్ల కోసం బిజెపి ప్రజలకు మతం రంగు పులుముతోందని సిపిఐఎం పార్టీ రాష్ట్ర, కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఎస్ వీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని పస్రా గ్రామంలో పిఎస్ఆర్ గార్డెన్స్‌లో సిపిఎం పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశం జిల్లా నాయకులు పొదిళ్ల చిట్టిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎస్ వీరయ్య హాజరై మాట్లాడారు. గత పది సంవత్సరాల పాలనలో బిజెపి ఈ సారి అధికారంలోకి రాలేమని గుబులుతో భయంతో నీతికి, న్యాయానికి తిలోదకాలు ఇచ్చి అధికారమే పరమావధిగా ఇతర పార్టీలను నాయకులను అణగదొక్కుతూ జైలు పాలు చేస్తూ ఈడి దాడులతో ఉక్కిరి బిక్కిరి చేస్తూ అక్రమ నీతిని చాటుకుంటుందని అన్నారు. రైతుల సంక్షేమాన్ని గిట్టుబాటు ధరను పట్టించుకోని ప్రభుత్వం పూర్తి స్థాయిలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేస్తూ పెట్టుబడిదారి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు సిద్ధపడి రైతులను కూలీలుగా మార్చేందుకు ప్రయత్నాలు చేస్తుందన్నారు. గతంలో దొంగ వ్యవసాయ చట్టాలను తీసుకొచ్చిన బిజెపి ప్రభుత్వానికి రైతులు బుద్ధి చెప్పినట్లే ఈసారి కూడా ఎన్నికలలో రైతులు తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. బిజెపి పాపాల పుట్టను కదిలించేందుకే ఇండియా కూటమి ఏర్పడిందని మత చాందసవాదాన్ని తుద ముట్టించేందుకే అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వస్తున్నాయని దీనితో బిజెపి కథ కంచికి చేరుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, తీగల ఆగిరెడ్డి, బిరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, ఎండి దావూద్ తదితరులు పాల్గొన్నారు.

# మే 30లోపు సిఎంఆర్ ధాన్యం అందజేయాలి

## ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధిః** 2023–24 ఖరీఫ్ సిఎంఆర్ ధాన్యం మే 30వతేదీలోపు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లాలోని రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జిల్లాలోని రైస్ మిల్లర్ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2023–24 ఖరీఫ్ సీజన్ సిఎంఆర్ ధాన్యం అందజేయాలని, ధాన్యం విషయంలో రైస్ మిల్లర్ల యజమానులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రబీ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైస్ మిల్లుర్లు ధాన్యం దిగుమతి చేసుకోవాలని, కారణాలు చూపించి కోతలు విధిస్తే రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ధాన్యం దిగుమతి చేసుకునే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ధాన్యం వస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, నాణ్యత ఉన్న ధాన్యం ఎలాంటి ఆటంకాలు లేకుండా దిగుమతి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, సివిల్ సప్లై అధికారి రాంపతి, అధికారులు, జిల్లాలోని వివిధ రైస్ మిల్లర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

### ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ తనిఖీ

పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా కలెక్టరేట్‌లో గల ఇవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్‌పి శబరీష్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్రామిశ్రాలతో కలిసి తనిఖీ చేశారు. ముందుగా గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్ళి ఇవిఎం, వివిప్యాట్లు భద్రపరిచిన గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరంతరం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, గోడౌన పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని గోడౌన్ పరిధి లోపలికి అనుమతించకూడదని అధికారులకు సెక్యూరిటీ, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, డిఎస్‌పి రవీందర్, ఎంఆర్‌ఓలు విజయభాస్కర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



### పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలలో ఓటర్‌ల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారిని ఇలా త్రిపాఠి, ఎస్‌పి శబరీష్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ చిత్రామిశ్రాలతో కలిసి తహసీల్దార్లు, సెక్టార్ అధికారులతో మౌలిక సదుపాయాలు, క్లిష్టమైన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సెక్టార్ రూట్ మ్యాప్‌ల సంసిద్ధత తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, డిఎస్‌పి రవీందర్, ఎంఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, పోలీస్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజావాణి దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలి

ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, సిహెచ్ మహేందర్‌జిలతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజల నుండి ఆర్జీలను స్వీకరించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 11 దరఖాస్తులు రాగా ఆయా దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు పరిష్కరణ నిమిత్తం సిఫారసు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ కె సత్యపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కల్యాణానికి సిరిసిల్ల బంగారు నేత చీర కానుక



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి** : సీతారాముల కల్యాణానికి సిరిసిల్ల సీతమ్మ కళ్యాణం చీర ప్రతి సంవత్సరం ఆనవాయితీగా ఇస్తున్న వెల్ది హరిప్రసాద్ మరో అద్భుతమైన చీరను చేనేత మగ్గంపై సీత రాముల కళ్యాణం వచ్చే విధంగా అంతేకాకుండా అంచులు భద్రాద్రి దేవాయాయంలో ఉన్నటువంటి సీతారాముల ప్రతిరూపాలు అంచులు వచ్చే విధంగా చీర మొత్తం శంకు చక్ర నామాలు తీరపై బార్డర్లో జైశ్రీరామ్ అంటూ వచ్చే విధంగా ఆరు రోజుల పాటు శ్రమించి ఈ చీరను చేనేత మగ్గంపై నేశాడు ఈ చీర యొక్క బరువు 800 గ్రాములు ఉంటుంది. ఇందులో రెండు గ్రాముల బంగారం 150 గ్రాముల వెండి పట్టు దారాలతో వేశాడు. చీర కొంగులో సీతారాముల కళ్యాణం బొమ్మనియడం విశేషం. దీన్ని దేవాదాయ శాఖ మంత్రి చూపించి సీతారాముల కల్యాణానికి అందిస్తాను అని చెప్పడం చెప్పారు.

## ఇసుక డంపులు పట్టివేత

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/మల్లాపూర్** : అక్రమంగా భారీ వాహనాల్లో ఇసుక తరలిస్తున్నారనే వార్త శీర్షికన సోమవారం ప్రజాపక్షం జాతీయ దినపత్రికలో ప్రచురితం కాగా మండల రెవెన్యూ అధికారులు తక్షణమే స్పందించారు. గొర్రెపల్లి గ్రామ సమీపంలోని అడవిని ఆనుకుని ఉన్న గోదావరి నది నుండి గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను ట్రాక్టర్లలో తరలించి ఏర్పాటు చేసిన ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలించడమే కాకుండా డంపులను ఏర్పాటు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, పట్టుకుని చర్యలు తీసుకుని రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా పట్టుకున్న ఇసుక నిల్వల విలువ రెవెన్యూ అధికారులు తెలపాల్సి ఉంది.

## బిఆర్ఎస్ సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/సారంగాపూర్** : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలో విలేజ్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి బాజిరెడ్డిగోవర్ధన్, రాజ్య సభ సభ్యులు సురేష్ రెడ్డి, ఎన్నికల ఇంచార్జ్, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి మనోహర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గుర్రాల రాజేందర్ రెడ్డి, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షుడు సుధాకర్ రావు, వైస్ ఎంపిపి సురేందర్, సీనియర్ నాయకులు రవీందర్ రావు, మల్లేశం, పాక్స్ వైస్ చైర్మన్ బాపి రాజు, ఎంపిటిసిలు మాజీ సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దొంగలు అరెస్ట్



**ప్రజాపక్షం/మల్యాల/జగిత్యాల ప్రతినిధి** : జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాజారాంలో ఇటీవల ట్రాక్టర్ దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జగిత్యాల డిఎస్‌పి రఘు చందర్ తెలిపారు. సోమవారం మల్యాల సిఐ నీలం రవి, మల్యాల ఎస్ఐ రహీంతో పాటు కలిసి నిందితులను డిఎస్‌పి అరెస్టు చేసి వివరాలు వెల్లడించారు. నిర్మల్ జిల్లా కడెం మండలం అల్లంపెల్లికి చెందిన సింగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పెంబి రాజు, ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం షాంనగర్‌కు చెందిన గొర్రె మధుకర్‌లు ట్రాక్టర్ దొంగిలించరన్నారు.

## అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయండి

జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి:** వేసవి సెలవులు ఉన్నందున వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్యలతో కలిసి మున్సిపల్ కమీషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, మెప్మా, ఎపిఎం, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అభివృద్ధి పనుల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్య కమిటీలకు రూపాంతరంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించడం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యవసర, నిర్వహణ పనులలో భాగంగా ప్రాథమిక, మౌలిక సదుపాయాల బలోపేతం, బాలికల మరుగుదొడ్ల నిర్మాణం, త్రాగునీటి సౌకర్యాలు కల్పించడం, చిన్న, పెద్ద మరమ్మత్తులను చేపట్టడం తదితర సౌకర్యాల కల్పన లక్ష్యంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పని చేస్తుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్, ప్రధానోపాధ్యాయుల పేరిట సంయుక్త బ్యాంక్ ఖాతా తెరిచి లావాదేవీలను నిర్వహించవలసి ఉంటుందని అన్నారు. పనులతో పాటు పాఠశాలల నమోదు ప్రక్రియ, నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని, పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, దినసరి పద్ధతిన పనులు నిర్వహించాలని, పనుల పురోగతిపై ఫొటోలు తీసి భద్రపరిచి పోర్టల్లో నమోదు చేయాలని అన్నారు. ఆయా పాఠశాలలకు మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించేలా పర్యవేక్షించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలలో పూర్తి స్థాయి వసతులు కల్పించి విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్** : పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో తాగు, సాగు నీటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రానీయకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఊష్ణగ్రతలు పెరగడం వల్ల వచ్చే రెండు నెలలు కీలకం అని అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ తాగునీటి సరఫరా ప్రక్రియలో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటి కొరతపై వచ్చే ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని, పైప్‌లైన్, చేతిపంపులకు అవసరమైన మారమ్మత్తులు చేపట్టి నీటిని అందించాలని అన్నారు. ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని రిజర్వాయర్ల నీటిని అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని, రైతులకు సాగు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. పంటల అవసరాలను అంచనా వేసి నీటిని విడుదల చేయాలని సూచించారు. నీటి వృధాను అరికట్టేలా కాల్వాలకు మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ప్రజలకు త్రాగు నీరు,సాగునీరు కు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఎస్ఈ సుశీల్ కుమార్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్,మిషన్ భగీరథ డీ.ఈ.సందీప్,నిర్మల్,ఖానాపూర్, బైంసా మున్సిపల్ కమిషనర్లు రాజు,మనోహర్, వెంకటేశ్వర్ రావ్,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇప్పటి వరకు బిజేపిలో పని చేసిన ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, నిర్మల్ డిసిసి అధ్యక్షులు శ్రీహరిరావు, బోథ్ ఇంచార్జి ఆడె గజేందర్ లు పాల్గొన్నారు.

## మోడీతోనే పురోగతి : ఏలేటి



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పదేళ్ల పాలనలోనే దేశం అన్ని రంగాలలో పురోగతని సాధించిందని, అన్ని వర్గాల నుంచి తమ లోకసభ ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నదని బిజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట, ప్రాంతంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎన్నికల ప్రచారానికి అయిన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పదేళ్ల మోడీ సర్కార్ అప్‌కీ బార్ చార్ సౌసే సర్కార్. అనే నినాదాలు చేస్తూ ప్రచారాన్ని నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటి ప్రచార కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి సముచిత ప్రధాన్యత లభిస్తుందని తిరిగి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వమే కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే నల్లా ఇంద్రకరణ్ రెడ్డి, బిజెపి ఆదిలాబాద్ పార్లమెంటరీ కన్వీనర్ అయ్యన్న, భూమయ్య, పెద్దపెల్లి ఇన్చార్జ్ రావుల రాంనాథ్, బిజెపి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంజు కుమార్ రెడ్డి, సామ రాజేశ్వర్ రెడ్డి, మెడిసెమ్మ రాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్ తదితరులు ఉన్నారు.

# పేదల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/వేములవాడ** : వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామంలో నుండి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరిన పలువురుకి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించిన ప్రభుత్వ విప్, పేద ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి గ్రామనికి చెందిన బిఆర్ఎస్ మండల నాయకులు రొమాల ప్రవీణ్, యాదవ సంఘనికి చెందిన మెడిదల పరుశరాములు, మెడిదల శ్రీనివాస్, పోట్ల మధు, ఏసుక్రీస్తు, బసవరాజు, రజక సంఘం చెందిన కొత్తకొండ రమేష్, దేవయ్య, హమాలి సంఘానికి చెందిన సుంకపాక శంకరయ్య ఆధ్వర్యంలో సుమారు 200 మంది ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. పేద ప్రజలకు, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సంక్షేమ పథకాలు కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే సాధ్యం అన్నారు. దేశంలో, రాష్ట్రంలో పేద ప్రజలకు కేవలం కాంగ్రెస్ పార్టీ ద్వారానే అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు సాధ్యమని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు ప్రజా పాలనకు స్వీకారం చుట్టారని దేశంలో కూడా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో అధికారంలోకి వచ్చిన గత పాలకులు తెలంగాణ పదాన్ని దూరం చేసుకున్న నాడే ప్రజలతో పేగు బంధం తెగిపోయింది అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిత్యావసర ధరలు పెంచుతూ సామాన్యులను రోడ్డున పడేస్తుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో కొత్త పాత అనే తేడా లేకుండా కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు.

**పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్**

వేములవాడ రూరల్ మండలం ఫాజుల్ నగర్ గ్రామంలోని శ్రీ పెద్దమ్మ పెద్దిరాజుల కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి దివ్య ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి** : నామినేషన్ల ప్రక్రియను సక్రమంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్‌లు అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగుతుందని, సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని అన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పరిశీలించాల్సిన పత్రాలు, అభ్యర్థులకు అందించాల్సిన సూచనలు, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, తదితర అంశాలను కలెక్టర్ అధికారులకు వివరించారు. లోక్ సభ ఎన్నికలలో పోటీ చేయబోయే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి ఒకరోజు ముందు ప్రత్యేకమైన బ్యాంకు ఖాతా ప్రారంభించాలని, స్క్రుటిని ప్రారంభం కంటే ముందే అఫిడవిట్ కరెక్షన్స్, డిపాజిట్ సొమ్ము, కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు వీలుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద సహాయ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు, ఎటువంటి ఇబ్బందులు చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో తహసిల్దార్‌లు, కలెక్టరేట్ ఎఒ శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, ఇడిఎం కవిత, రెవెన్యూ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

ఎంఎల్ఎ కోవ లక్ష్మి



**ప్రజాపక్షం /ఆసిఫాబాద్ :** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఆసిఫాబాద్ ఎంఎల్ఎ కోవ లక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో రెబ్బెన మండలం ఇంద్ర నగర్ లోని స్వయంభుగా వెలసిన కనకదుర్గ ఆలయం వద్ద ఈనెల 23 ,24, 25 తేదీలలో జరగనున్న జాతర మహోత్సవ ఆహ్వాన పత్రికను ఆలయ ప్రధాన అర్చకుడు దేవర వినోద్ ఎంఎల్ఎకు అందజేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోవ లక్ష్మి మాట్లాడుతూ ఇంద్రనగర్ కనకదుర్గమ్మ ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, భక్తులకు కొంగుబంగారంగా మారిందన్నారు. జాతర మహోత్సవ వేడుకల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని అర్చకుడు వినోద్ కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు తిరుపతి, సురేష్, సంతోష్, జీవన్ తదితరులున్నారు.

# బిజెపిని చిత్తుగా ఓడించండి

వామపక్ష పార్టీల జిల్లా కార్యదర్శుల పిలుపు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి:** రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కార్మిక కర్షక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బిజెపి పార్టీని చిత్తుగా ఓడించి భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని వామపక్ష పార్టీ జిల్లా కార్యదర్శిలు తాంద్ర సదానందం, వై యాకయ్య, ఈ నరేష్, కే విశ్వనాథ్, తోకల రమేష్ లో పిలుపునిచ్చారు. సోమవారం రోజున గోదావరిఖనిలో స్థానిక భాస్కరరావు భవన్లో సిపిఐ నగర కార్యదర్శి కే కనక రాజ్ అధ్యక్షతన జరిగిన వామపక్ష పార్టీల సదస్సు జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వామపక్ష పార్టీ జిల్లా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ఉద్యోగస్తుల కనీస వసతులను హరిస్తూ, కార్పొరేట్ సంస్థలకు ఇబ్బడి ముబ్బడిగా ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ కార్మికుల బతుకులు వీధిపాలు చేస్తుందని, కనీస వేతన చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చిన మోడీ ప్రభుత్వం పది సంవత్సరాలు గడిచిన కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం వేతనాలు చెల్లించడం లేదని దుయ్యబట్టారు. కార్పొరేట్ సంస్థల చేతిలో మోడీ ప్రభుత్వం కీళ్లు బొమ్మగా మారిందని, వాళ్లు ఆడింది ఆటగా పాడింది పాటగా ప్రభుత్వం నడుస్తున్నదని దీనితో కార్మికులపై పని భారం పెంచి కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదని ఇలాంటి ప్రభుత్వాన్ని రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరి,సిపిఐ సిపిఎం నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాఠశాల అభివృద్ధి పనులు ప్రారంభించాలి

కలెక్టర్ అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి** : సిరిసిల్ల, వేములవాడ పట్టణంలో పాఠశాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులు వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ అనురాగ జయంతి వేములవాడ, సిరిసిల్ల పట్టణ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేయాల్సిన మరమ్మత్తు పనులు అదనపు తరగతుల నిర్మాణం టాయిలెట్స్, మొదలగు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను కలెక్టర్ పరిశీలించి, ప్రాధాన్యత ప్రకారం పనులు వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టే పనులకు నిధులు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందని, అభివృద్ధి పనుల ప్రతిపాదనలో 20 శాతం మేర నిధులు పనులు ప్రారంభించిన వెంటనే మంజూరు చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిఈఓ రమేష్ కుమార్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అవినాష్, ఇంజనీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

**ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలి**

పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్‌సి విద్యార్థులు ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి పిలుపునిచ్చారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఎస్‌సి స్టడీ సర్కిల్‌ను కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు కల్పించిన వసతి, భోజన సౌకర్యాలను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్టడీ సర్కిల్‌లోని విద్యార్థులతో మాట్లాడారు. ఇంకా ఏమైనా సౌకర్యాలు అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఎస్‌సి విద్యార్థులు స్టడీ సర్కిల్‌లోని సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిరిసిల్ల ఎస్సీ స్టడీ సర్కిల్‌లో మొత్తం 100 మంది అభ్యర్థులు ఉన్నారు. 55 మంది యువకులు, 45 మంది యువతులు ఉన్నారు. ఇక్కడ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ కోసం రూ.2500, యువకులకు ప్రతి నెలా రూ.100, యువతులకు ప్రతి నెలా రూ.150 మైంటనేన్స్ కోసం ఇస్తామని ఎస్‌సి కార్పొరేషన్ ఈడీ వినోద్ కుమార్ తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు స్టడీ సర్కిల్ లో సంప్రదించాలని సూచించారు. ఇక్కడ సూపరింటెండెంట్ మొహమ్మద్ అజాం తదితరులు పాల్గొన్నారు.

## ఇసుకను దోచుకుంటున్నాదెవరో చెప్పండి

జెడ్‌పి చైర్మన్ పుట్ట మధూకర్



**ప్రజాపక్షం/మంథని:** ఆనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాత ముత్తాతల సొత్తులాంటి ఇసుకను దోచుకుపోతున్నారని మాట్లాడిన అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత మంత్రి ఈనాడు ఇసుకను ఎవరు దోచుకుంటున్నారో ప్రజలకు జవాబు చెప్పాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఇసుక లారీలతో ఛిద్రమైన మంథని పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మీడియాతో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆనాడు అనేక అబద్దాలు చెప్పిన మంత్రి ఈనాడు ఇసుక అక్రమ తరలింపుపై ఎందుకు స్పందించడం లేదన్నారు. ఇసుక లారీలు, క్వారీల ద్వారా 30 తారీఖునాడు కోట్లు వస్తాయని ప్రచారం చేసిన మంత్రి ఎన్నికల్లో వంద కోట్లు ఎలా ఖర్చు చేశారని, అంత పెద్ద మొత్తంలో డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక రకంగా అధికారంలో లేనప్పుడు మరో రకంగామాట్లాడటం సిగ్గు చేటు అన్నారు. వంద టన్నుల బరువు వెళ్లినా చెదిరిపోకుండా రోడ్ల నిర్మాణం చేస్తే ఈనాడు ఓవర్‌లోడ్ లారీల కారణంగా రోడ్లు ఛిద్రం అయిపోయిందని తెలిపారు. నాలుగు నెలలు గడువక ముందే వంద టన్నులు పైబడి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, అధికారులకు పోలీసులకు ఫిర్యాదు చేస్తే అక్కడక్కడ ఒకటి రెండు పట్టుకుని కేసు నమోదు చేస్తున్నారని, వందల సంఖ్యలో మాత్రంగా అక్రమంగా వెళ్తున్నాయని ఆయన వివరించారు. నియోజకవర్గంలో ఇసుక, బెల్లం, బియ్యం, స్క్రాప్ దందాలకు కాంగ్రెస్ నాయకులే ఇంచార్జీలు అని, మంత్రి సోదరుడు వీటికి నాయకత్వం వహిస్తున్నాడని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉందని, ఇసుక లారీలు, క్వారీలను ఎందుకు ఆపడం లేదని, సుల్తానాబాద్‌లో ఇసుక లారీలను నిలిపివేయాలని అన్ని పార్టీల నాయకులు దీక్ష చేపట్టారని, అదే తరహాలో నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ఇసుక లారీలు, క్వారీలు నిలిపివేయాలని దీక్ష చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు తగరం శంకర్‌లాల్, కాయితి సమ్మయ్య, అనిల్, సుల్తాన్ ఆసిఫ్‌ఖాన్, గొబ్బూరి వంశీ, ఇర్ఫాన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సిర్పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కృషి



బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్

**ప్రజాపక్షం/కాగజ్ నగర్** : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్ నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహించి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్ అన్నారు. సోమవారం కాగజ్ నగర్ పట్టణంలోని పటేల్ గార్డెన్స్‌లో బిజెపి బూత్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి ఎంపి అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గ ప్రజలు పెద్ద ఎత్తున పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపికి మద్దతు తెలపాలని తద్వారా మోడీ ప్రభుత్వానికి శక్తిని ఇవ్వాలని, జాతీయ రహదారులు, రైల్వేల అభివృద్ధి కోసం సిర్పూర్ ఎంఎల్ఎ డా. పాల్వాయి హరీష్ బాబుతో కలిసి పనిచేస్తామని తెలిపారు. అనంతరం సిర్పూర్ ఎంఎల్ఎ డా. పాల్వాయి హరీష్ బాబు మాట్లాడుతూ ఇదివరకే జిల్లాలో ఒక జాతీయ రహదారి పూర్తయిందని, ఇంకో జాతీయ రహదారి మంజూరైందని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధి కోసం బిజెపికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంఎల్ఎ పాయల్ శంకర్, జిల్లా అధ్యక్షులు డా. కొత్తపల్లి శ్రీనివాస్, మాజీ జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఒబిసి మోర్చ నాయకులు గోలెం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధోని శ్రీశైలం పాల్గొన్నారు.




## విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు

### ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బిక్షపతి

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** విద్యా రంగాన్ని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని,దీనిపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి అన్నారు. హన్మకొండ బాల సముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు బిక్షపతి మాట్లాడుతూ అశాస్త్రీయ భావ జాలాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్నదని, విద్యా రంగాన్ని కాషాయమయం చేస్తున్నదని అన్నారు.రాజ్యాంగ సూత్రాలకు విరుద్ధంగా విద్యా విధానాన్ని తీసుకు వచ్చి పేద,నిమ్న వర్గాలకు విద్యను దూరం చేయాలని చూస్తున్నదని అన్నారు. అలాంటి బిజెపిని రానున్న ఎన్నికలలో గద్దె దించేలా విద్యార్థులు ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, కుక్కల కుమార్, జక్కుల భాను ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవి తేజ పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో మోసం

### అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోతపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ డిమాండ్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో అనుమతులు లేకుండా అడ్మిషన్ల పేరుతో ఫీజుల మోత మోగిస్తున్న పాఠశాల యాజమాన్యాల పై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో సోమవారం ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంకా విద్యా సంవత్సరం పూర్తి కాకుండానే ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్ 2024 25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయన్నారు. కొన్ని స్కూళ్లలో అప్పుడే అడ్మిషన్లు పూర్తి య్యాయని చెప్పడం బాధాకరమన్నారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో ఫీజులు తక్కువగానే ఉన్నాయని మిగిలిన కొన్ని కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లు మాత్రం ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా దండుకుంటున్నాయన్నా రు. కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పాఠశాలలను నియంత్రించడంలో అధికారులు ధ్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నారన్నారు. అడ్మిషన్ల సమయంలోనే డోనేషన్, బుక్స్, యూనిఫాం, ఐఐటి ఫౌండేషన్ ఇతరత్రా రకరకాల పేర్లతో అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నా విద్యా శాఖాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి ప్రైవేటు పాఠశాలల దోపిడీని నిలువరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు శివ, వంశీ, రాహుల్, నరేష్, గోపి, సాయి పాల్గొన్నారు.

## మధుయాష్కీ గౌడ్‌కు మాతృవియోగం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ తల్లి యాష్కి అనసూయ (85) సోమవారం ఉదయం మరణించారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లోని మధుయాష్కి నివాసంలో ఎటువంటి కదలిక లేని స్థితిలో ఉన్న అనసూయను సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. పలువురి సందర్శనార్థం అనసూయ పార్థివదేహాన్ని బంజారాహిల్స్ లోని నివాసం నుంచి హయత్‌నగర్‌లోని పాత ఇంటికి తీసుకెళ్లారు. కాగా పార్థివదేహాన్ని మంత్రులు,రాజకీయ, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ఎల్.బినగర్ నియోజకవర్గ నాయకులు సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం హయత్ నగర్ రేడియో స్టేషన్ పక్కనే మధుయాష్కి వ్యవసాయ క్షేత్రంలో సోమవారం సాయంత్రం అంత్యక్రియలను నిర్వహించారు.

**సిఎం రేవంత్ రెడ్డి సంతాపం :** మధుయాస్కి గౌడ్ తల్లి అనసూయమ్మ మరణం పట్ల ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంతాపాన్ని ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇతర మంత్రులు, ప్రముఖులు కూడా తమ సంతాపాన్ని ప్రకటించారు.

**ప్రముఖుల నివాళి :** మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి, మాజీ మంత్రి రాజేశం గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నేత కెవిపి రామచంద్రరావు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంఎల్ఎలు మల్ రెడ్డి రంగారెడ్డి, దేవి రెడ్డి సుధీర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి,మందుల సామేలు, ఎంఎల్‌సి పట్నం మహేందర్ రెడ్డి మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్, బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, కార్పొరేషన్ల చైర్మన్లు మల్‌రెడ్డి రామ్ రెడ్డి, నూతి శ్రీకాంత్ గౌడ్, ఫహీం, మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌తో పాటు మధుయాస్కి గౌడ్ స్నేహితులు, అభిమానులు అనసూయ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మధుయాస్కి గౌడ్ కుటుంబ సభ్యులకు వారు సానుభూతి తెలిపారు. కాగా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎంఎల్ఎ సత్యనారాయణ అనుసూయ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## ఎల్ఎండి కాంప్లెక్స్ హెచ్ఎంపై విచారణ

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాలో తిమ్మాపూర్ మండల కేంద్రానికి సమీపంలోని ఎల్ఎండీ కాంప్లెక్స్ లో ఇటీవల వెలుగులోకి వచ్చిన ఉపాధ్యాయులకు సంబంధించిన రూ.10 లక్షల జీతభత్యాల బిల్లుల అక్రమాలపై సంబంధిత అధికారిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఈ నెల 6న ''ఉపాధ్యాయుల జీతభత్యాల సొమ్ము స్వాహా?'', 15 న ''తవ్విన కొద్దీ అక్రమాలే!..'' అనే శీర్షికన ప్రచురితమైన వరుస కథనాలతో జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యా శాఖ అధికారి ఈ తతంగంపై ఉన్నస్థాయిలో విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.మొండయ్య, చిగురుమామిడి జిహెచ్ఎం పావని, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ రవీందర్‌లతో కూడిన ముగ్గురు సభ్యులు గల కమిటీ విచారణ సోమవారం ప్రారంభించింది. ఈ సంధర్భంగా ఆరోపణలు ఎదుర్కొంటున్న డిడివో (డ్రాయింగ్ ఆఫీసర్)రాజభానుతో పాటు 17 మంది టీచర్లు, మూడు ఉపాధ్యాయ సంఘాలకు సంబంధించిన బాధ్యులను విచారించారు. ఉపాధ్యాయుల సమ్మతి లేకుండా సంపాదిత సెలవు వేతనం మంజూరు చేసి తిరిగి చెల్లించే నిమిత్తం సదరు ఉపాధ్యాయుల వద్ద వసూళ్లు చేసి సొంతానికి వాడుకున్న విషయంతో పాటు మెడికల్ లీవుల బిల్లులు, యూనియన్ సెలవులు, వినియోగించుకునే ఆన్‌డ్యూటీలపై జరిగిన అక్రమాలపై పలు ఉపాధ్యాయ సంఘాలు ఆరోపణలు చేసిన విషయమై అధికారులు విచారణ చేపడుతున్నారు.

# మోడీ భావోద్వేగ మత రాజకీయాలను ఓడిద్దాం

### 'భావోద్వేగ మత రాజకీయాలు' అనే అంశంపై ప్రముఖ సామాజిక విశ్లేషకురాలు దేవి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మోడీ చేస్తున్న భావోద్వేగ మత రాజకీయాలను ఓడిద్దామని, దేశ సమర్థత, ఆర్థిక విధానాలను నాశనం చేయడమే బిజెపి అజెండా అని సాంస్కృతిక, సామాజిక విశ్లేషకురాలు దేవి అన్నారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లోని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సులో భాగంగా మొదటి రోజు 'భావోద్వేగ మత రాజకీయాలు' అనే అంశంపై ప్రముఖ సామాజిక విశ్లేషకురాలు దేవి ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఈ సదస్సులో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాష్ట్ర సదస్సులో స్వాగత ఉపన్యాసం చేయగా, రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ సదస్సుకు అధ్యక్షత వహించారు.

**దేశ వనరులు దోచుకుంటున్న ఆదానీ, అంబానీలు..**
దేవి మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ, దేశ హోంమంత్రి అమిత్ షాలతో అంబాని, ఆదానీలు మేమిద్దరం, మాకు ఇద్దరు అంటూ దేశ వనరులను యథేచ్ఛగా దోచుకుంటున్నారని విమర్శించారు. ఈ దుర్మార్గపు చర్యలను దేశ ప్రజలు తిప్పికొట్టాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇవే ప్రచార అస్త్రాలుగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి, మతోన్మాద బిజెపిని ఓడించాలన్నారు. దేశ పరిపాలనను మోడీ అంబాని, ఆదానీల విధానాలనే అనుసరిస్తున్నాడని విమర్శించారు. 56 ఇంచుల ఛాతీతో దేశాన్ని రక్షిస్తున్నానని, అభివృద్ధి చేస్తున్నానని మోడీ ప్రగల్భాలు పలుకుతున్నారని, మోడీ నిజంగా దేశాన్ని అభివృద్ధి చేస్తే ఇప్పటికే దేశంలో అర్ధాకలితో ప్రజలు ఎందుకు అలమటిస్తున్నారో మోడీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హిందుత్వానికి యజమానులు బిజెపి, ఆర్ఎస్ఎస్ కాదని, దేశ ప్రజలే యజమానులన్నారు. మోడీ చర్యలన్ని పురుషాధిక్యతకు అద్దం పడుతాయని, అందుకే అయోధ్యలో కేవలం సీతాదేవి లేని రాముడు విగ్రహాన్ని మాత్రమే ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. భౌతిక వాదులైన కమ్యూనిస్టులు నిరంతరం ప్రజలకు అవసరమైన విధానాలపై పోరాటాలు చేస్తారని, అటువంటి భౌతిక వాదులపై దేశ వ్యాప్తంగా ఆర్ఎస్ఎస్ దాడులు చేయడాన్ని దేశ ప్రజాస్వామిక వాదులంతా ఎండగట్టాలని కోరారు.

**అవినీతి బాండ్లు ఎలక్టోరల్ బాండ్లు..**
ఎలక్టోరల్ బాండ్లు అవినీతి బాండ్లని, దందా వసూళ్ల బాండ్లని మండిపడ్డారు. మోడీ 10 సంవత్సరాల కాలంలో తన బ్రాండ్ ఇమేజ్ కోసం కొన్ని కోట్లకు పైగా ఖర్చు చేశారని, ఇవి దేశ ప్రజల ఆస్తి అన్నారు. అయోధ్యలో రామ మందిర అంశం ద్వారా మరో మారు గెలవాలనే మోడీ పన్నాగాలు, ఓట్లు వస్తాయనే ఆశలు కనుమరుగయ్యాయని దేవి తెలిపారు. అందుకే ఇప్పుడు దేశంలో ఉన్న ప్రజాస్వామిక వాదులపై ఇడి, సిబిఐ ద్వారా అరెస్టులు చేసి, గెలవాలనే నీచ రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన10 సంవత్సరాల కాలంలోనే హిందువులు ప్రమాదంలో పడ్డారన్నారు.

**ప్రశ్నించే గొంతుల అణచివేత..**
మోడీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా భౌతిక వాదులు, జర్నలిస్టులు, ప్రశ్నించే గొంతుకులపై అధికారంతో అణచివేస్తుందన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడే అన్నారు. దేశంలో అవినీతిని అంతం చేస్తానని చెబుతున్న మోడీ, ప్రస్తుతం మోడీ పాల్గొంటున్న అన్ని ప్రచార సభల్లో వేదికలపై పాల్గొంటున్న మెజారిటీ నేతలంతా అవినీతిపరులు కాదా అని ప్రశ్నించారు. మోడీ చేస్తున్న ఉదారవాద రాజకీయాల కారణంగా మనుషుల మధ్య దూరం ఏర్పడిందన్నారు. అదే విధంగా మోడీ గతాన్ని కీర్తించడం, భవిష్యత్‌ను గొప్పగా అభివర్ణిస్తున్నారని, మరి వర్తమానం గురించి ఎందుకు చెప్పడం లేదో దేశ ప్రజలు గుర్తించాలని దేవి కోరారు. కేవలం అబద్ధాలను ప్రచారం చేయడమే మోడీ భజన పరుల నినాదమని విమర్శించారు.

**దేశంలో 45 శాతం గ్రాడ్యుయేట్‌లు నిరుద్యోగులే..**
దేశవ్యాప్తంగా 45 శాతం గ్రాడ్యుయేట్‌లు నిరుద్యోగులుగా ఉన్నారన్నారు. అందుకే దేశంలో ప్రస్తుతం భావోద్వేగ పూరిత మత రాజకీయాలు నడుస్తున్నాయని, దీనిని పౌరులంతా తిప్పి కొట్టాలని మతతత్వ రాజకీయాలకు దేశంలో చోటులేదన్నారు. సర్వమత సమ్మేళనమే భారతదేశమన్నారు. ఈ సదస్సులో ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్, యుగంధర్, శ్రీమాన్, రాష్ట్ర సమితి సభ్యులు స్వప్న, లక్ష్మణ్, షేక్ మహమూద్, లక్ష్మణ్, ఎల్లంకి మహేష్, చిలకరాజు, శ్రీను, సూర్య, మానస్‌కుమార్, నాయిమ్, చిరంజీవి, రాజే ష్, మాజీద్, అనిల్, కళ్యాణ్, సుశాంత్, వెంకన్న, శోభ న్, రమేష్, సురేందర్, శేఖర్, రాధ, రవి కుమార్, కిషన్, ఆంజనేయులు ఉన్నారు.

## మతతత్వ బిజెపిని ఓడించేందుకు కమ్యూనిస్టులు సిద్ధం



### సిపిఐ, సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శుల పిలుపు

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** దేశంలో మతతత్వ బిజెపిని ఓడించేందుకు కమ్యూనిస్టు కార్యకర్తలు సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మిల్కూరి వాసుదేవరెడ్డిలు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలకు లేనిపోని హామీలు ఇస్తూ మూడోసారి అధికారం చేపట్టాలని బిజెపి యత్నిస్తోందని, దీన్ని అడ్డుకోవాలని కమ్యూనిస్టు కార్యకర్తలకు వారు కోరారు. గత పది సంవత్సరాలుగా ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగాన్ని పెంచి షోషించిందని, మతోన్మాదాన్ని మత రాజకీయ పరిపాల కొనసాగిస్తుందని తీవ్రంగా విమర్శించారు. మతతత్వాన్ని రెచ్చగొట్టి తోటి ఓట్లు వేయించుకోవాలని కుట్రకు బిజెపి పూనుకుందని వారు అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ దేశవ్యాప్తంగా ప్రైవేట్‌పరం చేసిన చరిత్ర బిజెపిదేనని ఎద్దేవా చేశారు. కరీంనగర్ ఎంపిగా గెలిచిన బండి సంజయ్ ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. కరీంనగర్‌లో ఒక చిన్న పరిశ్రమ తీసుకురాని అసమర్థుడు సంజయ్ అని అన్నారు. ఈ నెల 20న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో మతతత్వ బిజెపిని ఓడించాలని, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసేందుకు జిల్లా స్థాయి సదస్సును కరీంనగర్‌లో ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, గుడికందుల సత్యం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, పిట్టల సమ్మయ్య తదితరులున్నారు.

### మతోన్మాద కార్పొరేట్ విధానాలపై దేశవ్యాప్త వ్యతిరేకత



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** కార్పొరేట్ శక్తులతో జతికట్టిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని పార్లమెంటు ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలమని మతోన్మాద కార్పొరేట్ విధానాల వల్ల బిజెపి పట్ల దేశ వ్యాప్తంగా వ్యతిరేకత పెరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్, సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయం కెకె భవన్‌లో సోమవారం సిపిఐ ,సిపిఎం జిల్లా సదుస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు ,జలాలుద్దీన్‌లు మాట్లాడుతూ బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం ,రాజ్యాంగం లౌకికవాదం , సమాఖ్య వ్యవస్థలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మల్లేశం ,రాజయ్య, మానిక్, నర్సింలు ,యాదగిరి, అశోక్, కృష్ణ, రమేష్, మహేష్, సంతోష్, సురేష్ ,సిపిఐ నాయకులు రహమాన్ ,ఆనంద్ తాజుద్దీన్ మహబూబ్ ఖాన్, లక్ష్మి , రుబిన ,శంకరప్ప చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




## ఆదర్శ కమ్యూనిస్టు లింగమ్మ సేవలు చిరస్మరణీయం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఆదర్శ కమ్యూనిస్టుగా కప్పల లింగమ్మ సేవలు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన కప్పల లింగమ్మ సంతాపసభకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మహిళా ఉద్యమ నాయకురాలిగా లింగమ్మ నాడు సత్వరమే స్పందించి పోరాటాలు చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. భారత కమ్యూనిస్టు తరపున నాడు జరిగిన అనేక ప్రజా ఉద్యమాలకు లింగమ్మ పునాది లాంటి వారని వివరించారు. సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ప్రత్యక్షమై సమస్య పరిష్కారం కోసం కృషి చేసిన ఆమె నేటి తరానికి ఆదర్శవంతురాలని తన జీవితమంతా నిస్వార్థంగా ప్రజాసేవకు అంకితమై లింగమ్మ ఆశయ సాధన కోసం ప్రతి కమ్యూనిస్టు పునరంకితం కావాలని సాంబశివరావు పిలుపునిచ్చారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన లింగమ్మ చేసిన సమరశీల పోరాటాలను గుర్తు చేశారు. కామ్రేడ్ కప్పల లింగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, పల్లె నరసింహా, ఉస్తేల సృజన, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నెలికంటి సత్యం,అనంతుల మల్లేశ్వరీ,పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బొమ్మగాని శ్రీనివాస్, దంతాల రాంబాబు, చామల అశోక్, బిజెపి నాయకులు జుట్టుకొండ సత్యనారాయణ, బండారు ధనుంజయ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, శాంతిసంఘం రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు జి.రఘుపాల్‌రెడ్డి, నాగేశ్వరరావు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, పాత్రికేయులు దేగల జనార్ధన్, నిమ్మల ప్రభాకర్, బానోతు అమృనాయక్, రాజారాం, లింగమ్మ కుమారులు ప్రముఖ న్యాయవాది కెవిఎల్, ప్రముఖ జర్నలిస్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బోథ్ మాజీ ఎంఎల్ఎ బాపూరావు సహా పలువురు కాంగ్రెస్‌లో చేరికలు





**ప్రజాపక్షం/హైదరాబాద్:** బోథ్ మాజీ ఎంఎల్ఏ రాథోడ్ బాపూరావుతో పాటు పలువురు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాథోడ్ బాపూరావుతో పాటు నిర్మల్ మున్సిపల్ ఛైర్మన్ జి.ఈశ్వర్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్లు రాజ్ మహమ్మద్, రవీందర్ రెడ్డి హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి వారికి పార్టీ కండువను కప్పి కాంగ్రెస్‌లోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు. నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో అధిష్టాన పెద్దల సమక్షంలో చేరారు. మెదక్ ఎంఎల్ఏ రోహిత్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులలో ముందు వరుసలోని నాయకులు.. మెదక్ పట్టణ అధ్యక్షులు గంగాధర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, మాజీ కౌన్సిలర్ మధుసూదన్ రావు, కౌన్సిలర్లు వసంత రాజ్, సమీయోద్దీన్, నాయకులు దుర్గప్రసాద్ తదితరులు ఉన్నారు. అదే క్రమంలో మెదక్ మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు సమక్షంలో సోమవారం హైదరాబాదులో మున్సిపల్ కౌన్సిలర్లు గోదల మానస సాయిరాం, నర్మద యాదవ్, బొద్దుల రుక్మిణి కృష్ణ, లక్ష్మీనారాయణ గౌడ్, నాయకులు అంజాద్, కొరివి రాములు, నిఖిల్, శ్రీధర్ యాదవ్ ఉన్నారు. అదేవిధంగా మెదక్ మున్సిపల్ చైర్మన్ తొడుపూనూరి చంద్రపాల్ , స్థానిక కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

## కంకణాల వసుమతి ద్వితీయ వర్ధంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యురాలు, సి.ఆర్. ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ సతీమణి కంకణాల వసుమతి ద్వితీయ వర్ధంతి సి.ఆర్. ఫౌండేషన్ మహిళా సంక్షేమ కేంద్రంలో సోమవారం జరిగింది. దివంగత వసుమతి దేవి చిత్రపటానికి సి.ఆర్. ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవ రావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె. రజిని పుష్పమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మహిళా సంక్షేమ కేంద్రం డైరెక్టర్ డి. కృష్ణకుమారి ఈ సభకు అధ్యక్షత వహించగా, కమిటీ సభ్యులు జోస్యభట్ల కల్పన, ప్రేమ్ పావని, మమత ప్రసంగించారు. వసుమతి బ్యాంకు ఉద్యోగినిగా పదవీవిరమణ చేసిన అనంతరం సామాజిక సేవ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొంటూ నారాయణ చేస్తున్న ప్రజాసేవకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. తాను తుదిశ్వాస వరకు తన జీవితాన్ని సామాజ సేవకు అంకితం చేశారని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్. ఫౌండేషన్ వృద్ధాశ్రమ వాసులు, నీలం రాజజేశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం సభ్యులు జ్యోస్న తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ పెరిగిన ఎండలు

### ఎండలు రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం

### 19, 20 తేదీలలో జిల్లాల్లో కురిసే అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎండలు మండుతున్నాయి. మొన్నటి వరకు వాతావరణం కాస్త చల్లబడడంతో జనం ఊరటనిచ్చినట్లయ్యింది. ఆదివారం నుంచి ఎండలు మళ్లీ పెరిగాయి. ఈ క్రమంలోనే వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు చేశారు. రాగల నాలుగు రోజుల్లో ఎండలు రెండు నుంచి మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందన్నారు. పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపారు. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. ఈ నెల 17 నుంచి 18 వరకు పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్ కర్నూల్, మహబూబాబాద్ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 19 నుంచి 20 మధ్య రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పారు.

## జ్యుడీషియల్ కస్టడీ

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టులో విచారణ సందర్భంగా ఆరోపించింది. పరస్పరం ప్రయోజనాలు పొందేవిధంగా (క్విడ్ ప్రో) ఈ మద్యం విధానం రూపొందించారని దర్యాప్తుసంస్థ ఆరోపించింది. గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థులు పోటీ చేశారని, ఈ ఎన్నికల ప్రచారం కోసం ముడుపుల నిధులు ఉపయోగించారనీ ఇడి ఆరోపించింది.

**అరెస్టుపై సంజాయిషీ ఇవ్వండి : ఇడికి సుప్రీం నోటీసు**
కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులకు సుప్రీంకోర్టు సోమవారంనాడు నోటీసు జారీ చేసింది. ఈనెల 24వ తేదీ నాటికి ఈ విషయంపై తగిన సమాధానం చెప్పాలని కోరింది. ఈనెల నాలుగోవారంలో ఈ కేసును తిరిగి విచారణకు చేపడతామని కూడా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కేజ్రీవాల్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి ధర్మాసనం ఎదుట వాదనలకు హాజరయ్యారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న తనను అరెస్టు చేయాల్సిన అవసరం లేదనీ, ఉద్దేశపూర్వకంగా, చట్టవిరుద్ధంగా అరెస్టు చేసి సమస్యలు సృష్టించారని పేర్కొంటూ కేజ్రీవాల్ ఢిల్లీకోర్టులో తొలుత కేసు దాఖలు చేశారు. దీనిపై ఈనెల 9వ తేదీన ఢిల్లీ కోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యను సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కేజ్రీవాల్ ఢిల్లీ కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ధర్మాసనం ఇడి స్పందన కోరుతూ నోటీసు ఇచ్చింది. సమాధానం చెప్పడానికి ఇడికి తొమ్మిది రోజులు గడువు ఇచ్చింది. సర్వోన్నత న్యాయస్థానానికి దిగ్భ్రాంతి కలిగించే, వాస్తవాలు అర్థమయ్యే కొన్ని నిజాలు తాను ధర్మాసనం దృష్టికి తీసుకురాదలిచానని అభిషేక్ సింఘ్వి వాదనల సందర్భంగా చెప్పారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి ఐనందువల్ల ఇది చాలా అసాధారణ విషయంగా లేదని, కానీ ఆయనను అరెస్టు చేసిన సమయమే అతి ముఖ్యమైనదని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న సమయంలో కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేశారని, ఈ కీలక సమయంలో ఏ ప్రయోజనాలకోసం అరెస్టు చేశారని ప్రశ్నించారు. 2022లో ఈ కేసు మొదలైందనీ, ఇప్పటివరకూ 15 మంది వాంగ్మూలాలను రికార్డు చేసినాగానీ ఎక్కడా కేజ్రీవాల్ పేరు రాలేదని గుర్తుచేశారు.

## పారదర్శకంగా ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణా ప్రభుత్వం పోలీస్ శాఖ ద్వారా 36 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, ఆటవీ శాఖకు సంబంధించి మూడు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, ఎక్సయిజ్ శాఖ ద్వారా ఎనిమిది, 224 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, వాణిజ్యపన్నుల ద్వారా 7 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి, 24 గంటల పాటు పటిష్టమైన గస్తీని నిర్వహిస్తున్నామని శాంతికుమారి తెలిపారు. తెలంగాణ లో తీవ్రవాద ప్రాబల్యం లేదని, చత్తీస్‌గఢ్ నుండి మావోయిస్టుల కార్యకలాపాలు జరుగకుండా ఇరు రాష్ట్రాల పోలీసులు, కేంద్ర పోలీస్ బలగాల మధ్య పటిష్టమైన సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఆంధ్ర ప్రదేశం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్. జవహర్ రెడ్డి మాట్లాడుతూ, ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ, లోక్‌సభ స్థానాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నందున, ఈ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వంతో పూర్తిస్థాయి సమన్వయంతో కృషి చేస్తున్నామని అన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు మంచి సమన్వయంతో పనిచేస్తున్నాయని జవహర్ రెడ్డి తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com

## ఎఐటియుసిలో చేరిన క్యాబ్ డ్రైవర్లు




**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి** : కష్టజీవుల తరుపున పోరాడే కార్మిక సంఘం ఎఐటియుసి అని క్యాబ్ డ్రైవర్లు , క్యాబ్ ఓనర్లు ఎఐటియుసిలో చెరడం శుభ పరిణామం అని ఎఐటియుసి జిల్లా అధ్యక్షు డు పానుగంటి పర్వతాలు తెలిపారు. సోమవారం గచ్చిబౌలి సర్కిల్ లో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి చందు యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి నుండి శంషాబాద్ విమా నాశ్రయం వరకు నడిపే క్యాబ్ డ్రైవర్లు ఓనర్లు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి చందు యాదవ్, , కాసిం, డ్రైవర్లు జైపాల్ ర్డై, రాజు, గోవింద్, బాబు, మన్నన్, వినోద్ పాల్గొన్నారు.

## కెసిఆర్ పనులు ఫామ్‌హౌస్ కుడా దాటలే

**ప్రజాపక్షం/హైదరాబాద్:**మాజీ సిఎం కెసిఆర్ మాటలు కోటలు దాటేవని, కానీ ఆయన పనులు ఫామ్ హౌస్ కూడా దాటేవికాదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి విమర్శించారు.బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నపుడు రాష్ట్రంలో అనేక రకాలుగా రైతులకు అన్యాయం చేసిందన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కిషన్ రెడ్డి సోమవారం 'రైతు దీక్ష'ను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు రుణమాఫీ చేస్తామని, ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాల సాగు చేస్తామని చెప్పిన బిఆర్‌ఎస్, అందుకు భిన్నంగా రైతు వ్యతిరేక విధానాలతో రైతులను ఇబ్బందిపెట్టారని,అందుకే రైతులను అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజలకు, రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే పరిస్థితిలో లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ఎటువంటి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారో రేవంత్ రెడ్డి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

## ముదిరాజ్‌ల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

### షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ముదిరాజ్‌ల శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని షాద్‌నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఓ కార్యాలయం ముందు ఉన్న పండుగ సాయన్న విగ్రహానికి నివాళ్ళు అర్పించడంతోపాటు నారాయణ పేటలో నిర్వహించిన జన జాతన బహిరంగ సభలో 120వాహనాల్లో ముదిరాజ్‌లు తరలి వెళ్ళాలరు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మొట్ట మొదటి సారిగా 16కులాల కార్పోరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందరెడ్డి, జడ్పిటిసి వెంకట్‌రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్య క్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నేతలు అంచె రాములు, నల్ల మోని శ్రీధర్‌పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు

### సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ తగు జాగ్రత్తలు పాటించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ (సిపి) అవినాష్ మహంతి అన్నారు. సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలలో (ఏప్రిల్ 14, 20) భాగంగా తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా అగ్నిమాపక సేవల శాఖ అధికారులు సైబరాబాద్ సిపి కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాల కరపత్రాలను, గోడప్రతులను సిపి అవినాష్ మహంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపి అవినాష్ మహంతి మాట్లాడుతూ.. "ఎన్సూర్ ఫైర్ సేఫ్టీ కాంట్రిబ్యూట్ టవర్డ్స్ నేషన్ బిల్డింగ్ / అగ్ని భద్రతను నిర్ధారించండి దేశాభివృద్ధికి సహకరించండి" అనే థీమ్ తో ఈ ఏడాది అగ్నిమాపక వారోత్సవాలు జరుపుతున్నార న్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ కె. విజయ్ కుమార్,మాదాపూర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ టి. జగన్మోహన్,మాదాపూర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎ ఫజల్,సిబ్బంది పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కరిస్తా

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్(బిజెఎంసి)పరిధిలో ఎక్కడ నీటి సమస్య తలేత్తిన వెంటనే తన సొంత నిధుల చేత మంచి నీటి సరాఫరా చేస్తానని డిప్యూటీ మేయర్ పూల పల్లి రాజేందర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజెఎంసి పరిధిలో వేసవి కాలంలో ప్రజలు మంచి నీటికి ఇబ్బందులు పడుతున్న కారణంగా డిప్యూటీ మేయర్ వెంటనే హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సేవరేజ్ బోర్డు డివిజన్ నెంబర్ 18 జనరల్ మేనేజర్ రవీందర్ రెడ్డిని ఫోన్‌లో సంప్రదించి నీటి సమస్యపై చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎక్కడైతే మంచి నీటి సమస్య ఉందో ఆప్రాంతంలో నీటి సమస్య పరిష్కరంకై 2000లీటర్ల సింటెక్స్ ట్యాంకుల ద్వారా నీటిని అందిస్తామని జియం తెలియజేశారని ఆయన పేర్కొన్నారు. అదనపు నీటిని కేటాయించిన జియం రవీందర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## క్రీడలతోనే శారీరక దారుఢ్యం



**ప్రజాపక్షం/కొత్తూరు:** క్రీడలతోనే శారీరక దారుఢ్యంతోపాటు మానసిక దైర్యానికి దోహదపడుతాయని కొత్తూరు జడ్పిటిసి సభ్యురాలు ఎమ్మె శ్రీలత సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎస్‌బిపల్లి గ్రామంలో శ్రీకాంత్ స్మారకార్థం ప్రీమియర్ లీగ్6 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి సభ్యురాలు ఎమ్మె శ్రీలత సత్యనారాయణ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావిస్తూ ముందుకు సాగితేనే విజయం వెన్నంటే ఉంటుందని అన్నారు. టోర్నమెంట్‌కు అవసరమైన క్రికెట్ కిట్లను క్రీడాకారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మాజీ సర్పంచ్ సత్తయ్య, బిఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు కడాల శ్రీశైలం పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**ప్రజాపక్షం/ తుర్కయంజాల్:** ప్రజా గొంతుకనై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి మన్నెగూడ సార్థ కన్వెన్షన్ హాల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి రోహిత్ చౌదరి, కాంగ్రెస్ పార్లమెంట్ ఇంచార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లు మాట్లాడుతూ కార్యకర్తలకు ఎన్నికల దిశనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్ రెడ్డి రాంరెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, లక్ష్మిపతి గౌడ్, రామ్మోహన్ గౌడ్ పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు రానివ్వను...

**ప్రజాపక్షం/షాబాద్** : విద్యుత్ సమస్యలు రాకుండ కృషి చేస్తామని షాబాద్ మండల విద్యుత్ శాఖ అధికారి నరేందర్ నాయక్ అన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని బొడంపహడ్ గ్రామంలో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్లను తొలగించి విద్యుత్ వైర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. షాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో విద్యుత్ సమస్య రాకుండ తగిర జాగ్రత్తలు తీసుకుంటునామని వివరించారు. రైతుల పంట పొలాలోని విద్యుత్ వైర్ల దగ్గర చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగిలితే వెంటనే మాకు సమాచారం ఇవ్వాలని సుచించారు. విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగలడంతో షాట్‌సర్క్యూట్ తగిలి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రైతులు దయచేసి సహాకరించాలని చెప్పారు.

# 'ఎర్లీబర్డ్'తో ఆస్తిపన్నులో 5శాతం రాయితీ




### పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : రోనాల్డ్ రోస్

### ఈనెల 30 వరకు అవకాశం

**ప్రజాపక్షం/హైదరాబాద్** : గ్రేటర్ హైదరాబాద్ ప్రజలు ఎర్లీబర్డ్ (ముందస్తు పన్ను చెల్లింపు)పథకాన్ని వినియోగించుకోవాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ నగర ప్రజలకు సూచించారు. ఈ నెల 30వ తేదీలోపు ఆస్తి పన్ను చెల్లించి, ఆస్తిపన్నులో 5 శాతం రాయితీ పొందాలని కోరారు. 2024/25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను చెల్లింపునకు సంబంధించి ఎర్లీబర్డ్ పథకాన్ని అమలు చేస్తున్నామని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. ఎర్లీబర్డ్ పథకంలో ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్నును ఈనెల 30వ తేదీ లోపు చెల్లిస్తే పన్ను మొత్తంలో ఐదు శాతం రాయితీ పొందవచ్చన్నారు. ఎర్లీబర్డ్ పథకంతో ఇప్పటివరకు రూ. 230 కోట్ల ఆస్తిపన్నును నగర వాసులు చెల్లించారని చెప్పారు. ఆస్తి పన్నును ఆన్‌లైన్, సిటీజన్ సర్వీస్ సెంటర్లు, ఈసేవా కేంద్రాల ద్వారా చెల్లించవచ్చునని తెలిపారు. నివాస గృహాలతో పాటు వాణిజ్య, వ్యాపార సంస్థలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, నిర్ణీత సమయంలోపు ఆస్తి పన్ను చెల్లించాలని కోరారు.

**భవన నిర్మాణ వ్యర్థాల తరలింపునకు అందుబాటులోకి పెయిడ్ సర్వీస్**

హైదరాబాద్ నగరంలో నిర్మాణ వ్యర్థాలను (సి అండ్ డి) డోర్‌స్టెప్ నుండే తొలగించే సేవలను (పెయిడ్ సర్వీస్) అందిస్తున్నట్లు జిహెచ్‌ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ వెల్లడించారు. హైదరాబాద్ నగర పౌరులు తమ భవన నిర్మాణం, పునరుద్ధరణ, మరమ్మత్తుల ద్వారా ఉత్పన్నమయ్యే నిర్మాణ వ్యర్థాలను డోర్ స్టెప్ నుండి తీసుకొని వెళ్లేందుకు నగదు చెల్లింపు సేవలను జిహెచ్‌ఎంసి ఆమోదించిన ఏజెన్సీల ద్వారా ఈ క్రింది సదుపాయాల ద్వారా పొందవచ్చు అన్నారు. నగర పౌరులు, సి అండ్ డి వ్యర్థాలను తమ ప్రాంగణంలోని గేట్‌కు సమీపంలో నిల్వ చేసి, జిహెచ్‌ఎంసి అందుబాటులోకి తెచ్చిన వివిధ కమ్యూనికేషన్ మోడ్‌లలో ఏదైనా ఒకదాని ద్వారా వాటిని ఎత్తివేయడానికి అభ్యర్థనను పంపించాలని సూచించారు. సంబంధిత నగదును జిహెచ్‌ఎంసి జిహెచ్ ఎంసి సి అండ్ వేస్ట్ డి మేనేజ్‌మెంట్ ఏజెన్సీకి చెల్లింపు చేయాలన్నారు. వారు వెంటనే అవసరమైన వాహనాలను సమకూర్చి వ్యర్థాలు తీసుకెళ్లుతారని తెలిపారు. సి అండ్ డి వ్యర్థాలతో ఇతర వ్యర్థాలను కలప వద్దని నగర పౌరులను కోరారు. తద్వారా వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి, నీటి వనరులను రక్షించడానికి, వరదలను నివారించడానికి, భవిష్యత్ తరాలకు సహజ వనరులను అందించేలా సుస్థిరమైన స్వచ్ఛ హైదరాబాద్ కోసం నిర్మాణ కూల్చివేత వ్యర్థాల నిర్వహణ సజావుగా జరిగేలా ప్రజలు జిహెచ్‌ఎంసి ఆమోదిత సి అండ్ డి వేస్ట్ మేనేజ్మెంట్ ఏజెన్సీల సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ కోరారు.

**సంప్రదించాల్సిన వివరాలు..**

**జిహెచ్‌ఎంసి వెబ్ సైట్ :** www.ghmc.gov.in

మై జిహెచ్‌ఎంసి యాప్

2ఉప్పల్, 3 హయత్ నగర్, 4ఎల్.బి.నగర్, 5 సరూర్ నగర్, 6 మలక్‌పేట్, 7సంతోష్ నగర్, 16అంబర్‌పేట్, 19యూసుఫ్‌గూడ, 20 శేరిలింగంపల్లి, 21చందానగర్, 22 ఆర్.సి.పురం, పఠాన్ చెరు, 23మూసాపేట్, 24కూకట్‌పల్లి, 25 కుత్బుల్లాపూర్, 26గాజులరామారం సర్కిళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్ 18001201159, వాట్సాప్ నెంబర్ 9100927073.

8చంద్రాయణ గుట్ట, 9చార్మినార్ 10ఫలక్ నూమ, 11 రాజేంద్రనగర్, 12మెహదీపట్నం, 13కార్వాన్, 14గోషామహల్, 18జూబ్లీహిల్స్, 1 కాప్రా, 15ముషీరాబాద్, 17 ఖైరతాబాద్, 27 అల్వాల్, 28మల్కాజిగిరి, 29సికింద్రాబాద్, 30 బేగంపేట్ సర్కిళ్లకు సంబంధించి టోల్ ఫ్రీ నెంబర్లు 18002030033, వాట్సాప్ నంబర్ 7330000203 సంప్రదించాలని సూచించారు.

## అదనపు పనిభారం నుంచి విముక్తి కల్పించండి

### జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు మొరపెట్టుకున్న ఉద్యోగ సంఘం నేతలు




**ప్రజాపక్షం/హైదరాబాద్** : గ్రేటర్ పరిధిలో రాంకీ సంస్థ చేయాల్సిన పారిశుద్ధ్య పనులను ఆయా సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు, మెడికల్ ఆఫీసర్లు, డిఈలు బలవంతంగా జిహెచ్‌ఎంసి కార్మికులు, ఉద్యోగులతో చేయిస్తున్నారని భాగ్యనగర్ మున్సిపల్ జిహెచ్‌ఎంసి ఎంప్లాయీస్ యూనియన్ విమర్శించింది. పారిశుద్ధ్య పనుల్లో భాగంగా చెత్త సేకరణ, డంపింగ్ యార్డుకు తరలింపు విధులు నిర్వహించాల్సిన రాంకీకి నెలకు కోట్ల రూపాయలు బిల్లులు చెల్లిస్తూనే, ఆ పనులను జిహెచ్‌ఎంసి ఉద్యోగులు, కార్మికులతో బలవంతంగా చేయిస్తున్నారని యూనియన్ ప్రతినిధులు సోమవారం కమిషనర్ రోనాల్డ్ రోస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. యూనియన్ అధ్యక్షుడు జి. రాజేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి టి. కృష్ణతో కూడిన నాయకుల బృందం నాలుగు అంశాలకు సంబంధించిన వినతులను సమర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర రావు, కృష్ణ మాట్లాడుతూ ఇటీవలే ఎన్నికల విధులు చేస్తూ ఫిట్స్ వచ్చి ప్రధాన కార్యాలయంలో మృతి చెందిన పెండ్యాల కృష్ణ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారాన్ని చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు జిహెచ్‌ఎంసినే నమ్ముకుని ఏళ్ల తరబడి నుంచి పని చేస్తున్న ఔట్ సోర్స్ కార్మికులు, ఉద్యోగుల సర్వీసులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, అంత వరకు వారికి సమాన పనికి సమానవేతనాలు చెల్లించాలని కోరారు. గతంలో స్వచ్ఛ టాయిలెట్‌ల నిర్వహణ పర్యవేక్షణ కోసం నియమించిన 25 మంది ఈఎస్‌లు ప్రస్తుతం అనేక రకాల అక్రమాలకు పాల్పడుతున్నారని, వారిని వెంటనే విధుల్లో నుంచి తొలగించాలని కోరారు. ఇప్పటికే ఒక వైపు సాధారణ విధులు, మరో వైపు ఎన్నికల విధులు చేస్తూ అలసిపోతున్న జిహెచ్‌ఎంసి రెగ్యులర్ ఉద్యోగులకు సి అండ్ డి విధులు కూడా చేయాలని వత్తిడి చేస్తున్నారని యూనియన్ నేతలు కమిషనర్ దృష్టికి తీసుకపోయినట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదారు గంటల వరకు సాధారణ విధులు నిర్వహించిన తరువాత తిరిగి రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుఝాము ఐదు గంటల వరకు ఎక్కడా కూడా భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేయకుండా పర్యవేక్షించే పనులను అదనంగా చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని మినహాయించాలని కమిషనర్ కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సికిందరాబాద్ జోన్ యూనియన్ అధ్యక్షులు కె. రాజు, ఎల్.బి.నగర్ జోన్ అధ్యక్షులు ఎం. యాదగిరి, యూనియన్ కార్యదర్శి రూపేశ్, ధన్ రాజ్, ఉపాధ్యక్షులు భిక్షపతి, ఖైరతాబాద్ జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకటేశ్, నాయకులు నాగమణి, రసూల్ పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** గ్రామపంచాయతీ కార్మికుల ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ పంచయతీ కార్మికుల తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరు నరసింహా రెడ్డి డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వివరిస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ)సురేష్ మోహన్ కు సోమవారం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల ఉద్దేశించి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు టంగుటూరు నరసింహారెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై గత ప్రభుత్వానికి అనేకమార్లు వినతిపత్రం అందజేయడం జరిగిందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ షరిన్, కార్యనిర్వహక అధ్యక్షులు రంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, మాడుగుల మండల గౌరవాధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్,కొత్తూర్ మండల అధ్యక్షులు భిక్షపతి పాల్గొన్నారు.

## సిఆర్‌ఎంపి కాంట్రాక్టర్ పారిశుద్ధ్య పనులపైన దృష్టి పెట్టాలి



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్** : జిహెచ్‌ఎంసి రాజేంద్ర నగర్ సర్కిల్ 11 పరిధిలోని ప్రధాన రోడ్ల పారిశుద్ధ్య , మెయింటెనెన్స్ పనులను కాంప్రెహెన్సివ్ రోడ్డు మెయింటనెన్స్ ప్రొగ్రాం(సిఆర్‌ఎంపి) కాంట్రాక్టర్‌పై దృష్టి పెట్టాలని తెలంగాణ రాష్ట్ర మున్సిఫల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియాన్(ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం ఆయన రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కరం కోసం పలు ప్రాంతాల్లో సందర్శించి వారి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్ర నగర్ సర్కిల్ పరిధిలోని ఫిల్లర్ నెంబర్ 117 నుంచి ఆరంఘర్ చౌరస్తా, మైలార్‌దేవ్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్ వరకు,దుర్గ నగర్ చౌరస్తా నుంచి ఓల్డ్ కర్నూల్ రోడ్డు గగన్ పహాడ్ వరకు పారిశుద్ధ్యపు పనులను సీఆర్‌ఎంపి కాంట్రాక్టర్ చేయాలన్నారు. కాని అధికారులు పారిశుద్ధ్య పనులను రాజేంద్ర నగర్ సర్కిల్ యందు పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల చేత పనులు చేయిస్తున్నట్లు ఆయన తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైన కోట్లాది రూ.లు కాంట్రాక్టర్‌కు కేటాయించి అధికారులు చేతులు దులుపుకున్నాని తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి సిఆర్‌ఎంపి కాంట్రాక్టర్‌పైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## తాగునీటి సరఫరాకు పకడ్బందీ చర్యలు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలుచేపట్టాలని, ఎక్కడైనా సమస్య ఏర్పడితే సత్వరమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె. శశాంక అధికారులను ఆదేశించారు. సోమవారం రాజేందర్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం డివిజన్ లోని మంచాల, యాచారం మండలాలో వేసవిలో తాగునీటి సరఫరాకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత ఆర్.డబ్ల్యూఎస్ అధికారులు, మంచాల, యాచారం మండల ఎంపిడిఒ లు, ఎ.ఇ లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ వేసవి కాలం ముగిసి,వర్షాలు వచ్చే వరకు తాగునీటి సరఫరాను అనునిత్యం నిశితంగా పర్యవేక్షించాలని, క్షేత్ర స్థాయిలో తాగునీటి సరఫరాలో వచ్చే ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, అర్.డబ్ల్యూఎస్ ఇఇ రాజేశ్వర్ రావు,మంచాల,యాచారం ఎంపిడిఒలు బాలా శంకర్ పాల్గొన్నారు.

**పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ :** నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, నామినేషన్ల ప్రక్రియను సి సి కెమెరాల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె.శశాంక అన్నారు. చేవెళ్ళ పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాజేందర్ నగర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఈ నెల 18వ తేదీ నుంచి చేపట్టే నామినేషన్ల ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ శశాంక ఎ ఆర్ఒ,ఎఇఆర్ఓలకు సూచించారు.సోమవారం రాజేందర్ నగర్ ఆర్ఓ కార్యాలయంలో ఎ ఆర్ఒ,ఎఇఆర్ఓ లతో సమావేశం నిర్వహించారు.

## సిపిఐలో చేరిన బిఆర్‌ఎస్ కార్యకర్తలు



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** భారత కమ్యూనిస్టు పార్టీలో బిఆర్‌ఎస్ కార్యకర్తలు చేశారు. సోమవారం జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామంలో బిఆర్‌ఎస్ కార్యకర్తలు సిపిఐ గ్రామ కార్యదర్శి ఎం.కృష్ణ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)లో చేరారు. వారందనికి సిపిఐ కండువాలు వేసి పార్టీలోకి సిపిఐ మండల కార్యదర్శి జిల్లేల వెంకటేష్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై సిపిఐ నిరంత పోరాటాలు చేస్తుందని, ప్రజా ఉద్యమాలకు ఆకర్షితులై సిపిఐ పార్టీలో చేరారని తెలిపారు. 1925లో ఆవిర్భవించిన సిపిఐ 100ఏళ్ళు పూర్తి చేసుకున్నప్పటికి ఎన్నో ఒడిదోడుకులు ఎదుర్కొంటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుందని వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేందుకు సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ నుండి సిపిఐలో కలిసిన వారిలో ప్రవీణ్, చింటూ, మధు, ప్రవీణ్, నర్సింలు, ఎం.శ్రీను, ఎం.జంగయ్య, రాములమ్మ, సుమలత, సత్తమ్మ, మౌనిక, లావణ్య, అనిత, సంగీత, లక్ష్మ మ్మలు ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి అండగా బిఎన్‌రెడ్డి ట్రస్ట్



**ప్రజాపక్షం/యాచారం** : మండల పరిధిలోని నందివనపర్తి గ్రామాలనిక చెందిన హలిమా ఇటివల అనారోగ్యంతో మృతి చెందింది. అమే కుటుంభానికి అండగా బిఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మేన్ బిలకంటి శేఖర్‌రెడ్డి అండగా నిలిచారు. మృతురాలి కుటుంభానికి 10 వేల రూపాయల అర్థిక సహాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు జొగిరెడ్డి,మాజీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణమ్మ నీళ్ళతో రైతులకాళ్ళు కడుగుతా

### పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఏడాదిలోనే కృష్ణమ్మ నీళ్ళు తీసుకువచ్చి షాద్‌నగర్ అన్నదాతల కాళ్ళు అడుగుతామని పాలమూరు పార్లమెంట్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని ఈడెన్ ప్లాజాలో ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్ సహాకారంతో ఫరూఖ్‌నగర్, షాద్‌నగర్ పట్టణ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్యల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి కెసిఆర్ కృష్ణానది నీళ్ళు తీసుకువచ్చి ప్రతి ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామని చెప్పిన తీరా మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కసారి ప్రజలకు హామీ ఇచ్చిందంటే ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంతోపాటు ప్రతి ఎకరాకు సాగునీరు, తాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన 100రోజుల్లోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 32వేల ఉగ్యోగాలు ఇచ్చారని గుర్తు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎంఎల్‌ఎ వీర్లపల్లి శంకర్‌తో కలిసి పని చేయనున్నట్లు తెలిపారు. వెనుకబడిన పాలమూరు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఏమి ఇచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యుడు పి.వెంకట్‌రాంరెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ చైర్మేన్ విశ్వం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, కాంగ్రెస్ నేతలు వై.యాదయ్య యాదవ్, బాబర్‌ఖాన్, మహ్మద్ ఇబ్రహీం, రఘు, చెంది తిరుపతిరెడ్డి, కందివనం సూర్యప్రకాష్, జమృద్‌ఖాన్, దర్శన్, అశోక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

### జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

జర్నలిస్టుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి వివరించారు. సోమవారం షాద్‌నగర్‌లో మీడియా ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకే ప్రెస్ ఆకాడమీ చైర్మన్‌ను నియమించడం జరిగిందని గుర్తు చేశారు. చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి సారథ్యంలో ఏ సమస్య ఉన్నా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సిద్ధం గా ఉన్నట్లు ఇప్పటికే ప్రకటించారని తెలిపారు.

# తాగునీటి సమస్య రానివ్వొద్దు

## జిల్లా కలెక్టర్ జి.రవినాయక్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** వేసవిలో త్రాగునీటి సరఫరాపై గ్రామాలు, పట్టణాల్లో నిరంతరం పర్యవేక్షించి త్రాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రవినాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని కలెక్టర్ కార్యాలయం నుండి వెబెక్స్ ద్వారా మండల, ప్రత్యేక అధికారులు, ఎంపిడిఓలు, మిషన్ భగీరథ, ఎఈలు, డిఈలు, ఎంపిఓలతో జిల్లా కలెక్టర్ త్రాగు నీటి సరఫరాపై మండలాలు, పట్టణాలు వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌డిఎఫ్ ద్వారా మంజూరు చేసిన త్రాగునీటి సంబంధిత బోర్‌వెల్‌లు, మోటార్‌లు, పైప్‌లైన్ పనులు ప్రగతిలో ఉన్నవి. వారం రోజుల్లోగా వెంటనే పూర్తి చేయాలని అన్నారు.

జిల్లాలో 186 పనులు మంజూరు చేసినట్లు, పనులన్నీ ప్రగతిలో నున్నట్లు, వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. బోర్ వెల్ ఏర్పాటు చేసిన చోట మోటార్ 24 గంటల్లో బిగించాలని అన్నారు. ఏఈలు, డిఈ లు, నీటికి సమస్య పను లు, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, పనులు ఉన్నచోట, భూగర్భజలాల నివేదిక ప్రకారంగా బోర్లను ఫ్లషింగ్ డిపెనింగ్ చేయాలని, గేట్ వాల్స్ మోటార్లను చేతి పంపులు, మరమ్మతులు చేయాలని, పైపులైన్ల లీకేజీలు సరిచేయాలని ఆదేశించారు. అధికారులు త్రాగునీటిపై సమన్వయం చేసుకుని పనిచేయాలన్నారు. మిషన్ భగీరథ ద్వారా డిమాండు, సరఫరాలో పట్టణాలు, గ్రామాల్లో నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలన్నారు. నల్లాల నుండి వచ్చే నీటిని వృధా కాకుండా, చర్యలు చేపట్టాలన్నారు. త్రాగునీటి ట్యాంకులు బ్లీచింగు పౌడర్ ద్వారా క్లోరినేషన్ చేయాలని, త్రాగునీటి సరఫరాపై గ్రామాల్లో నిర్వహించే రిజిస్టర్‌లలో నమోదు చేయాలని సూచించారు. వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా వాటరింగ్ చేయాలని ఆదేశించారు.

జంతువులకు త్రాగునీటిని అందించాలి. ప్రతి రోజు పల్లె ప్రకృతి, వనాలకు, అవె న్యూ, బ్లాక్ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు ఎండిపోకుండా, నీటిని అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్, ఎస్.మోహన్ రావు, డిపిఓ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఓ నర్సింహులు, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు హాజరయ్యారు.

**ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తు పనులు నాణ్యతతో చేయాలి**

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలి క వసతులు కల్పన, మరమ్మత్తు పనులు నాణ్యతతో పనులు, పూర్తి చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనంలోని కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీ రాజ్, హౌసింగ్, ఎం.ఇ.ఓ.లు, ఇంజనీరిం గ్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు .

ప్రభుత్వ పాఠశాలలో వివిధ పనులు, త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల మైనర్, మేజర్ మరమ్మతులు, నిరూపయోగకంగా ఉన్న టాయిలెట్లను ఉపయోగంలోకి తీసుకురావడానికి, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణం, తరగ తి గదికి తలుపులు, విద్యుత్ సౌకర్యం, ఇతర మరమ్మత్తులు, మౌలిక వసతుల కొరకు పనులు గ్రౌండింగ్ జూన్ 10 లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఆర్‌డిఓ నర్సిములు, జిల్లా విద్యా శాఖ అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నా రు.



## ఓటింగ్‌లో యువత పాల్గొనాలి

### జిల్లా స్వీప్ నోడల్ అధికారి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః** మహబూబ్‌నగర్ నగరంలోని ఎన్‌టిఆర్ డిగ్రీ కళాశాలలో స్వీప్ సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ కార్యక్రమాల్లో భాగంగా, అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని సింపోజియం కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఓటరు చైతన్యంకోసం విద్యార్థులు , నూతన ఓటర్లు కృషి చేయాలని జిల్లా స్వీప్ కార్యక్రమాల నోడల్ అధికారి డా.శ్రీధర్ సుమన్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి మాట్లాడుతూ ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు రూపొందించిందని, 18 సం.దాటిన ప్రతి వారందరూ కొత్త ఓటరుగా నమోదు కోసం కృషి చేయాలని అన్నారు. ఎన్నికల పర్వం, దేశానికి గర్వం అనే నినాదంతో విద్యార్థులు, వాలంటీర్లు ఎన్నికల కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని అన్నారు. ఓటు వజ్రాయుధమని, ఓటును ఆయుధంగా వాడుకునే ప్రజలే ప్రభువులని సందేశమిచ్చిన బిఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకిచ్చిన ప్రజాస్వామిక హక్కులను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, లైబ్రేరియన్ ఆంజనేయులు, అధ్యాపకురాలు పుష్పలత, సిబ్బంది పర్యవేక్షక బృందం పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన మాజీ సర్పంచ్

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ స్థానిక ఎంఎల్‌ఎ కసిరెడ్డినారాయణరెడ్డితో కలిసి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రిని కలిసినవారిలో మాజీసర్పంచ్ భూపతిరెడ్డి, కాంగ్రెస్‌నాయకులు సంజీవ్ యాదవ్ ఉన్నారు.



## రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి సామాజిక ఉద్యమాలు

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రస్తుత పరిస్థితుల్లో బిజెపిద్వారా భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని దానిని కాపాడుకోవడంకోసం సామాజిక ఉద్యమాలను ఉధృతంచేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని దళితహక్కుల పోరాటసమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ముభరత్ అన్నారు. సోమవారం తాడూరు మండలం అంతారం గ్రామంలో డాక్టర్‌బి ఆర్ అంబేద్కర్ 133వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయనచిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొమ్ముభరత్ మాట్లాడుతూ అణగారినవర్గాల్లోపుట్టి వెలివాడల బతుకులనుచూసి అనేక ఒడిదొడుకులను ఎదుర్కొని తన చదువును కొనసాగించారన్నారు. దేశానికి అత్యున్నతమైన రాజ్యాంగం అందించారన్నారు. రాజ్యాంగంలో ఎస్సి, ఎస్టి,బిసి, మైనార్టీలకు విద్య, ఉద్యోగం రాజకీయపరంగా రిజర్వేషన్లు కల్పించారన్నారు. బిజెపి ప్రభుత్వం అంబేద్కర్‌రాసిన రాజ్యాంగాన్ని రద్దుచేయడంకోసంప్రయత్నిస్తుందన్నారు. ప్రభుత్వరంగసంస్థలను అమ్మడంద్వారా రిజర్వేషన్లు తొలగించి సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందన్నారు.కావున రాబోయే పార్లమెంటరీ ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, రాము,రాజు,ఠాగూర్, ప్రభాకర్, అనిల్, స్వామి, పంచాయతీ కార్యదర్శి ఉమాదేవి, మాజీసర్పంచ్ చిన్నరాములు, అంగన్‌వాడి టీచర్స్ శారద, అరుణమ్మ,ఆశావర్కర్ రామచంద్రమ్మ, రమేష్ పాల్గొన్నారు.

## ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** ఆరుగాలం కష్టపడి రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎండకు ఎండి పోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాళీ సంచులు లేక కొనుగోలు ప్రారంభం కాలేదని, గత పక్షం రోజుల క్రితం ఇద్దరు మార్కెట్ యార్డ్‌లోని గోదాముల్లోని అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఖాళీ సంచుల కొరతతో వరి ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. అధిక ఉష్ణోగ్రత్తలకు పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎండలకు ఉంచడంతో తూకం కూడా నష్టపోతున్నామని, ఆకాల వర్షాలు భయపెడుతున్నాయని, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఖాళీ గోనె సంచులు సరఫరా చేసి కొనుగోలు ప్రారంభించాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.



## వాలీబాల్ పోటీలకు ఎంఎల్‌ఎకు ఆహ్వానం

**ప్రజాపక్షం / పెబ్బేరు :** శ్రీరామనవమి సందర్భంగా నేటి నుండి ప్రారంభమయ్యే ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలకు వనపర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మెఘారెడ్డిని గ్రామ యువకులు ఆహ్వాన పత్రిక అందజేసి, వాలీబాల్ పోటీలను ప్రారంభించామని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మెగారెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసిక సైర్యాన్ని పెంచడమే కాకుండా, వ్యక్తుల మధ్య ఐక్యమత్యాన్ని కూడా పెంచుతుందని యువత క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గంధం రంజిత్ కుమార్ , సత్యనారాయణ, వీరస్వామి, శ్రీనివాసులు, బాలరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.




## జిఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**ప్రజాపక్షం / కొత్తకోట :** జిఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో కొత్తకోట మున్సిపాల్టీ కేంద్రంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. చలివేంద్రాన్ని ప్రారంభించిన హమాలి సంఘం ఎండలు విపరీతంగా ఉన్నందున ప్రజలు నీటి కోసం పేద ప్రజలు డబ్బు పెట్టి కొనలేరని చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట కాంగ్రెస్ అధ్యక్షులు పెద్ద కురుమన్న, పల్లెపాగు ప్రశాంత్ , ఎన్‌జి, బోయజ్ , పి. కృష్ణా రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, పిజే బాబు, పిఎం మీషేక్ , ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, భాస్కర్ , సలీం, లతీఫ్ , గఫార్ , వెంకటేష్ , భాస్కర్ , మన్యం, ముస్తఫా, కురుమన్న, రమణయ్య, సాయిలు , యాదవ్ , నవీన్‌కుమార్ , బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

**ప్రజాపక్షం/వెల్దండ :** నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు బిఆర్‌ఎస్‌పార్టీ బలపర్చిన ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు పార్టీ అనుబంధాల సంఘాల నాయకులు, దళితబహుజన మేధావులు, ప్రజాప్రతినిధులు ఆయన గెలుపుకు కృషిచేయాలని మాజీ ఉపసర్పంచ్ నర్సింహ్మాముదిరాజ్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం కట్టబెట్టాలని తన ఆరు సంవత్సరాల అత్యున్నత పదవిని తృణప్రాయంగా వదిలిపెట్టి బహుజనులకు సేవచేయాలనే ధృఢసంకల్పం ఉన్న బహుజన మేధావైన రిటైర్డ్ ఐపిఎస్ ప్రవీణ్‌కుమార్ నాగర్‌కర్నూల్ ఎంపిగా గెలిస్తే ఈ ప్రాంతానికి ఎంతోమేలు జరిగే అవకాశముందని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తగుళ్లకొండల్‌యాదవ్, ఈదులపల్లి శ్రీనివాస్ ఉన్నారు.

# అవినీతి ఎస్‌ఎస్‌సి ఏజెన్సీని బ్లాక్‌లిస్టులో పెట్టాలి




**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పారిశుద్ధ్య భద్రత సంరక్షణ పర్యవేక్షణ నిర్వహణచూసే ఎస్‌ఎస్‌సి ఏజెన్సికాంట్రాక్టర్ ఆగడాలకు అక్రమాలకు అవినీతికి అడ్డుఅదుపులేకుండాపోయిందని ఆస్పత్రి కార్మికులవేతనాల్లో భారీ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఎస్‌ఎస్‌సి ఏజెన్సిని తక్షణమేబ్లాక్‌లిస్టులో పెట్టాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టువర్కర్స్‌యూనియన్(ఎఐటియుసి) రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా డిమాండ్‌చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి శానిటేషన్ పేషెంట్‌కేర్‌సెక్యూరిటి కార్మికుల సమావేశం జరిగింది. జివోనెం.68ప్రకారం వేతనాలు చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు తక్షణమే అందించాలని డిమాండ్‌చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ రఘుకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ ఎస్‌ఎస్‌సి ఏజెన్సి కాంట్రాక్టర్ జివోనెం.68 తుంగలోతొక్కి ఇష్టానుసారంగా 2017నుండి 10200లకు గాను కేవలం 7600చెల్లిస్తూ భారీ అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. లేబర్‌యాక్టివ్‌ప్రకారం ప్రతి ఆరునెలలకు ఒకసారి విడిఎ పాయింట్లు కలుపుకొని వేతనాలు అందించాలని కాని ఏడు సంవత్సరాలుగా ఒక్కరూపాయికూడా జీతంపెంచకుండా తీవ్రమైన అన్యాయానికి గురిచేశారన్నారు. 2023మార్చి విడిఎ పాయింట్లతో పోలిస్తే ఆస్పత్రి కార్మికులకు 13,524రూపాయల వేతనం అవుతుందని ఇందు లో 1624పిఎఫ్ 101 ఈఎస్ఐ 11,800సగటు వేతనంగా చెల్లించాల్సి ఉందన్నారు. ఇవన్ని అమలుచేయకుండా తప్పుడుపద్ధతుల్లో బిల్లులు ఖాళీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైన ఎస్‌ఎస్‌సి ఏజెన్సి అవినీతి అక్రమాలపై విచారణజరిపి కార్మికులకు జివోనెం.68 ప్రకారం పూర్తిస్థాయి వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో తెలంగాణమెడికల్ కాంట్రాక్టువర్కర్స్‌యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.సురేష్, ఎఐటియూసి జిల్లాకార్యదర్శి శివశంకర్, ఆస్పత్రి కార్మికులు బాలకిష్టమ్మ, రాధ, మణెమ్మ, గౌరమ్మ, నాగమణి, రంజాన్, రేణుక, మహేశ్వరి, యాదగిరి, రఘు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

**ప్రజాపక్షం / శ్రీరంగాపురం :** ఎమ్మెల్యే మెగారెడ్డి ఆధ్వర్యంలో శ్రీరంగాపురం పెబ్బేరు మండలాల కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఉంటుందని బీరం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ సమస్యలు రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో పార్టీ విధి విధానాలకు సంబంధించి గ్రామ స్థాయిలోని కార్యకర్తలతో ఎమ్మెల్యే మెగారెడ్డి నేరుగా అభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు వేదికగా వల్లపురెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుండి మొదలవుతుందని గ్రామాల వారిగా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.ఎండ్



## వనపర్తి కవులకు ఘనసన్మానం

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** తెలంగాణ పద్య సార్స్వత పీఠం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన పద్య కవి సమ్మేళనంలో పాల్గొన్న వనపర్తి కవులకు నిర్వహకులు ఘన సన్మానం చేశారు. పద్యానికి పూర్వ వైభవం తేవాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటైన తెలంగాణ పద్య సారస్వత పీఠం రాష్ట్ర అధ్యక్షులు అవుసల భాను ప్రకాశ్ ఆధ్వర్యంలో కేవలం పద్యకవులతో శతకవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఠం ఆహ్వానం మేరకు వనపర్తి పట్టణానికి చెందిన పద్య కవులు బస్వోజు సుధాకరాచారి, నాయకంటి నర్సింహ శర్మ, ఆకుల శివ రాజలింగం, చందాపురం బుచ్చయ్య, వీరాచారి, సువర్ణాదేవి, మల్లేశ్వర్, లక్ష్మయ్యలు, ఉగాది, శ్రీరామ నవమి అంశాలపై పద్యాలను ఆలపించి పలువురి చేత ప్రశంసలందుకున్నారు. ఈ కార్యక్రమంలో రామాయణ భానువు పుస్తకావిష్కరణ అనంతరం ప్రముఖ సాహితీ వేత్త ఆచార్యా కసిరెడ్డి వెంకటరెడ్డి, సిని నటులు, సివిఎల్ నర్సింహా రావు, పద్య సారస్వత పీఠం అధ్యక్షులు, అవధాని అవుసల భాను ప్రకాశ్ , ఐఏఎస్ అకాడమీ చైర్మన్ ఆకెళ్ల రాఘవేంద్ర, మరుమాముల దత్తాత్రేయ శర్మ చేతుల మీదుగా సన్మానం పొందారు.

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్టాపన



**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలంలోని నాటవెల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ ధ్వజస్తంభం, బొడ్రాల ప్రతిష్టాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద మంత్రాల మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. అధిక సంఖ్యలో భక్తులు , గ్రామస్తులు పాల్గొన్నారు.

## అప్పులు ఉన్నా..ఆరు గ్యారంటీలూ అమలు చేస్తాం

### రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ప్రజా సంక్షేమం కోసం ఎన్ని అప్పులు ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినని ఖచ్చితంగా నెరవేరుస్తామని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం పాన్‌గల్ మండల పరిధిలోని మల్లాయిపల్లి, చింతకుంట, దొండాయిపల్లి , దావాజిపల్లి, పాన్‌గల్ గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అప్పుల చిప్పను చేతికి ఇచ్చి నాలుగు నెలలకే అభివృద్ధి ఏదని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పది రూపాయల పనికి వంద రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసింది కేసిఆర్ ప్రభుత్వం అని అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల తెలంగాణగా మార్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్దే ప్రధాన లక్ష్యమని, ప్రతి గ్యారెంటీని ప్రతి ఇంటికి ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సదుపాయం, రాజీవ్ ఆరోగ్య శ్రీ రూ. 10 లక్షలకు పెంపు అమలు చేసిందని తెలిపారు. ఇప్పటికే రూ. 500కే వంట గ్యాస్ , 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామని, ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కూడా ప్రారంభించామని చెప్పారు.కొల్లాపూర్ నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరయ్యాయని, లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా చేపడతామని, అర్హులైన లబ్దిదారులను స్వయంగా తానే ఎంపిక చేస్తానని స్పష్టం చేశారు. రూ. 2 లక్షల రుణమాఫీ, పంటల భీమా త్వరలో అమలు చేస్తామని , ఇప్పటికే 5 ఎకరాల లోపు వ్యవసాయ భూమి ఉన్న రైతులకు రైతు భరోసా పథకం ద్వారా పంట పెట్టుబడిఇ సాయాన్ని అందజేస్తున్నామన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి తప్ప ఎవరికి లబ్ది చేరలేదన్నారు. ఇంటికి పెద్ద కుటుంబానికి వచ్చిన ఆస్తి కాపాడి తన పెద్దరికాన్ని నిలబెట్టుకుంటాడని, కానీ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ అలా వ్యవహరించకుండా రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చాడని అన్నారు. కాంగ్రెస్ పార్టీపై ఎంతో నమ్మకంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు వేశారని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్ , మాజీ సింగిల్‌విండో వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్ సాగర్ , పుల్లారావు, బ్రహ్మం, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రానివ్వం

### తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ఉమ్మడి పాలమూరు జిల్లాలో తాగునీటి అవసరాలకు కావాల్సిన నీళ్లు రిజర్వాయర్లో పుష్కలంగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి అపోహాలకు గురి కావద్దని తెలంగాణ రాష్ట్ర గవర్నమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానీయా అన్నారు. సోమవారం మండల పరిధిలోని గోపాల్ దిన్నె జలాశయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రతి రిజర్వాయర్లో నీటి నిల్వలను పరిశీలించడం జరిగిదిందని, జిల్లా కలెక్టర్లతో పాటు సంబంధిత అధికారులతో మంచినీటి సమస్యపై రివ్యూ చేయడం జరిగిందని వివరించారు. జూలై, ఆగస్టు నెల వరకు మంచినీళ్లకు ఎలాంటి సమస్య లేదని, ప్రతి ఇంటెక్ వెల్ వద్ద పంపులు కూడా బాగానే పని చేస్తున్నాయని, గద్వాల వనపర్తి జిల్లాల్లో మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నీటిని పుష్కలంగా అందించడం జరుగుతుందని , ఎక్కడో ఒక చోట పైపులైన్ లీకేజీల వల్ల నీటి సమస్య ఏర్పడితే సంబంధిత అధికారులు 24 గంటల్లోపే పైపులను రిపేర్ చేయించి నీటి సరఫరా చేస్తున్నారని, అంతేకాక రాత్రిళ్లు కూడా ఎక్కడైనా పైప్ లైన్ ల వల్ల నీటి సమస్య ఏర్పడితే అధికారులు వెంటనే వెళ్లి బాగు చేయిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల కలెక్టర్లుతో, మిషన్ భగీరథ అధికారులతో నీటి సమస్యపై ప్రతి రోజు సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలలోని ఏ గ్రామాల్లో కూడా నీటి సమస్య రాకుండా అప్రమత్తంగా ఉంటున్నారని అన్నారు. జిల్లాలోని కలెక్టర్లు కూడా ప్రతి రోజు మంచినీటిపై అధికారులను అప్రమత్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ , మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డితో పాటు జూరాల, మిషన్ భగీరథ అధికారులు, తహసీల్దార్ వరలక్ష్మీ , ఎంపీడీఓ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

(ఫోటో విపిజిఎల్ 5 రైటప్ : పరిశీలిస్తున్న దృశ్యం )

# ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

### కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వేసవిసెలవులు ముగిసేలోగా నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోకావాల్సిన మౌలిక వసతుల పనులు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పడిన అమ్మ ఆదర్శపాఠశాలల కమిటీల ఏర్పా టు పనులు చేయించే విధానంపై సోమవారం ఐడిఓసి కార్యాలయ వీడియోకాన్ఫరెన్స్ సమావేశమందిరంలో జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 839 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటిల ఏర్పాటు ద్వారా మంజూరైన పనులు అన్నింటికి అంచనాలు రూపొందించాలన్నారు. కమిటీల ఆధ్వర్యంలో పాఠశాలల్లో తాగునీరు, తరగతిగదుల్లో బ్లాక్‌బోర్డు, కిటికిలు, తలుపులు, ఫ్యాన్లు, సిసికెమెరాల ఏర్పాట్లతో పాటు చిన్న చిన్న మరమ్మత్తులు, టాయిలెట్లు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తదితర పనులను స్థానికంగానే పూర్తి చేయించాలన్నారు.

ప్రతి పాఠశాలకు 25వేలచొప్పున విడుదల చేసిన నిధులతో పనులన్నింటిని పూర్తిచేయించాలని ఆదేశించారు. అన్ని పాఠశాలల మరమ్మత్తుల పనులను వేసవి సెలవులకంటే ముందుగానే పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పని ఎప్పుడు మొదలుపెడతారు ఎప్పటికి పూర్తి అవుతుందో ఖచ్చితమైన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

మే31 లోగా మంజూరైన ప్రతి పనిపూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటిదశలో రాగల 15 రోజుల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఉన్న పాఠశాలలో ఎలక్ట్రికల్, తాగునీరు, టాయిలెట్, ర్యాంపు లు, మొదలగుపనులన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతిపని మొదలుపెట్టే ముందు పూర్తి అయిన తర్వాత ఫొటోలను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ బ్యాంకులలో కమిటిలఖాతాలు తెరిపించాలని అన్నారు. ప్రతిరోజు పనుల పురోగతిపై నివేదికలు అందజేయాలన్నారు. ఈసమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, మండల విద్యాధికారులు, స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి**

22వతేదినుండి 24వతేదీవరకు జరిగే సలేశ్వరం జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ సంబంధితశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ఎన్ఐసి సమావేశమందిరంలో జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్, అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, డిఎఫ్‌ఓ రోహిత్‌గోపిడి, ఇతర జిల్లా అధికారులు, సలేశ్వరం ఆలయ కమిటి సభ్యులతో కలిసి కలెక్టర్ ఉదయ్‌కుమార్ జాతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సలేశ్వరం జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా భక్తులకు అన్నిరకాలఏర్పాట్లు చేయాలన్నారు. ఏప్రిల్ 22వతేదినుండి 24వతేదీవరకు మూడు రోజులపాటు భక్తులను అనుమతిస్తున్నట్లు తెలిపారు. ఫర్హాబాద్ నుండి లోపలికి అనుమతించడం జరుగుతుందన్నారు. అడవిలోకి ప్లాస్టిక్ వస్తువులు అనుమతించరాదన్నారు.

జాతరకు వచ్చే భక్తులకు ప్రమాదవశాత్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అటవీశాఖ సిబ్బందితోకలిసి పోలీసుశాఖవారు గట్టిబందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. రాత్రివేళల్లో నడిచే భక్తులకు ఎలాంటి అసౌకర్యంలేకుండా మధ్యమధ్యలో సోలార్‌లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్‌టిసిబస్సులు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, అచ్చంపేట డిపోల నుండి భక్తుల సౌకర్యార్థం విరివిగా బస్సులను ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యశాఖ తరపున పలుచోట్ల ప్రథమచికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేసి వైద్య సిబ్బందిని, అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సరఫరాకు కొదవలేకుండా ట్రాక్టర్లతోపాటు వీలైనన్ని ఎక్కువ సంఖ్యలో సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటుచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్, జిల్లాగిరిజన సంక్షేమశాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, అటవీపోలీస్ అధికారులు, జాతర కమిటిసభ్యులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు అప్పజెప్పాలి

2023–24 ఖరీఫ్‌కు సంబంధించి ప్రభుత్వానికి అప్పజెప్పాల్సిన సిఎంఆర్ బియ్యాన్ని మిల్లర్లు తక్షణమే అప్పజెప్పాలని జిల్లాకలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ సీతారామారావు చాంబర్‌లో సిఎంఆర్ (కస్టమ్‌మిల్డ్‌రైస్) బియ్యం సప్లైపై రైస్‌మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎంఆర్ ఎఫ్‌సిఐకి అప్పజెప్పాల్సిన 47వేల మెట్రిక్‌టన్నుల సిఎంఆర్‌బియ్యాన్ని మిల్లర్లు నిర్ణీత గడువులోగా అందించకుంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. గడువులోగా సిఎంఆర్ బియ్యాన్ని అప్పజెప్పని మిల్లర్లపై కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈసమావేశంలో జిల్లారెవెన్యూ అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి స్వామికుమార్, జిల్లా మేనేజర్ బాలరాజు, జిల్లాలోని మిల్లర్లు పాల్గొన్నారు.

## బస్‌స్టాప్‌ను పునరుద్ధరించండి : కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/నాగారం :** తొలగించిన బస్‌స్టాప్‌ను పునరుద్ధరణ చేయాలని సోమవారం నాగారం మున్సిపల్ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నాగారం మున్సిపాలిటీ పరిధి లోని ప్రధాన రహదారి ఎస్‌వి నగర్‌లో ఫుట్‌పాత్‌పై ఉన్న బస్‌స్టాప్ 20 సంవత్సరాల క్రితం ఎంతో మంది అధికారులకు విన్నవించుకుని బస్‌స్టాప్‌ను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఉగాది రోజు మున్సిపల్ కార్యాలయానికి సెలవు కావడంతో రాత్రికి రాత్రే ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. స్పందించిన కమిషనర్ కీసర పిఎస్‌లో తొలగించిన బస్ స్టాప్ గూర్చి ఫిర్యాదు చేశారు. ప్రయాణీలకు బస్‌స్టాప్ లేక మండుటెండలో వేచిఉండడంతో వడదెబ్బకు గురవుతున్నారని విన్నవించుకుంటూ బస్‌స్టాప్‌ను పునరుద్ధరణ చేయాలని కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రంలో కోరారు.

## నీటి ఇబ్బందులు పరిష్కరించండి : సిపిఐ



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** రంగారెడ్డి నగర్, జగద్గిరిగుట్ట డివిజన్‌లలో ప్రజలు ఎదుర్కొంటున్న నీళ్ల ఇబ్బందులు పరిష్కరించాలని మేనేజింగ్ డైరెక్టర్, మెట్రో వాటర్ వర్క్స్ అధికారులను సిపిఐ నాయకులు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇళ్లలో ఉన్న బోర్లు ఎండిపోయి, మూడు రోజులకు ఓసారి వాటర్‌వర్క్స్ అధికారు లు ఇస్తున్న నీళ్లు సరిపోవడంలేదని, సమయం పెంచాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు, జగద్గిరిగుట్ట మాజీ కౌన్సిలర్ కే.ఏసురత్నం, గిరినగర్ మాజీ కౌన్సిలర్ పి.నరసయ్య, వి.శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు వి.హరినాధరావు, డి.యాదగిరి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు అభ్యర్థులు, నిర్వహణాధికారులు సిద్ధం







**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** లోకసభ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణాధికారులు మల్కాజిగిరి లోకసభ స్థానానికి ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిపించేందుకు ఎన్నికల నిర్వాహణాధికారులు సన్నద్ధమవుతున్నారు. మరో పక్క ఎలాగైనా ఈ స్థానాన్ని తామే దక్కించుకోవాలన్న లక్ష్యంతో అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. గతనెల 16నే భారత ఎన్నికలసంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలవటం, ప్రధాన పార్టీలు పోటీ చేసేందుకు తమ అభ్యర్థులను ముందుగానే ఖరారు చేయటంతో అప్పటి నుండే ఎన్నికల హడావిడి మొదలైంది. దేశంలోనే అత్యధిక ఓటర్లతో పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో మేడ్చల్ మల్కాజిగిరిజిల్లాలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, రంగారెడ్డి జిల్లాలోని ఎల్‌బినగర్, హైదరాబాద్ జిల్లాలోని కంటోన్మెంట్ అసెంబ్లీ సెంగ్మెంట్లు ఉన్నాయి. ఇప్పటి వరకు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానమవటంతో కాంగ్రెస్ పక్షాన సునీతారెడ్డి, ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ తమ అభ్యర్థులే విజయం సాధించిన బిఆర్‌ఎస్ పక్షాన రాగిడి లక్ష్మారెడ్డి, కేంద్రంలో అధికారపార్టీ అయిన బిజెపి పక్షాన ఈటెల రాజేందర్ మల్కాజిగిరి అభ్యర్థులుగా తమ అదృష్టాన్ని పరీక్షించుకొంటున్నారు.

### అధికారుల సమాయత్తం....

ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. దీని ప్రకారం ఏప్రిల్ 18 నుండి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, 26న నామినేషన్ల స్క్రూటినీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ జరుగుతుంది. 37,28,417 ఓటర్లున్న మల్కాజిగిరి పార్లమెంటు స్థాన ఎన్నికల నిర్వహణాధికారిగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం వ్యవహరిస్తున్నారు. 15వ తేదీతో ముగియనున్న ఓటర్ల నమోదు కార్యక్రమంతో మరి కొంత మంది యువ ఓటర్లు అదనం కానున్నారు. వీరిలో 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు 15117 మంది కాగా దివ్యాంగులు 26119 మంది ఉన్నారు. వీరికి ముందుగా దరఖాస్తులు తీసుకొన్న మీదట తమ ఇళ్ల నుండే ఓటు హక్కు వినియోగించుకొనే సదుపాయం కలిగించారు. ప్రతి రెండు కిలోమీటర్ల రేడియస్‌లో పోలింగ్ కేంద్రాలు ఉండే ఏర్పాటుతో 3200 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. భారత ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన గత నెల 16 నుండే ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో ఎన్నికల నిబంధనలను అమలు చేసేందుకు నిర్వహణాధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. దీనిలోని భాగంగా పలు కీలక ప్రాంతాల్లో స్టాటిక్ సర్వేలెన్స్, ఫ్లయింగ్ సర్వేలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి అక్రమంగా తరలించే మద్యం, నగదు, బంగారం, ఓటర్ల ప్రలోభానికి గురి చేసే ఇతర వస్తువులను తనిఖీ చేస్తూ అవసరమైతే స్వాధీనం చేసుకోవటం, కేసులు నమోదు చేయటం కొనసాగిస్తున్నారు. తమ దృష్టికి వచ్చే ఎన్నికల అతిక్రమణల గురించి ఫిర్యాదు చేసేందుకు రేయింబవళ్లు పని చేసే టోల్‌ఫ్రీ నంబరు 1950కి తోడు 18504252050 నంబరును మేడ్చల్ జిల్లాకు గాను అదనంగా అందుబాటులోకి తెచ్చారు. దీనికి తోడు ఫిర్యాదులు చేసేందుకు వంద నిమిషాల్లో చర్యలు తీసుకొనే విధంగా జవాబుదారీ తనంతో కూడిన సివిజిల్ యాప్ వినియోగంలోకి తెచ్చారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎప్పటికప్పుడు సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల విధులు నిర్వహించే ప్రిసైడింగ్,సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర సిబ్బందికి పలు దఫాలుగా శిక్షణా తరగతుల ద్వారా అవగాహన కల్పించారు. రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో నిర్వహించిన సమావేశంలో ర్యాండమైజేషన్ ద్వారా ఎన్నికల సిబ్బందిని, ఇవిఎం, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాడ్‌లను కేటాయించారు. పోలింగ్ శాతాన్ని వంద శాతం జరిగే లక్ష్యంగా స్వీప్ ద్వారా అన్ని అసెంబ్లీ అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధుల్లోనూ అవగాహనా కార్యక్రమాలతో పాటు ఫ్లెక్సీలు, కరపత్రాలు, సోషల్ మీడియాల ద్వారా విస్తృత ప్రచారం చేశారు. తాజాగా సోమవారం జిల్లా ఎన్నికల అధికారి గౌతం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి హరిప్రియతో కల్సి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో కల్సి నిర్వహించిన సమావేశంలో విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. నామినేషన్ల సమయంలో అభ్యర్థితో పాటు నలుగురిని మాత్రమే రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి అనుమతించాల్సి ఉంటుందని, కార్యాలయానికి వంద మీటర్ల దూరం లోపే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నామినేషన్లు ఈనెల 18 నుండి 25 వరకు ప్రతి రోజు ఉదయం 11 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరించాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు http;suvidha.eci.gov.in పోర్టల్ ద్వార నామినేషన్ దాఖలు చేసే సౌకర్యం కల్పించిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## ఎస్‌సిల జాబితాలో రజకులు

### సిఎం రేవంత్‌రెడ్డిని కోరిన రజక రిజర్వేషన్ సమితి



**ప్రజాపక్షం/బోడుప్పల్:** రాష్ట్రంలో రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర కోశాధికారి ఓరుగంటి వెంకటయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సోమవారం ఆయన స్వగృహంలో కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజకులకు ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని ఆర్టికల్ 340, 341లో ఉన్నందున 17 రాష్ట్రాల్లో ఎస్సీ రిజర్వేషన్లు రజకులకు ఇస్తున్నారని, అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలోనూ అమలు చేయాలని కోరారు. అందుకు సిఎం స్పందిస్తూ తమ ప్రభుత్వం కులవృత్తిదారులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు.

## ఘనంగా చిత్తారమ్మదేవి జాతర



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ దొమ్మర పోచంపల్లి లో కోళ్ల వీరేశం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిత్తారమ్మ దేవి జాతరకు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్లు బండారి మహేందర్ యాదవ్, కోలా సాయి యాదవ్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేష్ యాదవ్, బిఆర్ఎస్ పార్టీ దుందిగల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి కొల్తూరి మల్లేష్ కోలా మహీందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట :** జీడిమెట్ల డివిజన్ బీరప్ప నగర్‌లో నిర్వహిస్తున్న బీరప్ప స్వామి కామారతి కళ్యాణ మహోత్సవానికి ఎమ్మెల్యే కేపీ. వివేకానంద ముఖ్యఅతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నదీమ్ రాయ్, కాలే గణేష్, దేవాలయ కమిటీ చైర్మన్ నార్లకంటి నాగేష్, పెద్ద కురుమ యాదయ్య, సెల్వోజి సత్తయ్య, టెంపర్ ప్రెసిడెంట్ నార్లకంటి చంద్రయ్య, కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కురుమ సంఘం అధ్యక్షులు పాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కుంటి మల్లేష్, కురుమ సంఘం సభ్యులు ప్రతాప్, ఉలిపి మల్లేష్, బాలయ్య పాల్గొన్నారు.

## కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి





**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** పార్లమెంటు ఎన్నికల్లో మల్కాజ్‌గిరి బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మౌలాలీ డివిజన్‌లోని రాయల్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం బిఆర్ఎస్ నాయకులు భాగ్యానంద్ అధ్యక్షతన డివిజన్ బిఆర్ఎస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన గల్లీ సమస్యలు పరిష్కారం కావాలంటే మన స్థానిక నాయకుడు లక్ష్మారెడ్డి ఢిల్లీ పార్లమెంటులో ఉండాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీ పథకాలు ఆచరణలో విఫలమయ్యాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మౌలాలీ మాజీ కార్పొరేటర్ ఫాతిమా అమినుద్దీన్, జేఏసి వెంకన్న, మేడల మల్లికార్జున్‌గౌడ్, ఆదినారాయణ, భాగ్యానంద్, ఇబ్రహీం, ఉస్మాన్, సత్యనారాయణ, అమిన్, సంతోష్‌నాయుడు, సంతోష్ గుప్తా, మహేష్, మురళీ, మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నగదు, బంగారం, మద్యం స్వాధీనం

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుండి మేడ్చల్ జిల్లాలో ఇప్పటి వరకు రూ. 4,78,71,931 విలువైన నగదు, బంగారం, మద్యం స్వాధీనం చేసుకొన్నామని జిల్లా ఎన్నికల అధికారి గౌతం తెలిపారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి, పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖలతో ఏర్పాటు చేసిన బృందాల ద్వారా రూ.3 కోట్ల 94 లక్షల 77 వేల 276 నగదు, 83 లక్షల 94 వేల 655 విలువైన బంగారు ఆభరణాలు ఇతర వస్తువులు స్వాధీనమయ్యాయన్నారు. ఎక్సైజ్ శాఖ 312 మందిపై కేసులు నమోదు చేసి 326 మందిని అరెస్టు చేసారన్నారు. 23 బెల్ట్ షాపులను మూసేయించామన్నారు. పోలీస్ శాఖ 897 లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించుకొన్నారని, 753 మందిని బైండోవర్ చేసారన్నారు.

## మోకాలి శస్త్రచికిత్సలో అధునాతన పద్ధతులు

### దేశవ్యాప్తంగా లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న పలు ప్రాంతాల సర్జన్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంజురీ ఆర్థోస్కోపీ (ఎస్ఐఎస్ఎ) 25 సంవత్సరాల సేవలు పూర్తి చేసిన సందర్భంగా 'లైవ్ సర్జరీ కాన్ఫరెన్స్–2024'ను హైదరాబాద్‌లోని హైటెక్స్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించారు. మోకాలి కీళ్ల సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చిన ఈ సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 400 మందికి పైగా సర్జన్లు పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.రఘువీర్‌రెడ్డి, డాక్టర్ అడ్రియన్ విల్సన్ (యూకె), డాక్టర్ క్రిస్టియన్ క్లే (జర్మనీ), భారతదేశానికి చెందిన 20 మంది ప్రముఖ సర్జన్లతో కూడిన ఎందరో నిపుణులు ఈ పద్ధతులను ఉపయోగించి సానుకూల ఫలితాలు సాధించడంలో తమ ప్రావీణ్యతలను పంచుకున్నారు. ఆర్థోపెడిక్ సర్జన్లు ఈ రంగంలో మెళకువలను తెలుసుకునేందుకు, తమ అనుభవాలపై చర్చలు చేశారు. మోకాలి కీళ్ల సంరక్షణలో నాన్ సర్జికల్, సర్జికల్ చికిత్సలు రెండూ ఉన్నాయని, దీనికి విరుద్ధంగా మోకాలి మార్పిడి అనే పద్ధతిలో మోకాలి కీలులో దెబ్బతిన్న భాగాలను తొలగించి, వాటి స్థానంలో కృత్రిమ భాగాలను భర్తీ చేయడం జరుగుతుందని డాక్టర్ కె.రఘువీర్‌రెడ్డి, డాక్టర్ అడ్రియన్ విల్సన్ (యూకె) వివరించారు.

## వికసిత్ భారత్ సాకారం దిశగా చర్యలు

### రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** వికసిత్ భారత్ ప్రణాళికలను సాకారం చేసే దిశగా విశ్వవిద్యాలయాలు నిరంతరం కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ ఆకాంక్షించారు. సోమవారం శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేటలోని లియోనియా రిసార్ట్స్‌లో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటి సంస్థ తన 98వ వార్షిక జనరల్ సమావేశంతో పాటు ఉపకులపతులు మూడురోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ మూడు రోజుల సదస్సును ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం సహకారంతో నిర్వహిస్తున్నారు. ఈ సదస్సును తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణ ముఖ్య అతిదిగా విచ్చేసి మూడురోజుల సదస్సును జ్యోతి వెలిగించి ప్రారంబించారు. అనంతరం గవర్నర్ రాధాకృష్ణ ప్రసంగిస్తూ దేశాభివృద్ధికి తోడ్పడుతున్న విద్యారంగానికి ఉపకులపతులు చేస్తున్న సేవలను గుర్తించి వారిని కొనియాడారు. దేశంలోని విశ్వవిద్యాలయాలన్ని విద్యార్థుల ప్రతిభకు సానబెట్టి వారిని పోటీ ప్రపంచంలో విజయం సాదించేలా తీర్చిద్దాలని ఆయన సూచించారు. దేశంలోని ఉన్నత విద్యకు సంబందించి నిరంతర మార్పులు చేర్పులు చేసేందుకు కృషి చేస్తున్న ఏఐయు సంస్థను అభినందించారు. ప్రధాని నరేంద్రమోదీ వికసిత్ భారత్ ప్రణాళికను సాధికారం చేసే దిశగా విశ్వవిద్యాలయాలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏఐయు ప్రతినిధులు, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు సుమారుగా 500 మంది హాజరయ్యారు. ఈ సదస్సులో 78 మంది విద్యావేత్తలు కలిసి రచించిన సస్టయనబుల్ గోల్స్ పుస్తకాన్ని గవర్నర్‌తో పాటు ఇతరులు ఆవిష్కరించారు.

## దళారులకు ధాన్యం అమ్మొద్దు

### కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** దళారులకు ధాన్యం అమ్మొద్దని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి రైతులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలుపై సోమవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కేంద్రాలను క్షేత్రస్థాయిలో తహసీల్దారు సందర్శించి రైతులకు అవసరమైయ్యే సదుపాయాలను కల్పించాలన్నారు. ప్రభుత్వ అందిస్తున్న కనీస మద్దతు ధరకు అందుబాటులో ఉన్న కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పూర్తికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పని చేసే చోట తాగునీరు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని అధికారులు అదేశించారు. గ్రామల్లో త్రాగునీటి సరపరాలో ఎలాంటి సమస్యలు ఏర్పడకుండా ప్రణాళిక బద్దంగా చర్యలు తీసుకోవాలని అదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, రాహుల్ శర్మ. రాజేశ్వర్, డిఆర్‌డిఓ శ్రీనివాస్‌లు , జిల్లా పంచాయతీ అధికారి జయసుద తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీలకు కేంద్రం నిధులు

### కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం /వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన బిజెపి ప్రజా ఆశీర్వాద సభలో ఎంపి అభ్యర్థి కొండవిశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోడీకి పోటీనే లేదన్నారు. దేశం మొత్తం ఫిర్ ఏక్‌బార్ మోడీ సర్కార్ అంటూ నినదిస్తుందన్నారు. కేంద్రంలోని మోడీ ప్రజలందరికీ అన్ని ఇస్తున్న ప్రతిపక్షాలు మాత్రం ఏమీ ఇవ్వడం లేదని దుష్ప్రచారం చేస్తున్నాయని అయన ఆరోపించారు. గ్రామాల్లోని పంచాయతీలకు, సర్పంచులకు నేరుగా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుందన్నారు. ఆ నిధులతోనే గత ప్రభుత్వం గ్రామాల్లో రైతు వేదికలు, వైకుంఠధామాలు నిర్మించారన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే ప్రజలంతా ఆగం కావాల్సిందేన్నారు. తెలంగాణలో గ్యారంటీలు ఇచ్చి ఒక గ్యారెంటీని కూడా పూర్తి చేయలేదన్నారు. డిసెంబర్ 9న రెండు లక్షలు రుణ మాఫీ చేస్తామన్న సిఎం రేవంత్‌రెడ్డి రెండు పైసలు కూడా మాఫీ చేయలేదన్నారు. మహిళలకు రూ.2500 నగదు ఎప్పుడు ఇస్తారు అని నిలదీశారు. కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి రంజిత్‌రెడ్డి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులను అడ్డుపెట్టుకొని ఎంపిగా గెలిచాడని ఆరోపించారు. రంజిత్‌రెడ్డి ఓటమి ఖాయమన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి, వడ్ల నందు తదితరులు పాల్గొన్నారు.

# దొంగహామీలతో అధికారంలోకి

### కొడంగల్ ప్రజలను మోసం చేసిన రేవంత్
### మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/కొడంగల్ :** దొంగ హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, అసెంబ్లీ ఎన్నికలలో కొడంగల్ ప్రజలకు రేవంత్‌రెడ్డి దొంగ హామీలు ఇచ్చి మోసం చేశాడని మాజీ మంత్రి హరీష్‌రావు ఆరోపించారు. సోమవారం కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పట్టణంలో మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల సమర భేరి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంఎల్‌ఏలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ బిజెపి, కాంగ్రెస్ పార్టీలు మాకంటే మాకు ఓటు వేయాలని ప్రచారాలు చేస్తున్నాయని, వారికి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు పదేళ్ల బిజెపి పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పాలన్నారు. దేవుడి పేరు చెప్పుకుని ఓట్లు తప్ప చేసింది ఏమి లేదని విమర్శించారు. నిత్యావసర ధరలు పెంచి పేద మధ్య తరగతి ప్రజల నడ్డిని విరిచిన బిజెపికి ఎందుకు ఓటు వేయాలంటూ ప్రశ్నించారు. తెలంగాణలో నిరుద్యోగుల సంఖ్యను పెంచిన ఘనత బిజెపిది అన్నారు. పాలమూర్ రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వమంటే ఇవ్వలేని పార్టీకి ఓటు వేయాల్నా అంటు ప్రశ్నించారు. తెలంగాణలో కేసిఆర్ నిరుద్యోగ సమస్యలతో పాటు గుడి బడి రెండు కట్టిందు అన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను పక్కకు పెట్టారన్నారు. కొడంగల్‌కు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు వచ్చి రేవంత్‌రెడ్డి హామిలు ఇవ్వకపోతే నేను ఉన్నా నేను ఇస్తా అని గొప్పలు చెప్పి మోసం చేసి పారిపోయారని ఆరోపణ చేశారు. ఆరు గ్యారెంటీలలో ఒక్క గ్యారెంటి కూడా అమలు చేయడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు 2 లక్షల రుణామాఫి చేస్తామని, ఎకరాకు 15 వేలు ఇస్తామని, బోనస్‌లు ఇస్తామని అనేక హామీలు ఇచ్చి నేడు కరువు తాండవం చేస్తున్న రేవంత్‌రెడ్డి పట్టించుకోవడం లేదని అన్నారు. వృద్ధులకు 4 వేల పింఛన్‌లు కూడా ఇస్తాలేరని విమర్శించారు. కొడంగల్‌లో ఆనాడు కేసిఆర్ ప్రభుత్వంలో ఇక్కడి ఎంఎల్‌ఏగా ఉన్న పట్నం నరేందర్‌రెడ్డి ఇంటింటికి తిరుగుతు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తు రైతులకు రైతు బంధు, రైతు భీమా, కల్యాణ లక్ష్మి , షాదిముభాకర్, వృద్ధులకు వికలాంగులకు పింఛన్లు అందించినది వాస్తవం కాదా మాకు అధికారం ఉన్న లేకున్న ప్రజలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. బిఆర్ఎస్ పార్టీ ఉండాలంటే ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓట్ల కోసం వస్తే 6 గ్యారెంటిలపై నిలదీయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కొడంగల్‌లో రైతులకు బెదిరింపులకు గురి చేస్తు వారి భూములను లాక్కోంటు ఫార్మ కంపెనిలు పెడుతామంటే ఊరుకునే లేదని హెచ్చరించారు. పార్టీ నాయకును కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తు బెదిరింపులకు గురి చేస్తే సహించేది లేదని కేసులు పెడితే నాయకుల ఇంటి ముందు దర్నాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరిలో కాంగ్రెస్‌దే విజయం

### కూన శ్రీశైలంగౌడ్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కోలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్, జగద్గిరిగుట్ట డివిజన్ లలో సంక్షేమ సంఘాలు, కులసంఘాల ఆత్మీయ సమావేశం జరిగింది. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్, మల్కాజ్‌గిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సమావేశంలో శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బలపరిచిన మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కులసంఘాలు, సంక్షేమ సంఘాలను కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాల్సిన బాధ్యత సంక్షేమ సంఘాలపై ఉందన్నారు. సమావేశంలో డిసిసి అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కేఎం ప్రతాప్, నియోజకవర్గ కోఆర్డినేటర్ బంద్రు శోభారాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు నర్సారెడ్డి భూపతి రెడ్డి, కందాడి జ్యోష్ణ శివారెడ్డి, సొంటి రెడ్డి పున్నారెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీ, బి బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ఇన్చార్జులు జిల్లా నాయకులు డివిజన్ నాయకులు యూత్ కాంగ్రెస్ నాయకులు ఎన్ఎస్‌యుఐ, ఐఎన్‌టియుసి నాయకులు, పలు సంక్షేమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



### సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలి

**మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు పిలుపునిచ్చారు. సోమవారం నేరేడ్‌మెట్‌లోని యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ చర్చిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కేంద్రంలో రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీత మహేందర్‌రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పాస్టర్లు జోసెఫ్, శైలేష్, సామెల్, పద్మారావు, డేవిడ్, శ్యామ్, రాజు, నాయకులు బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, సతీష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్‌గిరి అభివృద్ధి బిజెపితో సాధ్యం

### ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మల్కాజ్‌గిరి అభివృద్ధి బిజెపితో సాధ్యమని మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఒకటో డివిజన్ బిఆర్ఎస్ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు దంపతులు ఈటల రాజేందర్ సమక్షంలో బిజెపిలో చేరారు. సోమవారం బాచుపల్లిలోని కెఆర్‌సిఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన సభలో ఈటల రాజేందర్ సమక్షంలో కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు చేరారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి సుబ్బారావు దంపతులకు పార్టీ కండువా కప్పి బిజెపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ని ఊహించని రీతిలో అభివృద్ధి పథంలో నడిపించాలంటే బిజెపిని గెలిపించాలన్నారు. కార్పొరేటర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిజెపిలో చేరడం జరిగిందన్నారు.

**మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి పార్లమెంటు బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని కోరుతూ మౌలాలీ డివిజన్ కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మల్కాజ్‌గిరి నుంచి బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి బిజెపికి ఓటు వేయాలని కోరారు.



### ఈటల సమక్షంలో చేరికలు

**నాగారం:** నరేంద్రమోడీ మూడవ సారి ప్రధాన మంత్రి కావడం ఖాయమని మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం అఖిల భారత వంశరాజ్ వంశరాజ్ అన్నదాన సత్రం నిర్మాణ కమిటీ అధ్యక్షులు, బిఆర్ఎస్ నాయకులు చిందం మల్లేష్ వంశరాజ్,శ్యామల శంకర్ వంశరాజ్,రాజు వంశరాజ్,రాజేష్ వంశరాజ్‌లు ఈటెల రాజేందర్ సమక్షంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈటల రాజేందర్ వారికి కండువా కప్పి బిజెపిలోకి ఆహ్వానం తెలిపారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు విక్రంరెడ్డి, నాయకులు పల్లె సత్యం, తిరుమలరెడ్డి, అమర్ మోహన్ రెడ్డి, అక్కల సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

## క్రీడ



# పోరాడిన బెంగళూరు
# హైదరాబాద్ హ్యాట్రిక్

**బెంగళూరు :** హైదరాబాద్ హ్యాట్రిక్ కొట్టింది. బెంగళూరును 25 పరుగుల తేడాతో ఓడించింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 287 పరుగులు చేసింది. హెడ్ (102), క్లాసెన్ (67) అభిషేక్ శర్మ (34), అబ్దుల్ సమద్ (37*), మార్‌క్రమ్ (32*) విశ్వరూపం చూపారు. అనంతరం బ్యాటింగ్ చేసిన బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 262 పరుగులు చేసింది. దినేశ్ కార్తిక్ (83), డుప్లెసిస్ (62), కోహ్లీ(42) చెలరేగారు. హైదరాబాద్ బౌలర్లలో కమిన్స్ 3, మార్కండే 2, నటరాజన్ ఒక్క వికెట్ తీశారు.

**మళ్లీ రికార్డు బ్రేక్**

హైదరాబాద్ జట్టు తన రికార్డును తానే బ్రేక్ చేసి మరో సంచలనం సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన జట్టుగా మరోసారి రికార్డు నమోదు చేసింది. ఈ సీజన్‌లోనే హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో ముంబయిపై 277/3 చేసిన స్కోరును ఇప్పుడు దాటేసింది. తాజాగా బెంగళూరు జట్టుపై 3 వికెట్లు కోల్పోయి 287 పరుగులతో సత్తాచాటింది. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (102; 41 బంతుల్లో 9 ఫోర్లు, 8 సిక్స్‌లు) వీరవిహారం చేశాడు. వన్‌డౌన్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ (67; 31 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు) సిక్సర్ల వర్షం కురిపించాడు. ట్రావిస్ హెడ్ బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడుతూ 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతడు మరో 19 బంతుల్లో మూడంకెల స్కోరు అందుకున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ 23 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. చివర్లో అబ్దుల్ సమద్ (37*; 10 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో హైదరాబాద్ రికార్డు స్కోరు సాధించింది.

**ఐపీఎల్ చరిత్రలో అత్యధిక టాప్ 5 స్కోర్లు ఇవే..**

హైదరాబాద్ 287/3 x బెంగళూరు
హైదరాబాద్ 277/3 x ముంబయి
కోల్‌కతా 272/7 x ఢిల్లీ
బెంగళూరు 263/5 x పుణె
లక్నో 257/5 x పంజాబ్

# ఐపిఎల్ ఫ్రాంచైజీలకు బిసిసిఐ వార్నింగ్!

**ముంబయి :** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024 ప్రసార నియమాలకు సంబంధించి బిసిసిఐ సంచలన నిర్ణయం తీసుకుంది. లైవ్ గేమ్‌ల ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం పట్ల కఠిన చర్యలు తీసుకునే ఆలోచనలో ఉంది. ఇటీవల టీమ్ఇండియా మాజీ ప్లేయర్ మ్యాచ్ జరుగుతుండగా తన పిక్చర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దీంతో అతడు ఐపిఎల్ పార్ట్‌నర్స్ స్టార్ స్పోర్ట్స్, వయాకామ్ 18 మీడియా బ్రాడ్‌కాస్టింగ్ రైట్స్‌ని ఉల్లంఘించినట్లు అయింది. ఈ ఘటనతో కామెంటేటర్‌లు లైవ్ మ్యాచ్ ఫొటోలు, వీడియోలు పోస్టు చేయడంపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఈ వ్యవహారాలను పర్యవేక్షించే బిసిసిఐ అధికారి, తక్షణమే ఫొటో పోస్టు చేసిన మాజీ ఆటగాడిని బాధ్యతల నుంచి తొలగించమని సూచించారు. ఇలానే సోషల్ మీడియాలో పోస్టులు చేసిన ఓ ఐపిఎల్ టీమ్‌కు రూ.9 లక్షల జరిమానా విధించారు. ఇలా ప్రసార నిబంధనలు ఉల్లంఘించే ప్లేయర్‌లు, కామెంటేటర్‌లు, ఐపిఎల్ టీమ్ ఓనర్లకు బిసిసిఐ కొత్త నిబంధనలు అమలు చేస్తోంది.

**నియమాలు ఉల్లంఘిస్తే చర్యలు**

ఓ బిసిసిఐ అధికారి రీసెంట్‌గా మీడియాతో మాట్లాడాడు.'ఐపిఎల్ హక్కుల కోసం ప్రసారకర్తలు పెద్ద మొత్తంలో డబ్బు చెల్లించారు. కామెంటేటర్‌లు సోషల్ మీడియాలో మ్యాచ్ రోజున వీడియోలు లేదా ఫొటోలు పోస్ట్ చేయకూడదు. కొందరు కామెంటేటర్‌లు ఇన్‌స్టాగ్రామ్ లైవ్, గ్రౌండ్ నుంచి ఫొటోలు పోస్ట్ చేసిన సందర్భాలు ఉన్నాయి. ఒక వీడియోకు మిలియన్ వ్యూస్ వచ్చాయి. ఐపిఎల్ టీమ్‌లు కూడా లైవ్ గేమ్‌ల వీడియోలను పోస్ట్ చేయలేవు. పరిమిత సంఖ్యలో ఫొటోలు పోస్టు చేయడానికి మాత్రమే టీమ్‌లకు అవకాశం ఉంటుంది. అలానే అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లో లైవ్ మ్యాచ్ అప్‌డేట్‌లను షేర్ చేయగలరు. ప్రసార నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఫ్రాంచైజీకి జరిమానా విధిస్తాం' అని పేర్కొన్నారు.

**ఐపిఎల్ ప్లేయర్‌లు, సిబ్బందిపై నిఘా**

ప్రతి ఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండేలా, ఐపిఎల్ మ్యాచ్‌లకు హాజరైన కామెంటేటర్‌లు, టీమ్‌లు, ప్లేయర్‌లు, ఇతర సిబ్బంది పోస్ట్ చేసే కంటెంట్‌ను పర్యవేక్షించడానికి బిసిసిఐ నిర్దిష్ట సిబ్బందిని కేటాయించింది. కొంతమంది ఆటగాళ్ళు మ్యాచ్ రోజులో పోస్టు చేసిన ఫోటోలు కూడా తొలగించమని అడిగిన సందర్భాలు ఉన్నాయని బిసిసిఐ అధికారి వివరించారు.

# నా పేరులో 'మహీ' ఉండటం గర్వంగా ఉంది..



**న్యూఢిల్లీ :** ఐపిఎల్ 17లో ముంబయి ఇండియన్స్‌ను చిత్తుగా ఓడించి నాలుగో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది చెన్నై సూపర్ కింగ్స్. మ్యాచ్ చివర్లో రంగంలోకి దిగిన మహేంద్ర సింగ్ ధోనీ సిక్స్‌లతో అదరగొట్టాడు. దీనిపై ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా స్పందించారు. ఆయన 'ఎప్పటికీ గొప్ప ఫినిషర్' అంటూ మహీపై ప్రశంసల జల్లు కురిపించారు. 'ధోనీ కంటే గొప్పగా రాణిస్తున్న క్రీడాకారుడిని ఒకరినైనా చూపించగలరా? అతడిపై ఉన్న అంచనాలు కావొచ్చు. జట్టు పరిస్థితి తీసుకొచ్చే ఒత్తిడి కారణమై ఉండొచ్చు. ఇవన్నీ ఆయన సంకల్పాన్ని మరింత పెంచాయి. ఆయన ఎప్పటికీ గొప్ప ఫినిషర్. నా పేరులో కూడా 'మహీ' ఉండటం గర్వంగా ఉంది'' అని మహీంద్రా ప్రశంసించారు. ఆయన పోస్టుకు 'మిస్టర్ కూల్' ఫొటోను జత చేశారు. వైరల్‌గా మారిన మహీంద్రా పోస్టుపై ఇప్పటివరకు మిలియన్‌కు పైగా నెటిజన్లు స్పందించారు. 'మహీ అండ్ మహీంద్రా ఎప్పటికీ ఎవర్ గ్రీన్'.. 'ధోనీ కొట్టిన సిక్స్‌లు ఆకాశాన్నంటాయి. లవ్ యూ మహీ' అని కామెంట్లు గుప్పించారు.

## లీల



# యంగ్ టైగర్ తో ఊర్వశి రౌతేలా జిమ్ సెల్ఫీ!

గ్లామరస్ నటి ఊర్వశి రౌతేలా తదుపరి తెలుగు చిత్రం NBK109 చిత్రం లో కనిపించనున్నారు. నందమూరి బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ రోజు ఉదయం ఊర్వశి రౌతేలా తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలోకి వెళ్లి టాలీవుడ్ స్టార్ హీరో, యంగ్ టైగర్ ఎన్టీఆర్తో జిమ్లో దిగిన సెల్ఫీని పోస్ట్ చేసింది. ఈ ఫోటో కి సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించలేదు. ఈ ఫోటోను షేర్ చేసిన కొద్ది సేపటికే సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఫ్యాన్స్ ను విశేషం గా ఆకట్టుకుంటుంది. జూనియర్ ఎన్టీఆర్ ఇటీవలే తన బాలీవుడ్ తొలి చిత్రం వార్ రెండవ సెట్స్లో చేరాడు. హిందీ బిగ్గీలో, అతను స్టార్ నటుడు హృతిక్ రోషన్తో స్క్రీన్ను షేర్ చేసుకోనున్నారు. దేవర: పార్ట్ 1 సెట్స్లో చేరడానికి అతను త్వరలో హైదరాబాదుకు తిరిగి వస్తాడని సమాచారం.




# యాక్షన్ ఎలిమెంట్స్‌తో విశాల్ "రత్నం"ట్రైలర్!

కోలీవుడ్ యాక్టర్ విశాల్ ప్రధాన పాత్రలో, డైరెక్టర్ హరి డైరెక్షన్ లో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్టైనర్ రత్నం. ఏప్రిల్ 26 ప్రపంచ వ్యాప్తంగా థియేటర్ల లో రిలీజ్ కాబోతున్న ఈ చిత్రం పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా నటించిన ఈ చిత్రం కి సంబంధించిన ట్రైలర్ ను మేకర్స్ నేడు రిలీజ్ చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ట్రైలర్ అంతా కూడా యాక్షన్ ఎలిమెంట్స్ తో నిండి ఉంది. ప్రియా భవాని శంకర్ రోల్ సినిమాకి కీలకం అయినట్లు ట్రైలర్ ను చూసి చెప్పవచ్చు. సముద్రఖని, యోగిబాబు, గౌతం వాసుదేవ్ మీనన్ తదితరులు ఈ చిత్రంలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. స్టోన్బెంచ్ ఫిలిమ్స్ మరియు జీ స్టూడియోస్ బ్యానర్లపై కార్తికేన్ సంతానం మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు.

# ఓటిటి లో మంచి రెస్పాన్స్ తో కొనసాగుతున్న 'గామి'



యువ నటుడు విశ్వక్సేన్ హీరోగా చాందిని చౌదరి హీరోయిన్‌గా యువ దర్శకుడు విద్యాధర్ కాగిత దర్శకత్వంలో లేటెస్ట్ గా తెరకెక్కిన యాక్షన్ అడ్వెంచర్ మూవీ గామి. ఇక ఇటీవల బాగా అంచనాలతో థియేటర్స్ లో ఆడియన్స్ ముందుకి వచ్చిన ఈ మూవీ పర్వాలేదనిపించే విజయం అందుకుంది. ఈ మూవీని కార్తీక్ కల్ట్ క్రియేషన్స్, వి సెల్యులాయిడ్, విఆర్ గ్లోబల్ మీడియా, శ్వేత వాహిని స్టూడియోస్ లిమిటెడ్, క్లౌన్ పిక్చర్స్ సంస్థల పై కార్తీక్ శబరీష్, శ్వేతా మొరవనేని గ్రాండ్ గా నిర్మించారు. విషయం ఏమిటంటే, తాజాగా జీ 5 ద్వారా ఓటిటి ఆడియన్స్ ముందుకి వచ్చిన గామి మూవీ మంచి రెస్పాన్స్ తో టాప్ లో కొనసాగుతోంది. మొత్తంగా తమ మూవీకి ఓటిటి ఆడియన్స్ నుండి బాగా స్పందన లభిస్తుండడంతో గామి టీమ్ ఆనందం వ్యక్తం చేస్తోంది.

# రాజ్యాంగాన్ని టచ్ చేస్తే తీవ్ర పరిణామాలు: లాలూ వార్నింగ్

**పాట్నా :** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీపై ఆర్‌జెడి చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ విరుచుకుపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో మూడింట రెండు వంతుల మెజారిటీతో తమ పార్టీ అధికారంలోకి వస్తే ''నూతన రాజ్యాంగ'' రూపకల్పన చేస్తామంటూ బిజెపి నేతలు పదేపదే వల్లిస్తున్నారని, వారిని మోడీ అదుపు చేయలేకపోతున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని బలహీనపరచేందుకు ఎవరు ప్రయత్నించినా ప్రజలు వాళ్ల కళ్లను పెరికివేస్తారని లాలూ హెచ్చరించారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రిగా, మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన లాలూ ప్రసాద్ యాదవ్ పశుగ్రాసం కుంభకోణంలో దోషిగా శిక్షపడి, ప్రస్తుతం బెయిలుపై ఉన్నారు. బిజెపికి చెందిన పలువురు నేతలు తరచు రాజ్యాంగాన్ని మారుస్తామంటూ చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇందువల్ల తలెత్తే పరిణామాలు తెలుసుకోకుండా ఆ పార్టీ నేతలు వ్యాఖ్యలు చేస్తున్నారని, వీరిలో కొందిరికి బిజెపి టిక్కెట్లు కూడా ఇచ్చిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో 400కు పైగా సీట్లు సాధించడమే బిజెపి సారథ్యంలోని ఎన్‌డిఎ లక్ష్యమంటూ ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. పార్లమెంటులో సంపూర్ణ మెజారిటీ ఉంటేనే రాజ్యాంగాన్ని సవరించడం సాధ్యమవుతుందని చెబుతోంది. దీనిపై లాలూ ప్రసాద్ మాట్లాడుతూ, నిజానికి పిఎంకు భయం పట్టుకుందని, తన భయాలను దాచిపెట్టుకునేందుకే బిజెపికి 370కి పైగా సీట్లలో గెలుస్తుందంటూ అతిశయోక్తులతో ప్రచారం సాగిస్తున్నారని అన్నారు. కాగా, రాజ్యాంగంలో మార్పులను లక్ష్యంగా చేసుకుని గతంలో పలువురు బిజెపి నేతలు వ్యాఖ్యలు చేశారు. అయోధ్య సిట్టింగ్ ఎంపి లాలూ సింగ్ ఇటీవలే ఈ తరహా ప్రకటన ఒకటి చేశారు. అయితే, నోరు జారానంటూ తన ప్రకటనను ఆయన వెనక్కి తీసుకున్నారు. రాజస్థాన్ బిజెపి అభ్యర్థి జ్యోతి మీర్థా, పార్టీ కర్ణాటక ఎంపి అనంత్ హెగ్డే సైతం గతంలో ఈ తరహా ప్రకటనలు చేశారు.

# ప్రతిపక్షాలవి అసత్య ప్రచారం

ఎలక్టోరల్ బాండ్ స్కీమ్‌పై ప్రధాని మోడీ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ :** లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయంగా ప్రకంపనలు సృష్టించిన 'ఎలక్టోరల్ బాండ్స్ స్కీమ్'పై ప్రధాని నరేంద్రమోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఎఎన్‌ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో మోడీ మాట్లాడుతూ.. 'ఇది సంపూర్ణ మార్గం అని మేము ఎప్పుడూ చెప్పలేదు' అని అన్నారు. ఎలక్టోరల్ బాండ్లపై ప్రతిపక్షాలు అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. నిజాయితీ తెలిసినప్పుడు ప్రతీ ఒక్కరూ పశ్చాత్తాపపడతారని అన్నారు. ఎన్నికల్లో నల్లధనాన్ని అరికట్టడం కోసమే ఈ స్కీమ్‌ని తీసుకువచ్చామని, ప్రతిపక్షాలు ఆరోపణలు చేసి పారిపోవాలని అనుకుంటున్నాయని అన్నారు. దర్యాప్తు సంస్థల ద్వారా ఏ 16 కంపెనీలపై విచారణ జరిగింది, ఆ కంపెనీలు ఇచ్చిన విరాళాల్లో బిజెపికి 37 శాతం రాగా, 63 శాతం బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలకు వచ్చాయని ప్రధాని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్స్ బిల్లు ఆమోదం పొందినప్పుడు పార్లమెంట్‌లో చర్చ జరిగింది, ఇప్పుడు దీనిని విమర్శిస్తున్న వాళ్లు కూడా ఆ సమయంలో సమర్థించారని ప్రధాని అన్నారు. నల్లధనాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా రూ. 1000, రూ. 2000 డినామినేషన్ కరెన్సీ నోట్లను రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన ప్రస్తావించారు. ఎన్నికల సమయంలో ఈ నోట్లను పెద్దఎత్తున తరలించారని.. నల్లధనాన్ని అంతం చేసేలా చర్యలు తీసుకున్నామని ప్రధాని మోడీ చెప్పారు. ఎలక్టోరల్ బాండ్లపై ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారం చేస్తున్నాయని ప్రధాని మండిపడ్డారు. ఈ పథకం ద్వారా 3000 కంపెనీలు విరాళాలు ఇచ్చాయని, వీటిలో 26 కంపెనీలు ఇడి ద్వారా విచారణ ఎదుర్కొంటున్నాయని, వీటిలో 16 కంపెనీలు బిజెపికి 37 శాతం విరాళాలు ఇస్తే, ప్రతిపక్షాలకు 63 శాతం ఇచ్చాయని ప్రధాని చెప్పారు. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఎలక్టోరల్ బాండ్ల జారీని నిలిపివేయాలని సుప్రీంకోర్ట్ ఎస్‌బిఐని కోరింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా, భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) తన అధికారిక వెబ్‌సైట్‌లో ఎలక్టోరల్ బాండ్ల డేటాను అప్‌లోడ్ చేసింది.

# దేశానికి ఒకే నాయకుడు ఉండాలన్నదే బిజెపి ఆలోచన..

**వాయనాడ్ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బిజెపిపై విరుచుకుపడ్డారు. ఆయన పోటీ చేస్తున్న వయనాడ్ లోక్‌సభ స్థానంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి దేశంలో ఒకే నాయకుడు ఉండాలనే ఆలోచన చేస్తుందని ఆరోపించారు. ఇది దేశ ప్రజలను అవమా నించడమే అని మండిపడ్డారు. భారతదేశం ఒక పూలదండ లాంటిదని, దీంట్లో ప్రతీ పువ్వు గౌరవించబడాలని, అప్పుడే మొత్తం పూల గుత్తికి అందం వస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. భారతదేశానికి ఒకే నాయకుడు ఉండాలనే ఆలోచన ప్రతీ ఒక్క యువ భారతీయుడిని అవమానించడమే అవుతుందని అన్నారు. భారతదేశంలో ఎక్కువ నాయకులు ఎందుకు ఉండ లేకపోతున్నారనిర ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రశిస్తూ.. దీనికి కాంగ్రెస్, బిజెపి మధ్య ఈ ఆలోచనా విధానమే ప్రధాన తేడా అని అన్నారు. దేశంలోని ప్రజల మాట వినాలని, వారి విశ్వాసాలను, భాష, మతం, సంస్కృతిని ప్రేమించాలని, గౌరవించాలని కాంగ్రెస్ కోరుకుంటోందని అన్నారు. కానీ బిజెపి అధిష్టానం మాత్రం ఏదో రకమైన ఆంక్షలు విధించాలని భావిస్తోందని ఆరోపించారు. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో బ్రిటీష్ వారి నుంచి మనకు స్వేచ్ఛ లభించలేదని, భారతదేశాన్ని ప్రజలంతా భావించాలని మేము కోరుకుంటున్నామని రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య ప్రక్రియలను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ రద్దు చేయాలని భావిస్తున్నాయని, తద్వారా దేశంలోని ఇతర భావజాలాన్ని తుంగలో తొక్కాలని చూస్తున్నాయని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆరో పించారు. కేరళను నాగ్‌పూర్ నుంచి ఎందుకు పాలించాలని నిలదీశారు. రాష్ట్రంలోని పాఠశాల ఎలా ఉండాలో ఢిల్లీకి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. వాస్తవానికి కేరళ ప్రజలే భారతదేశానికి అనేక నేర్పించారన్నారు.



ప్రభుత్వం అట్టడుగు వర్గాలకు, ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే అంత ప్రభావవంతంగా ఉంటుందన్నారు. భారతీయ ప్రజలు ఒకరినొకరు అగౌరవపరచుకోవడం, ఒకరినొకరు ద్వేషించడం లేదా ఒకరితో ఒకరు పోరాడాల్సిన అవసరం లేదని, ఐక్యంగా, కలిసి పని చేస్తేనే దేశం గొప్పగా ఉంటుందని సూచించారు.

**రాహుల్ గాంధీ హెలికాప్టర్‌లో ఎన్నికల అధికారుల తనిఖీలు**

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికారులు ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ముఖ్యంగా సరిహద్దుల్లో తనిఖీలను పెంచారు. తాజాగా కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో సోమవారం ఎన్నికల అధికారులు తనిఖీలు నిర్వహించారు. తమిళనాడులోని నీలగిరిలో అధికారులు తనిఖీలు చేపట్టారు. హెలికాప్టర్ ఇక్కడ ల్యాండ అయిన తర్వాత ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు సోదాలు నిర్వహించారని పోలీసులు తెలిపారు. నీలగిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న డిఎంకె అభ్యర్థి ఎ.రాజాకు మద్దతుగా రాహుల్ గాంధీ సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఉదయం హెలికాప్టర్ నీలగిరిలో ల్యాండ్ కాగా.. ఎన్నికల ఫ్లయింగ్ సాక్వడ అధికారులు సోదాలు చేపట్టారు. దాదాపు 10 నిమిషాల పాటు ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో ఎలాంటి నగదు, వస్తువులు లభించలేదని అధికారులు వెల్లడించారు. అనంతరం రాహుల్ గాంధీ ప్రచారం ముగించుకుని తన పార్లమెంటరీ నియోజకవర్గం కేరళలోని వయనాడ్‌కు వెళ్లారు. అక్కడ బహిరంగ సభతో సహా ప్రచార కార్యకలాపాల్లో పాల్గొన్నారు.

# ప్రజల హక్కులు అపహరించేందుకే బిజెపి రాజ్యాంగ సవరణ జపం

## ప్రియాంకాగాంధీ విమర్శ

**జైపూర్ :** ప్రజల హక్కులు అపహరించేందుకే రాజ్యాంగాన్ని సవరిస్తామని బిజెపి ఎన్నికల ప్రచారంలో పదే పదే చెబుతున్నదని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ విమర్శించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని బందికుయి, దౌసాలలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆమె ప్రసంగించారు. ప్రజల హక్కులు లాక్కోవాలని బిజెపి ప్రయత్నం చేస్తోందనీ, అందుకే రాజ్యాంగానికి సవరణలు చేస్తామని ప్రచారం అందుకుందని విమర్శించారు. కేంద్రంలో పదేళ్ళ పాలన ఈనాటికీ కూడా నరేంద్రమోడీ ప్రసంగాల్లో అన్నీ బూటకపు వాగ్దానాలే, ఆయన మిడిమిడి జ్ఞానం, తెలివి తక్కువతనం, అల్పబుద్ధులూ బయటపడుతున్నాయని ప్రియాంకాగాంధీ విమర్శించారు. ''ఆయన రాజ్యాంగానికి సవరణల గురించి మాట్లాడుతున్నారు, ఎందుకంటే ఏం జరుగుతోందో కూడా ప్రజలకు తెలియకుండా ఉండే పద్ధతుల్లో పాలన ఉండాలని ఆయన కోరుకుంటున్నారని, అందుకే ప్రజల హక్కులను సవరణ పేరుతో లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ప్రతిపక్షాల ఆరోపణలపై శుక్రవారంనాడు మోడీ రాజస్థాన్ బార్మర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాతూ, ఈనాడు బి.ఆర్. అంబేద్కరే స్వయంగా వచ్చి ఆయన రాజ్యాంగాన్ని రద్దు చేయాలనుకున్నాగానీ సాధ్యంకాని రీతిలో తాము రాజ్యాంగానికి గొప్ప పవిత్రత, గురుస్థానాన్ని తీసుకొచ్చామని చెప్పడాన్ని ప్రియాంకాగాంధీ తీవ్రంగా విమర్శించారు. ఈనాడు లోక్‌సభకు జరుగుతున్న ఎన్నికలు దేశ రాజ్యాంగాన్ని రక్షించడంకోసమే జరుగుతున్నాయని, కాంగ్రెస్‌పార్టీ ఆ నినాదంతోనే ప్రజల్లోకి వచ్చిందని అన్నారు. తమ ప్రభుత్వానికి రాజ్యాంగమే సర్వస్వమని కూడా మోడీ బహిరంగ సభలో అసత్యాలు వల్లెవేశారని ఆమె విమర్శించారు. ''మోడీజీ రాజస్థాన్‌కు వచ్చారు, ఆయన ప్రసంగం నేను విన్నాను, కానీ అసలు సత్యం ఏమిటంటే అంతా విన్నాక తెలిసింది, ఆయన చెప్పినదాంట్లో పసలేదు, ఆయనదంతా మిడి మిడి జ్ఞానమే. ఆయన ఆరంభశూరత్వంతో ఏదో చేసేస్తామన్నారు, తర్వాత అన్నీ బూటకపు వాగ్దానాలు చేయడం ప్రారంభించారు, చాలా పెద్ద పెద్ద వాగ్దానాలు చేశారు, ఏదీ అమలు చేయలేదు, దేశంలో ఈనాడు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరుగుదల తాండవం చేస్తోంది, ఆయన వాగ్దానాలు ఒక్కటీ నెరవేరలేదు, అందుకే నేను చెబుతున్నా, ఆయనవన్నీ వట్టి డొల్ల మాటలు'' అని ప్రియాంకాగాంధీ విమర్శించారు. ''నిన్న అంబేద్కర్ జయంతి జరిగింది, మోడీ చాలా చాలా చెప్పేశారు ఆయన గురించి, రాజ్యాంగం గురించి మాట్లాడారు, కానీ ఆయనతో పాటు ఆయన మంత్రివర్గ సహచరులు, ఎంపీలు కూడా వివిధ రాష్ట్రాలలో రాజ్యాంగాన్ని మార్చేస్తామని కూడాప్రచారం చేస్తున్నారు'' అని విమర్శించారు



# కూరగాయలు, ఉల్లి,పొటాటో ధరలతో పెరిగిన ద్రవ్యోల్బణం

**న్యూఢిల్లీ :** టోకు ధరల ద్రవ్యోల్బణ సూచీ (డబ్ల్యుపిఐ) మూడు నెలల గరిష్ఠానికి చేరింది. ఫిబ్రవరినెలలో 0.20 శాతంగా ఉన్న డబ్ల్యుపిఐ మార్చి నెలలో 0.53 శాతానికి పెరిగింది. మార్కెట్‌లో కూరగాయలు, ఉల్లిపాయలు, బంగాళ దుంపలు, ముడి చమురు ధరలు పెరగడంతో టోకు ధరల ద్రవ్యోల్బణ సూచీ మార్చి నెలలో మూడు నెలల గరిష్టస్థాయికి చేరుకుంది. ఆహార ద్రవ్యోల్బణం 6.88 శాతానికకి పెరిగింది. ఏడది క్రితం ఇదే మార్చినెలలో ఆహార ద్రవ్యోల్బణం 5.42 శాతంగా మాత్రమే ఉండేది. ఏడాది క్రితం ఇదే మార్చినెలలో కూరగాయల ద్రవ్యోల్బణం మైనస్ 2.39 శాతం నుండి 19.52 శాతానికి పెరిగింది. బంగాళ దుంపల ద్రవ్యోల్బణం 25.59 శాతం నుండి 52.96 శాతానికి పెరిగిపోయింది. అదేవిధంగా ఉల్లిపాయల ధరల కూడా 2023 మార్చినెలతో పోలిస్తే మైనస్ 36.83 శాతం నుండి 56.99 శాతానికి పెరిగిపోయింది. అదేవిధంగా ఆహార ద్రవ్యోల్బణం కూడా 2024 మార్చి నెలలో 4.6 శాతానికి పెరిగింది. ''ప్రధానంగా ఈ ద్రవ్యోల్బణం భారీ పెరుగుదలకు కారణం తృణ ధాన్యాల ధరలు 12 నెలల్లో ఎన్నడూలేనంత భారీగా 9శాతం పెరడమే. పప్పు ధాన్యాలు, కూరగాలు కూడా వరుసగా 17.2 శాతం, 19.5 శాతం మేరకు ఈ మార్చినెలలో పెరిగాయి'' అని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ సీనియర్ డైరెక్టర్ సునీల్ కుమార్ సిన్హా చెప్పారు. ముడి పెట్రోలియం విభాగంలో చూస్తే ఈ ఏడాది మార్చినెలలో ధరలు 10.26 శాతం మేరకకు పెరరిగాయి. గత ఏడాది మార్చిలో 23.53 మేరకు ఈ ధరలు తగ్గాయి. కాగా ఈ ఏడాది మార్చిలో విద్యుత్, మెషీనరీ, ఇతర తయారీ రంగం వస్తులపై ద్రవ్యోల్బణం సానుకూలగా ఉంది. అదేవిధంగా తయారీ ఉత్పత్తుల ధరలు కూడా 0.85 శాతం మేరకు తగ్గాయి.

# కేజ్రీవాల్‌ను జైల్లో కరుడుగట్టిన నేరస్థుడిలా చూస్తున్నారు : మాన్

న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయి తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ సిఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఓ ఉగ్రవాదిలా ట్రీట్ చేస్తున్నారని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ అన్నారు. ఇవాళ తీహార్ జైల్లో ఉన్న కేజ్రీని ఆయన కలిశారు. ఒక గ్లాస్ వాల్ గుండా ఫోన్‌లో కేజ్రీతో మాట్లాడారు. దాదాపు 30 నిమిషాల పాటు వీరు ఫోన్‌లో మాట్లాడుకున్నారు. కేజ్రీతో మీటింగ్ అనంతరం భగవంత్ మాన్ మీడియాతో మాట్లాడుతూ.. 'నేను కేజ్రీని అలా చూసి ఉద్వేగానికి లోనయ్యాను. ఆయనను అక్కడ ఓ కరుడుగట్టిన నేరస్థుడిలా ట్రీట్ చేస్తున్నారు. క్రిమినల్స్‌కు దక్కే సౌకర్యాలు కూడా కేజ్రీకి ఇవ్వడం లేదు. ఆయన చేసిన నేరం ఏంటి..? దేశంలోని అతిపెద్ద టెర్రరిస్టుల్లో ఒకరిని పట్టుకున్నట్లుగా వారు కేజ్రీతో వ్యవహరిస్తున్నారు' అని ఆయన తెలిపారు.